1137
KUB-25

# సోవియట్ విదేశాంగనీతి : భారతదేశం

గ్రంథాలయము ఉన్నవ
సోవియట్ విదేశాంగనీతి
భారతదేశము
311 3

ప్రజాశక్తి కార్యాలయం

# సోవియట్ విదేశాంగనీతి : భారతదేశం

కంభంపాటి సత్యనారాయణ
(జూనియర్)

ప్రజాశక్తి కార్యాలయం
బెజవాడ

ప్రజాశక్తి ప్రచురణ నెం. 65
జూన్ — 1944

★

## విషయసూచిక

1. సోవియట్ ప్రజలకు భారతదేశ నాయకుల జోహారులెందుకు? .... .... 1
2. సోవియట్ యూనియన్ ఇండియాకు ఏం జేసింది? .... .... 11
3. ఫాసిస్టుజపానుతో సోవియట్ యూనియన్ ఎందుకు ఒడంబడిక చేసుకొంది? 18
4. అట్లాంటిక్ ఛార్టరులో స్టాలిన్ ఎందుకు సంతకం చేశాడు? .... .... 30
5. సోవియట్ విజయాలవల్ల సామ్రాజ్యవాదులు బలపడుతున్నారా? .... 37
6. సోవియట్లు స్వాతంత్ర్య మార్గాన్ని చూపుతున్నాయి .... .... 67
7. భారతదేశ సమస్య .... .... 72

★

పది అణాలు

ప్రజాశక్తి ప్రెస్
బెజవాడ.

259

# పరిచయం

సోవియట్ రష్యా ఇండియాకు ఏంచేసింది? ఫాసిస్టుజపాన్‌తో సోవియట్ ఒడంబడిక చేసుకొనుట చైనా స్వాతంత్ర్యపోరాటానికి, సోషలిస్టు సూత్రాలకు విరుద్ధంకాదా? అట్లాంటిక్ ఛార్టర్‌లో స్టాలిన్ ఎందుకు సంతకం చేశాడు?........ మొదలైన ప్రశ్నలు కొందరు సోదరదేశభక్తులను బాధిస్తూ ఉంటాయి. అంతేకాదు; నేడు సోవియట్ ప్రజలు సాధిస్తున్న విజయాలవల్ల ఫాసిజం నాశనమవుతుంది, సోవియట్ స్వాతంత్ర్యం రక్షించబడుతుంది; కాని సోవియట్ విజయాలఫలితంగా బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు బలపడుతున్నారని గూడా కొందరుదేశభక్తులు అభిప్రాయపడతారు.

నేటి ప్రపంచరాజకీయాల్లో ప్రధాన ప్రజాశక్తిగా పరిణమిస్తున్న సోవియట్ల విదేశరాజ్యాంగ వైఖరికి సంబంధించిన ఈ అపోహలకు సమాధానములిచ్చుటయే ఈ చిన్నపుస్తకం యొక్క ఉద్దేశం.

సోవియట్ విదేశరాజ్యాంగవైఖరిని గురించి, సోవియట్ సోషలిస్టు నిర్మాణ ఐక్యతలను గురించి మనదేశ జాతీయనాయకుల అభిప్రాయాలతో ఈపుస్తకం ప్రారంభించబడింది. "తమ మాతృదేశమునే గాక, ప్రపంచ నాగరికతా స్వాతంత్ర్యాలను రక్షిస్తున్నందులకై" మన దేశనాయకులు సోవియట్ ప్రజలను ఎలా అభినందిస్తున్నదీ వివరించబడింది.

తరువాత, ప్రపంచరాజకీయాల్లో సోవియట్‌రష్యాకు గల స్థానం, తన స్థానాన్నిబట్టి ఇతరదేశాలకు ప్రత్యక్షంగా తోడ్పడుటకు గల అవకాశాలు, 26 సంవత్సరాల నుంచి సోవియట్ అనుసరించిన విదేశరాజ్యాంగ పంథావల్ల సోవియట్‌ప్రజలే గాక స్వాతంత్ర్యాన్ని కోరే ప్రజలందరూ ఎలా బలపడగల్గిందీ, వివరించబడింది. సోషలిజాన్ని, స్వాతంత్ర్యపోరాటాలను నాశనంగావించాలని 25 సంవత్సరాల నుంచి కుట్రలు పన్నుతున్న

సామ్రాజ్యవాదుల పరస్పరవైరుధ్యాలను ఉపయోగించి స్వాతంత్ర్యపోరాటాలను బలపరుచుటకై సోవియట్ యూనియన్ ఎలాకృషిచేసిందీ, జపాన్‌తో ఒడంబడిక చేసుకొనుటద్వారా చైనా స్వాతంత్ర్యపోరాటానికి, ఫాసిస్టు వినాశనానికి ఎలా దారితీస్తున్నదీ, వివరించబడింది.

అన్నిటికంటే ముఖ్యవిషయం — సోవియట్ విజయాలవల్ల ఫాసిస్టు శక్తులు నాశనమగుటయేగాక సామ్రాజ్యవాదుల ఆధిపత్యం గూడా ఎలా బలహీనమగుచున్నదీ సమగ్రంగా చర్చించబడింది. సోవియట్ విజయాలు సోవియట్ స్వాతంత్ర్యాన్ని రక్షించుటయే గాక, ప్రపంచప్రజల స్వాతంత్ర్య పోరాటాలకు చేయూతనిచ్చుటకు ఎలా తోడ్పడుతున్నదీ, వివరించబడింది.

యుద్ధం ఆఖరిఘట్టాలలో ప్రవేశించి ఫాసిస్టువినాశనం దగ్గరకు వస్తున్నకొలదీ, బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్య ప్లానులన్నిటినీ భగ్నంగావిస్తూ, రవీంద్రుడు ఆశించిన నూతన ప్రజాప్రపంచానికి సోవియట్లు నూతనపునాదులు ఎలా వేస్తున్నదీ, తెలియజేయబడింది. ఫాసిస్టులను నాశనం గావించుటద్వారా మనదేశ స్వాతంత్ర్యం గూడా ఎలా సంపాదించుకోగలమో, ప్రపంచప్రజలందరితోపాటు మనకు గూడా సోవియట్ రాజకీయాలు ఎలా తోడ్పడిందీ తెలియజేయుటకు ఈ పుస్తకంలో ప్రయత్నించబడింది.

సోవియట్ విదేశ రాజకీయాలను గురించి ఈ పుస్తకాన్ని చదువుట వల్ల, ప్రస్తుతం సోదరదేశభక్తులను ఎదుర్కొంటున్న అపోహలు తొలగగలవని ఆశిస్తూ ఈ పుస్తకాన్ని ప్రకటిస్తున్నాం.

— సంపాదకవర్గం.

# సోవియట్ ప్రజలకు
# భారతదేశ నాయకుల జోహారులెందుకు?

ఇంకో అరగంటకు రవీంద్రనాథటాగూర్‌కు ఆపరేషన్ చేస్తారు. పక్కనే ఉన్న ప్రొఫెసర్ మహాలనోబిస్‌నుచూసి రవీంద్రుడు అడిగాడు:

"రష్యానుగురించి తాజావార్తలు ఏమిటి?"

"అంతా ఉత్సాహకరంగానే ఉంది. శత్రువాదిని రష్యన్లు జయప్రదంగా ఎదుర్కొంటున్నారు." అన్నాడు * మహాలనోబిస్.

రవీంద్రుని ముఖం వికసించింది.

"జయప్రదంగాక మరేమవుతుంది? రష్యన్లు గెలిచితీరాలి. గెలుస్తారుగూడా. భవిష్యత్తును నిర్మించగలిగినవారు వారే!" అన్నాడు రవీంద్రుడు.

మహాలనోబిస్‌తో రవీంద్రుడు పల్కిన ఆఖరుమాటలు అవి. ఆపరేషన్ జరిగింది. దానితోనే రవీంద్రుడు మృత్యుముఖాన్ని సమీపించాడు.

ప్రపంచ ఖ్యాతిగాంచి, భారతదేశకీర్తిని ప్రపంచమంతటా చాటిన విశ్వకవి రవీంధ్రుడు మరణించాడు.

కాని అతని కోర్కెలన్నీ సఫలిస్తున్నాయి. రష్యన్లు గెలుస్తున్నారు. సోవియట్ ప్రజల మహత్తర విజయాలు ప్రపంచ ప్రజల నందరిని ఉత్తేజపరుస్తున్నాయి.

సోవియట్ ప్రజాశక్తిలో రవీంద్రునికి ఇంత దృఢవిశ్వాసం కల్గుటకు కారణం ఏమిటి? 'భవిష్యత్తును నిర్మించగలవారు సోవియట్ ప్రజలే' అను నిశ్చలనమ్మకం రవీంద్రునికి ఎలా ఏర్పడింది?

---

* ప్రొఫెసర్ మహాలనోబిస్ ప్రపంచఖ్యాతిగన్న గణితశాస్త్రజ్ఞుడు. రవీంద్రనాథటాగూర్ స్థాపించిన 'విశ్వభారతి'కి ఒకప్పుడు కార్యదర్శిగా పని చేశాడు. ఈ సంవత్సరం నవంబర్‌లో పాట్నాలో ఉపన్యసిస్తూ మహాలనోబిస్ తనతో రవీంద్రుడు పల్కిన పై ఆఖరి మాటలను ఉదహరించాడు. (1943 నవంబరు 20: అమృతబజార్ పత్రిక)

సోవియట్ ప్రజలయందుగల గాఢనమ్మకాన్ని 1930 లోనే వెలిబుచ్చాడు రవీంద్రుడు. మాస్కో రచయితల సంఘంలో మాట్లాడుతూ రవీంద్రుడు ఇలా చెప్పాడు :

"నూతన జీవితాన్ని సృష్టించగల స్వేచ్ఛా మానవశక్తి కొరకు నేను కలలు గన్నాను. ఆధునిక నాగరికతక్రింద మానవశక్తిఅంతా సమాజంతో సంబంధం లేకుండా బంధించబడుతోంది. ఈ బంధనాలకు స్వస్తిచెప్పి మీదేశంలో మీరు నూతన సమాజాన్ని సృష్టిస్తున్నారు.

మీదేశంలో ప్రతివ్యక్తికి శాస్త్రీయమైన విద్యనిచ్చుటయేగాక, నూతన జీవితాన్నిసృష్టించగల వ్యక్తిత్వాన్నిగూడా అతనికి కలుగజేస్తున్నారు. ఈవిధంగా మీరు మానవజాతియొక్క అత్యున్నత ఆదర్శాలను సాధిస్తున్నారు. ఎంతోకాలం నుంచి అణిగిపడి దాగియున్న అతీత మానవశక్తులన్నీ బహిర్గతమగుటకు, ప్రపంచంలో మొట్టమొదటిసారిగా మీరు అవకాశాలను కల్పిస్తున్నారు. మీకృషికి నాహృదయపూర్వక అభివందనాలు "

విశ్వమానవ సౌభ్రాతృత్వమును జీవితపర్యంతం బోధించి దానికొరకు కలలు గన్న రవీంద్రుడు సోవియట్ సమాజ నిర్మాణాన్నిచూసి ఈఆశయాన్ని సోవియట్ ప్రజలు సాధించారనినమ్మి తన సంతోషాన్ని వెలిబుచ్చుచూ సోవియట్‌విజయాన్ని కోరాడంటే ఆశ్చర్యమేముంది?

* * * *

సోవియట్ విప్లవం జరిగి 26 సంవత్సరాలు గడిచినయి. 26 వ రష్యన్ విప్లవదినోత్సవాన్ని ఈ సంవత్సరం నవంబరు 7 వ తేదీని ప్రపంచ ప్రజలందరూ అన్ని దేశాల్లో బ్రహ్మాండంగా జరిపారు. మనదేశంలోగూడ గ్రామగ్రామాల్లో రష్యన్ విప్లవదినోత్సవాన్ని జరిపి సోవియట్ ప్రజలకు మన జోహారులర్పించాం' ఆనాడు కాంగ్రెసు వర్కింగుకమిటీ సభ్యురాలైన సరోజినీనాయుడు సోవియట్ ప్రజలకు పంపిన సందేశం ఇది :

"ఓ వీర ప్రజానీకమా! భారతదేశనాయకులు ఇంకా జైళ్లలో బంధించబడి యుండుటవల్ల స్వయంగా మీకు అభివందనాలు తెలియజేయలేరు. ఆ మహాభాగ్యం నాకు లభించింది.

26 సంవత్సరాలక్రితం, పాతరష్యా శిథిలమయి నూతన రష్యా ఆవిర్భవించింది. ఎన్నోశ్రమలకోర్చి మీరీ మహోజ్వల విజయాన్ని సాధించారు. ఆ విజయం యొక్క 26 వ వార్షికదినోత్సవంనాడు భారత దేశం తరఫున మీకివేమాకృజ్ఞతాభివందనాలు.

నూతన రష్యా బయలుదేరి 25 ఏండ్లు దాటినవి. కాని ఈ 25 ఏండ్లు కాల చక్రంలో ఒక్క-తృటికాలం! ఇంత స్వల్పకాలంలో మీరు అద్భుతమైన ఘనకార్యాలను సాధించారు. ఆశ్చర్యంతోనూ, గర్వంతోనూ మీ అమోఘ కృషిని మేం పరికిస్తూ వచ్చాం.

విచ్ఛిన్నమైపోతున్న ఒక సామ్రాజ్య శిధిలాలపై అద్భుతమైన ఒక ప్రజాస్వామ్య ప్రపంచాన్ని మీరు నిర్మించారు. కన్నీటి కాల్వలతోనూ, రాక్తధారలతోనూ మీరీ అద్భుతమైన నిర్మాణాన్ని సాగించారు. విజయసాధనంపట్ల చెక్కుచెదరని నమ్మకంతోనూ, భవిష్యత్తుపైగల అచంచల విశ్వాసంతోనూ, ఈ నిర్మాణాన్ని కొనసాగించారు. రైతును నికృష్టదశనుండి తొలగించి స్వాతంత్ర్యరథంలో కూర్చోబెట్టారు. ప్రజానీకాన్నంతనూ నిరంకుశ ప్రభువులందరూ రూపంలేని ఒక మట్టిముద్దగా తయారుచేస్తే, ఆమట్టిముద్దలోనుంచే ఈనాడు అసంఖ్యాకులైన వీరాధివీరులను సృష్టించారు. ఆవీరసోవియట్ ప్రజానీకమే నేడు ప్రపంచనాగరికతాస్వాతంత్ర్యాలకు రక్షకులుగా తయారైనారు.

స్వాతంత్ర్య సంపాదనకొరకు ఇతరదేశాలతోపాటు భారతదేశంగూడా పడరాని పాట్లు, ఆవేదనను అనుభవిస్తోంది. మాకందరికి మీ అసమాన ఆదర్శం ఒక గొప్ప ఆశాజ్యోతిగా ఉండి మమ్ములనందరిని ఉత్తేజపరుస్తోంది. ఓ సోవియట్ ప్రజానీకమా! ఇవే మీకు మా జోహారులు! మా ప్రేమాభినందన కానుకలివిగో !! "

26 సంవత్సరాల క్రిందట రష్యన్ ప్రజలు సాధించిన సోషలిస్టు విప్లవానికి మాత్రమేకాదు జోహారులు; ఫాసిస్టు సామ్రాజ్యవాదులను వీరోచితంగా ప్రతిఘటిస్తూ ప్రపంచ నాగరికతా స్వాతంత్ర్యాలను నేడు రక్షిస్తున్న సోవియట్ వీరప్రజానీకానికి శ్రీమతి సరోజినీనాయుడు భారతీయులందరి తరపునా జోహారు లర్పిస్తోంది. అనగా ఫాసిస్టు దురాక్రమణ క్రిందికి పోకుండా భారతదేశాన్నిగూడా సోవియట్ సైన్యాలు రక్షిస్తున్నాయి. గొప్ప ఫాసిస్టు వ్యతిరేక సాంప్రదాయంగల మన జాతీయ కాంగ్రెసుసంస్థ, భారతదేశ ప్రజలతరఫున ఫాసిస్టులను దునుమాడుతున్న సోవియట్ యూనియన్‌కు జోహారు లర్పించకుండా ఎలా ఉండగలదు ?

* * * *

1941 జూన్ 22 వ తేదీన సోవియట్ యూనియన్‌మీద హిట్లర్ దాడి చేశాడు. దాడి ప్రథమదశలో నాజీసైన్యాలు లక్షలాదిగా పశ్చిమసోవియట్ ప్రాంతం మీద విరుచుకుపడ్డాయి. దేశంలోకి చొచ్చుకుపోతున్న నాజీ దురాక్రమణను ప్రపంచ ప్రజలంతా ఖండించారు. 1941 డిసెంబర్ 31 వ తేదీన బార్డోలీలో

సమావేశమైన కాంగ్రెసు వర్కింగుకమిటీ ఈక్రింది తీర్మానాలద్వారా భారతదేశ ప్రజల సానుభూతిని సోవియట్ ప్రజలకు అందజేసింది.

"వైజ్ఞానికంగానూ, సాంఘికంగానూ మానవజాతి అభివృద్ధి మార్గంలో గొప్ప ప్రాముఖ్యత వహించే కొన్ని ఆదర్శములకొరకు సోవియట్ యూనియన్ పాటుబడుతోంది. సోవియట్ ప్రజలు సాధించిన విజయాలు, వారికృషి - అంతా దురదృష్టవశాత్తున యుద్ధభీభత్సంలోనేగనక నశించడమే జరిగితే, అది చాలా విషాదకరమైన విషయమని కాంగ్రెసు వర్కింగుకమిటీ భావిస్తోంది. తమ దేశాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనుటకై సోవియట్ ప్రజలు ప్రదర్శిస్తున్న అమోఘ ధైర్యసాహసాలను, ఆత్మత్యాగాన్ని కొనియాడుతూ వారికి మాహృదయ పూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాం."

మానవజాతి అభివృద్ధికి తోడ్పడే ఉన్నత ఆదర్శములకొరకు సోవియట్ యూనియన్ కృషిచేస్తోందని కాంగ్రెసు నాయకులు భావించారు. అజేయమైన ప్రజాశక్తుల కృషివల్ల సోవియట్ యూనియన్ నిలబడి విజయాలను పొందుతోంది. వైజ్ఞానికంగానూ, సాంఘికంగానూ సోవియట్ ప్రజల ఆదర్శాలు ప్రపంచ ప్రజల నందరిని మరింత ఆకర్షిస్తున్నాయి.

*    *    *    *

సోవియట్ ప్రజల త్యాగదీక్షను అభినందిస్తూ గాంధీజీ 15-11-28 వ తేదీన తన "యంగ్ ఇండియా" పత్రికలో ఈ విధంగా వ్రాశాడు :

"హింసాపద్ధతులపై శాశ్వత నిర్మాణాన్ని దేన్నీ నిలపలేమని నా దృఢ నమ్మకం. దానిసంగతికేమి- బోల్షివిక్కుల ఆదర్శాలు అసంఖ్యాక స్త్రీపురుషుల స్వచ్ఛమైన త్యాగదీక్షమీద ఆధారపడి ఉన్నవనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. లెనిన్ వంటి మహాపురుషుల త్యాగాలతో పరిశుద్ధమైన ఆదర్శం వ్యర్థం కాజాలదు. వారి త్యాగం, ఆత్మార్పణలు ఆచంద్రార్కంగా వెలుగొందుతూ ఉంటాయి"

బోల్షివిక్ సిద్ధాంతాలతో భేదించినా బోల్షివిక్కుల ఆదర్శకృషిని, ఆదర్శాలను గాంధీజీ అభినందించక తప్పలేదు.

*    *    *    *

నేటి సోవియట్ ప్రజల విజయాలు ప్రపంచాన్నంతా రక్షిస్తున్నవని అంగీకరిస్తూ, అ. భా. ముస్లింలీగ్ వర్కింగుకమిటీ సభ్యుడైన మియాన్ బషీ అహ్మద్ ఈ దిగువ విధంగా చెప్పాడు :

"స్వాతంత్ర్య ఆశయం కొరకు సోవియట్‌యూనియన్ సాగిస్తున్న అద్భుత పోరాటం ప్రపంచాని కంతకూ ఆశ్చర్యం కల్గించింది. ఫాసిస్టు దురాక్రమణ

దారులకు వ్యతిరేకంగా సోవియట్ ప్రజలు నిలబడి అమోఘంగా ప్రతిఘటించుట వల్లనే ప్రపంచమంతా నాశనం గాకుండా రక్షించబడినదనే విషయం సర్వజనవిదితం. అందువల్ల రష్యాకు మనం కృతజ్ఞత చూపవలసియున్నది. సోవియట్ ప్రజలు సాధిస్తున్న విజయాన్నిబట్టి చూస్తే, సోవియట్ విధానంలో (ఏ లోపాలున్నప్పటికీ) చాలా సత్యం ఉన్నదనే చెప్పాలి. ఇండియాలోని ప్రజలు, జాతులు-అందరం సోవియట్ యూనియన్‌నుంచి పాఠం నేర్చుకొని, మన దేశపరిస్థితులనుబట్టి ఆ విలువగల పాఠాన్ని వర్తింపచేసుకొనుటకు ప్రయత్నించుట అవసరం."

సోవియట్ యూనియన్ ఐక్యతసాధించింది. మనదేశంలో జాతీయైక్యత లేదు. ప్రజలు, జాతులు-అందరూ ఐక్యమై దేశస్వాతంత్ర్యానికి కృషిచేయాలనే బషీర్ అహమ్మద్ ఆందోళన.

* * * *

సోవియట్ యూనియన్‌లోని వివిధజాతుల ఐక్యత మనకు పాఠంచెప్తోందని ఉదహరిస్తూ 'మధ్యరాష్ట్రాలు, బీరార్' ప్రాంత ముస్లింలీగ్ కార్యదర్శి అయిన మహమ్మద్ అష్గర్ ఈ దిగువవిధంగా చెప్తున్నాడు:

"నిన్న మొన్నటివరకూ సోవియట్ యూనియన్ అంటే ఒక స్వప్న భూమిగాఉండేదినాకు. అదంతా ఒక మిధ్యగా ఉండేది. కాని నాజీలకు వ్యతిరేకంగా సోవియట్లు సాగిస్తున్న పోరాటం, నాజీహంతకులక్రింద సోవియట్‌భూమి పూర్తిగా నాశనం అవుతుందని ప్రపంచమంతా అనుకున్న సమయంలో, సోవియట్ ప్రజలు సాధించిన విజయం మన భారతీయులందరికి ఒక గొప్ప ఐక్యతా పాఠాన్ని నేర్పినా. ఎంత పెద్దకష్టాలనైనా ఐక్యతాసంఘటన ఓడించగలదని బోధపడింది."

సోవియట్ యూనియన్‌ను గురించి నిన్నమొన్నటివరకూ స్పష్టమైన అభిప్రాయాలు లేనటువంటి వారికి సైతం సోవియట్ విజయాలు గొప్ప ఐక్యతా పాఠాన్ని నేర్పుతూ ఆదర్శంగా పనిచేస్తున్నవనుటలో సందేహమేముంది?

* * * *

వివిధజాతుల స్వయంనిర్ణయహక్కును గుర్తించినందువల్ల సోవియట్ యూనియన్‌లో ఐక్యత కుదిరినప్పుడు, వివిధదేశ ప్రజలక్షేమానికి వివిధదేశాలు ఐక్యమవుతున్నప్పుడు మనదేశప్రజలు ఎందుకుఐక్యంకాలేం? అని ప్రశ్నిస్తున్నాడు-నాగపూర్‌సిటీ ముస్లింలీగ్ అధ్యక్షుడైన అబ్బాస్ అలీఖాన్:

"వారివారి సిద్ధాంతాలమధ్య ఎంతోభేదమున్నప్పటికీ, ప్రజలందరి ఉమ్మడి క్షేమానికై యునైటెడ్‌స్టేట్స్, బ్రిటన్, రష్యాలు ఐక్యమయినప్పుడు, మనదేశ

ప్రజలందరి ఉమ్మడి క్షేమానికై మనలోగల భేదములను రూపుమాపి మనందరం ఎందుకు ఐక్యంకాలేమో నాకు బోధపడుటలేదు.

రష్యా ప్రదర్శిస్తున్న అమోఘ త్యాగశక్తికి మూలకారణం — మన దేశంలో వలె సోవియట్ యూనియన్‌లో గూడా రష్యన్లు, కోసక్కులు, టార్టారులు, ఉజెబెక్కులు మొదలైన జాతులున్నప్పటికి, వారికందరికి స్వయం నిర్ణయ హక్కు ఉండుటయే.

అక్కడ రష్యన్లతో భుజంభుజం కలిపి ముస్లిములుగూడా తమ స్వాతంత్ర్యం కొరకు రక్తాన్ని ధారపోయుటకు కారణం ఏమిటి? రష్యన్ల స్వాతంత్ర్యం తమ స్వాతంత్ర్యమేనని, స్వాతంత్ర్యమనేది ఒకరి గుత్తసొమ్ము కాదని వారికి తెలియుట వల్లనే ఆత్యాగానికి తయారైనారు.

అదేవిధంగా, ఇండియాలోని ప్రధానపార్టీ అయిన కాంగ్రెసుసంస్థ ముస్లింల కోర్కె అయిన స్వయనిర్ణయంసూత్రాన్ని అంగీకరిస్తే, మన దేశస్వాతంత్ర్య సమస్య తీరిపోయి సోవియట్ ప్రజలవలె మనంగూడా అందరం కలిసి స్వాతంత్ర్యఫలితాలను అనుభవించవచ్చును."

* * * *

ఢిల్లీ ముస్లింలీగ్ పత్రిక 'మన్షూర్' ఎక్కువ పలుకుబడిగల్గిన ముస్లిం పత్రిక. జిన్నాగారి ఆధ్వర్యాన ప్రకటించబడుతూఉంది. సోవియట్ యూనియన్ సాగిస్తున్న యుద్ధాన్నిగురించి ఈవిధంగా వ్యాఖ్యానం చేస్తోంది :

"ఫాసిస్టు జర్మనీని నిజంగా వ్యతిరేకిస్తున్నది సోవియట్ రష్యాయే. ఫాసిస్టులను యుద్ధరంగంలో మాత్రమేగాక, సిద్ధాంతరీత్యాగూడా ప్రపంచాధిపత్య సూత్రాలను, జాతీయ దురహంకార సూత్రాలనుగూడా ఎదిరించి పోరాడుతోంది హిట్లరుతో బ్రిటిష్, అమెరికన్లు పోరాడుతున్నారనుటలో సందేహంలేదు. కాని వారు అనుసరించేదిగూడా హిట్లరు సూత్రాలే. తమ ఆధిపత్యం క్రింద పెద్దపెద్ద రాజ్యాంగములను స్థాపించుకోవాలని వారి ఆశయం. సోవియట్ యూనియన్ నుంచి వారు పాఠం నేర్చుకొనవలసియున్నది. శాంతి అభ్యుదయాలకు సరియైన మార్గం సోవియట్ చూపుతోంది. చర్చిల్, రూజువెల్ట్, అమెరీ, హాలిఫాక్సులు కాదు."

* * * *

ఈమధ్యనే ప్రకటించబడిన కొన్ని ముఖ్య సోవియట్ రాజ్యాంగ సంస్కరణలయెడల మనదేశంలోని ముస్లిం పత్రికల వ్యాఖ్యానాలు చూడండి. ఈనూతన రాజ్యాంగ సంస్కరణల ప్రకారం సోవియట్ యూనియనులోని వివిధ రిపబ్లి

క్కులు, వారిసైన్యాలు వారు నిర్మించుకొనుటకు, వారి విదేశాంగ వ్యవహారాలు వారే నడుపుకొనుటకు, సంపూర్ణ హక్కులు కల్పించబడినాయి.

ఈ సంస్కరణలను ప్రజాస్వాతంత్ర్యాన్ని బలపరిచే పత్రికలన్నీ ప్రపంచ మంతటా, గొప్ప విప్లవకరమైన మార్పులని ఆహ్వానించినాయి. ఢిల్లీ 'మన్షూర్' పత్రిక ఈదిగువవిధంగా వ్రాసింది :

" ఈ సోవియట్ నిర్ణయంవల్ల ప్రతి సోవియట్ రిపబ్లిక్కుకూడా సంపూర్ణ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పొందుతోంది. విప్లవం జరిగినప్పటినుంచి వివిధ సోవియట్ రిపబ్లిక్కులమధ్యగల సంబంధాలన్నీ పరిపూర్ణ సమానత్వ సూత్రంమీద ఆధారపడిఉన్నాయి సోవియట్ విప్లవంయొక్క పునాదిసూత్రాలే: సమానత్వం, ప్రజాస్వామ్యం. సోవియటు విప్లవం దోపిడీ సిద్ధాంతానికి, ఒక దేశాన్ని మరొకదేశం పీడించే విధానానికి వ్యతిరేకం........ యూనియన్ నుంచి విడిపోయేహక్కు ప్రతి రిపబ్లిక్కుకు ఉన్నప్పటికి, ఆహక్కును ఏ రిపబ్లిక్కు ఎప్పుడూ అమలుచేయలేదు."

లాహోరునుంచి ప్రకటించబడే ముస్లిం పత్రిక ఇన్క్విలాబ్, సోవియట్ సంస్కరణలను " ఈ యుద్ధకాలంలో జరిగిన గొప్ప విప్లవకరమైన మార్పుల"ని వ్యాఖ్యానించింది. కారణం ? "వివిధ రిపబ్లిక్కులలో నివసించే ప్రజలమధ్యగల ఐక్యతను ఈయుద్ధం పూర్తిగా నిరూపించింది."

కలకత్తానుంచి ప్రచురించబడే ఆస్రీ జాదీక్ పత్రిక వ్యాఖ్యానం చూడండి, యుద్ధకాలంలో రాజ్యాంగసంస్కరణలు సాధ్యపడవని వాదించేవారి మొండివాదనను ఖండిస్తూ :

"యుద్ధకాలంలో రాజ్యాంగ సంస్కరణలు—ఎలా సాధ్యమగునో సోవియట్ యూనియన్ గొప్పగా నిరూపించింది. రాజ్యాంగవిధానాన్ని ప్రజాయత్తం చేయుటకు బదులు, ప్రజాసామాన్యంయొక్క ప్రజాస్వామ్య హక్కులను నాశనం చేయుటకు పూనుకునేవారు సిగ్గుపడునట్టుగా సోవియట్ సంస్కరణలు చేస్తున్నాయి."

సోవియట్ రష్యాగూడా బ్రిటీష్ సామ్రాజ్యవాదుల అడుగు జాడలనే అను సరిస్తోందని నిందించేవారి అబద్ధప్రచారాన్ని బట్టబయలుచేస్తూ బొంబాయినుంచి ప్రచురించబడుతున్న "ఖిలాఫత్" పత్రిక ఈ విధంగా వ్రాసింది.

"అలా నిందించేవారు చేసే ప్రచారమంతా కేవలం అబద్ధమనే చెప్పాలి, సోవియట్ యూనియన్‌లోని వివిధ రిపబ్లిక్కుల మధ్యగల ఐక్యత బ్రిటీష్ సామ్రాజ్యంలోని దేశాలమధ్య ఎన్నడూలేదు. కారణం విదితమే........ముడిసరుకులుకొని, తయారైన పారిశ్రామిక వస్తుసామగ్రులను అమ్ముకునే మార్కెట్లక్రింద, సోవియట్

రిపబ్లిక్కులను రష్యా ఎన్నడూ ఉపయోగించలేదు.........మరొక దేశంమీదగాని. మరొక జాతిమీదగాని ఆధిపత్యం సంపాదించి, ఆ దేశంయొక్క పరిశ్రమలను వ్యాపారాన్ని, నాగరికతావిజ్ఞానాలను నాశనం గావించి తాను అనుభవించుటకై సోవియట్ రష్యా ఎన్నడూ ప్రయత్నించలేదు.

బ్రిటిష్ సామ్రాజ్యానికి, సోవియట్ యూనియన్‌కు మధ్య పోలికయేలేదు. నలుపుకు తెలుపుకు మధ్య పోలిక ఏం ఉండగలదు"? అని ఖిలాఫత్ ప్రశ్నిస్తోంది.

* * * *

సోవియట్‌గూడా కేవలం మరొక సామ్రాజ్యవాద దేశమని నిందించేవారికి జవాబిస్తూ బొంబాయిపత్రిక అయిన" "నిజామ్" ఈ విధంగా వ్రాసింది.

"ఇతర దేశాలను బానిసలుగా చేయుటకు సోవియట్ రష్యా ఎన్నడూ ప్రయత్నించలేదు.........నిజానికి, అస్వతంత్ర దేశాలను స్వతంత్ర దేశాలుగా చేయుటకు సోవియట్ ఆశయం.........ప్రస్తుత రాజ్యాంగ సంస్కరణలే దీనికి తార్కాణం. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గౌరవించుటలో సోవియట్‌తో ఏ ఇతర దేశం సరితూగదని ఈ సంస్కరణలవల్ల తేలుతుంది"

యు పి. రాష్ట్రంలోని బిజ్నూర్‌నుంచి ప్రకటించబడే 'మెడీనా' అను ముస్లిం పత్రిక ఈ నూతన సోవియట్ రాజ్యాంగ సంస్కరణలు ప్రపంచ రాజకీయాల్లోనే గొప్ప ప్రభావం కల్గించగలవని వ్రాసింది :

"చిన్న చిన్న యూరోపియన్ దేశాలన్నిటికి సోవియట్ కొత్త మార్గాన్ని చూపింది. ఇక నిర్భయంగా ఎట్టి అనుమానాలు లేకుండా, ఈ చిన్న దేశాలు సోవియట్‌లో చేరవచ్చును. ఆవిధంగా చేస్తే ప్రపంచాన్ని తిరిగి రక్తపాతం చేయుటకు సామ్రాజ్యవాద దోపిడీ గాండ్రకు అవకాశం లేకుండా పోతుంది.

* * * *

సోవియట్ యూనియన్ వైఖరిని మెచ్చుకుంటూ సోవియట్ ప్రజలకు, ఎర్రసైన్యానికి జోహారులర్పిస్తున్న భారతదేశభక్తుల లిస్టుతయారుచేయాలంటే పెద్దదవుతుంది. ఈ పుస్తకంయొక్క ఆశయం అదికాదు. అందువల్ల తనస్వీయ చరిత్రలో జవహర్‌లాల్ సోవియట్ యూనియన్ వైఖరిని గురించి చెప్పిన అభిప్రాయంతో ముగిద్దాం. తన స్వీయచరిత్రలో 362 వ పేజీలో ఈ దిగువ విధంగా వ్రాశాడు :

"మిగిలిన ప్రపంచమంతా క్లిష్టసమస్యలలో చిక్కుకొని క్రుంగిపోతూ అనేక విధాల వెనక్కుపోతూఉన్న సమయంలో. సోవియట్ భూమిలో ఒకగొప్ప నూతన

ప్రపంచం నిర్మించబడుట మన కళ్ళముందరేచూశాం. లెనిన్ మహాశయుని అనుస రిస్తూ రష్యా భవిష్యత్తులోకి దృష్టినంతా ప్రసరింపజేస్తూ రాబోయే పరిస్థితులను గురించి ఆలోచిస్తూఉంటే, మిగిలిన దేశాలన్నీ మృతించిన భూతకాలాన్ని పట్టుకొని గతించిపోయిన యుగాలనాటి వ్యర్థలక్షణాలను రక్షించుటకు పాకులాడుతున్నాయి. ముఖ్యంగా సోవియట్ పరిపాలనా విధానంక్రింద మధ్య ఆసియా ప్రాంతాలలో వచ్చిన అభివృద్ధినిగురించిన రిపోర్టులు నాకు మంచినమ్మకాన్ని కల్గించినాయి. మొత్తంమీద సోవియట్ రష్యాఅంటే నాకు అనుకూలత ఏర్పడింది. అంధ కారంలో చిక్కుకొన్న ప్రపంచానికంతకూ సోవియట్ యూనియన్ యొక్క ఉనికి, ఉదాహరణలు ప్రకాశవంతమైన ఆశాజ్యోతిగాఉండి ధైర్యాన్నికల్గిస్తున్నాయి."

* * * *

సోవియట్ యూనియన్‌ను గురించి భారతదేశనాయకుల అభిప్రాయాలను కొన్నిటిని చూశాం. ఇక సోవియట్లను అభినందించే ఇతరదేశ నాయకులు, శాస్త్ర వేత్తలు అసంఖ్యాకంగా ఉన్నారు. ముఖ్యంగా నేడు ఫాసిస్టుదాడిప్రమాదం ప్రపం చాన్నంతా ఆవరించిన సమయంలో ఏ దేశం, ఏ ప్రజలు, ఏ సైన్యం కనివినిఎరుగ నటువంటి స్వాతంత్ర్యపోరాటం సాగిస్తూ 20 కోట్ల సోవియట్‌ప్రజలు ఫాసిస్టు ప్రపంచాధిపత్యప్లానును భగ్నం కావించినప్పుడు. కోటానుకోట్ల ప్రజలు సోవి యట్లకు తమ కృతజ్ఞతను తెలుపుతున్నారు. 2000 మైళ్ళ పొడవున, బాల్టిక్ సముద్రంనుంచి నల్లసముద్రంవరకూ 2½ సంవత్సరాలపాటు ఒంటరిగా, ప్రతినిమి షము అంగుళం అంగుళానికి శత్రువునెదిర్చి, లక్షలాది దేశభక్తిపూరితమైన సైన్యాలతో వీధివీధికి, ఇంటిఇంటికి పోరాడి ఎర్రసైన్యం నాజీలను హతమార్చుట వల్లనే ఫాసిస్టుశక్తులు క్రమేణా పరాజయం పొందుతూ పతనాన్ని సమీపిస్తున్నాయి. స్టాలిన్‌గ్రాడ్‌వద్ద ఎర్రసైన్యం నాజీసైన్యాలను ఆపనియెడల, కాకసస్ ప్రాంత మంతా హిట్లర్ స్వాధీనమైఉంటే, జపాన్, జర్మనీలు ఇండియాలో కలుసుకుని ఉండేవని, దాని ఫలితంగా ప్రపంచమంతా క్రూరఫాసిస్టుశక్తులు తాండవమాడుతూ ఉండేవని ప్రతి దేశభక్తుడు నమ్ముతాడు. ప్రపంచనాగరికతను, ప్రపంచప్రజల స్వాతంత్ర్యాన్ని సోవియట్‌యూనియన్ కాపాడిందని సరోజినీనాయుడు తన సందే శంలో చెప్పిందంటే, ఇదే అర్థం.

వర్గభేదాలు, జాతిభేదాలు నిర్మూలించుటవల్ల సోవియట్‌యూనియన్ సాధిం చిన బ్రహ్మాండమైన ఐక్యత, స్వాతంత్ర్యరక్షణకై దేశభక్తిపూరితమైన ప్రజా సైన్యం సాధించగల మహత్తరవిజయాలు, అజేయమైన ప్రజాశక్తియొక్క అప మాన గుణగణాలు అన్నీ చారిత్రక పరీక్షలకు నిలబడ్డాయి. అంతేకాదు, సోవి

యట్ ప్రజలు కార్యాచరణలో సాధిస్తున్న విజయాలన్నీ మిగిలిన ప్రపంచప్రజలందరికీ ఆదర్శంగా కన్పించుటవల్ల. ఇతరదేశ ప్రజలందరుగూడా తమ స్వాతంత్ర్యరక్షణ కొరకై ఇంకా ఎక్కువగా ఐక్యమవుతూ ముందుకు వెళ్తున్నారు. మన దేశంలోగూడా జాతీయైక్యతకొరకు నాయకులు, ప్రజలు తహతహలాడుతున్నారు.

ఫాసిస్టుసైన్యాలతో హోరాహోరీ పోరాడుతూ సోవియట్ప్రజలు మనకు 2½ సంవత్సరాల వ్యవధినిచ్చారు. అన్నిదేశాల ప్రజలతోపాటు మనం గూడా ఐక్యమయి జాతీయప్రభుత్వాన్ని, దానిద్వారా స్వాతంత్ర్యాన్ని సంపాదించుటకు సోవియట్లు కల్గిస్తున్న ఈ వ్యవధిని సరిగా ఉపయోగించుకొనుట మీదనే మన దేశభవిష్యత్తు అంతా ఆధారపడిఉంది.

# సోవియట్ యూనియన్ ఇండియాకు ఏంచేసింది?

"కాకసస్ ప్రాంతానికి చెందిన ప్రజలను తమ బానిసలుగా చేసుకొని, కాకసస్ పర్వతశ్రేణిలోనుంచి ఇండియాకు రోడ్డు వేసుకొనుటకు జర్మన్ నాజీ హంతకులు ప్రయత్నిస్తున్నారు. ఈ జర్మన్ సామ్రాజ్యవాదుల ఆశయం కొత్తది కాదు; 1918 లో గూడా ఇండియాను చేరాలని కలలుగన్నారు. కాని ఈ ఆశయాలు ఎన్నటికీ నెరవేరలేవు. కాకసస్ ప్రజలమధ్య నిర్మించబడిన అసమాన జాతీయైక్యత ఈ ప్లానుల నన్నిటిని భగ్నం కావిస్తోంది. కాకసస్‌లో పోరాడుతున్న రెడ్ఆర్మీ ఇండియాను నాజీ ఫాసిస్టులనుంచి రక్షిస్తోంది. కాకసస్ ప్రాంతం నాజీ సైన్యాలకు స్మశానవాటికగా తయారైంది."

— కామ్రేడ్ యం. కలినిన్,
సోవియట్ యూనియన్‌యొక్క కేంద్ర సోవియట్ కమిటీ అధ్యక్షుడు.

ఒకవైపున భారతదేశనాయకులు, ప్రజలు ఆదర్శకరమైన సోవియట్ విధానాన్ని, ప్రపంచ విజ్ఞాన నాగరికతలను ఫాసిస్టులబారినుండి రక్షిస్తున్న నేటి సోవియట్ యుద్ధపాత్రను అభినందిస్తూ ప్రపంచ ప్రజలతోపాటు సోవియట్లకు జోహారులర్పిస్తూఉంటే, కొందరు దేశభక్తులు సోవియట్ వైఖరిని గురించి ప్రశ్నిస్తారు.

"సోవియట్ విధానం, సోవియట్ విప్లవంవల్ల కల్గిన సామాజికమార్పులు అన్నీ బాగానేఉన్నాయి. కాని సోవియట్ యూనియన్ ఇండియాకు ఏంచేసింది?" అని వారు అడుగుతారు.

సోవియట్ యూనియన్ బయలుదేరిన 26 సంవత్సరాలనుంచి పీడితప్రజలందరికి సోవియట్ రాజ్యంవల్ల కల్గినమేలును సరిగా గుర్తించకపోవుటవల్ల; సోవియట్ విప్లవం జరిగిన రోజునుంచి సామ్రాజ్యవాదులప్రపంచానికి, సోషలిస్టు ప్రపంచానికి మధ్య బయలుదేరిన ప్రధాన పోరాటంలో సోవియట్ యూనియన్ అవలంబించిన సామ్రాజ్య వ్యతిరేకవైఖరిని; సోవియట్ విప్లవంవల్ల పీడిత ప్రజల

స్వాతంత్ర్య ఉద్యమాలన్నీ తీవ్రమై బలపడిన వాస్తవిక విషయాన్ని. సామ్రాజ్య వాదుల ప్రపంచాధిపత్య ప్లానుల నన్నిటిని ఎప్పటికప్పుడు భగ్నంకావిస్తూ నేటి వరకూ ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటాన్ని సోవియట్ యూనియన్ ఎలా బలపరుస్తున్నదీ గుర్తించకపోవుటవల్లనే "సోవియట్ యూనియన్ ఇండియాకు ఏంచేసింది? స్టాలిన్ ఇండియా విషయంలో ఒకమాటైనా ఎందుకు మాట్లాడగూడదు?" అనే ప్రశ్నలు బయలుదేరుతున్నాయి.

పీడితప్రజలకు సోవియట్ యూనియన్ చేసిన సహాయాన్ని వివరంగా తెలుసుకునేముందు, సోవియట్లకు ప్రపంచరాజకీయాల్లో స్థానాన్నిబట్టి ఏర్పడిన హద్దులు, ప్రతిబంధకాలనుగూడా మనం సరిగా అర్థంచేసుకొనుట అవసరం. అనగా ప్రస్తుత ప్రపంచరాజకీయాల్లో పీడితప్రజలకు సోవియట్లు సహాయం చేయుటకుగల అవకాశాలను పరిశీలించాల్సిఉంది. 'సూటిగా ఇండియావిషయం స్టాలిన్ కల్పించుకోవాల'ని కోరేదేశభక్తులందరూ సోవియట్ యూనియన్ పరిస్థితిని గురించి, అస్వతంత్ర ప్రజలపట్ల సోవియట్ రాజ్యం అవలంబిస్తున్న వైఖరిని గురించి శాంతంగా ఆలోచించవలసియుంది.

1914 సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, రష్యన్ సామ్రాజ్యవాదాన్ని నాశనంచేసి బయలుదేరిన సోవియట్ యూనియన్ ప్రపంచ సామ్రాజ్యవాదుల ప్రపంచ పెత్తనానికి పెద్దఅడ్డుగా తయారైంది. అంకురంలోనే త్రుంచివేసిన యెడల సోషలిస్టు ప్రమాదం తప్పగలదనే కోరికతో వెంటనే 14 పెట్టుబడిదారీ దేశాలు సోవియట్ శిశువుమీద విరుచుకుపడి 1918-22 వరకూ చర్చిల్ వర్ణించినట్లుగా '14 రాజ్యాలదాడి'ని చేశారు; ఈదాడిని జయప్రదంగా ప్రతిఘటించి సోవియట్ రాజ్యాన్ని నిలబెట్టారు సోవియట్ప్రజలు. ఆవిధంగా సామ్రాజ్య వాదుల కుట్రను భగ్నంకావించిన సోవియట్ శిశువును ఆనాడే 2 ప్రశ్నలు ఎదుర్కొన్నాయి. (1) పెట్టుబడిదారీ దేశాలతో సోవియట్ యూనియన్ ఎలాంటి సంబంధాలు పెట్టుకోవాలి? (2) వలస దేశాలతోనూ, అస్వతంత్ర దేశాలతోనూ ఎలాంటి సంబంధాలు కల్గించుకోవాలి?

ప్రత్యక్షంగా సోవియట్ సైన్యాలను విదేశాల్లోకి దింపి ఆదేశాల్లోకూడా సోషలిస్టు విప్లవాలను లేవదీయనియెడల సోవియట్ యూనియన్‌కు రక్షణ లేదన్నాడు ట్రాట్స్కీ. ఆయా దేశాల్లో ప్రజల విప్లవచైతన్య అభివృద్ధి తమ దేశాశాలలో విప్లవాలు తీసుకురావాలి. అంతేగాని సోవియట్ సేనలను పంపి ఇతర దేశాలలో విప్లవాలు తీసుకరావాలనడం విప్లవకార్యక్రమంగాదు; విప్లవాఘాతక కార్యక్రమమని, లెనిన్ అన్నాడు. ఆ విప్లవాలు ఓడిపోవుటయేగాక, సోవియట్ యూనియన్ ఉనికికే అపాయం వాటిల్లగలదని లెనిన్ వారించాడు. లెనినిస్టు పంథా

నెగ్గింది. సోవియట్ యూనియన్ బలపడింది. ఆదర్శకరమైన సోవియట్‌రాజ్యం ప్రక్కనే పీడిత ప్రజల స్వాతంత్ర్య ఉద్యమాలుగూడా బలపడినాయి. సోవియట్ నీతి ఇతరదేశాలకు విప్లవాలను ఎగుమతిచేయడంకాదు. ఆయా దేశాలలో ప్రజా సామాన్యం విప్లవంతెస్తే. ఆవిప్లవం విజయవంతంకావడానికి తనశక్తికొలది అంత ర్జాతీయ న్యాయసూత్రాలనుబట్టి. పరిస్థితులనుబట్టి తోడ్పడటమే.

*　*　*　*

అయితే ఇతరదేశాలతో సోవియట్ యూనియన్ ఎలాంటి సంబంధాలు కల్పించుకుంది ? సామ్రాజ్యవాద దేశాలతోనూ. పెట్టుబడిదారీ దేశాలతోనూ సోవియట్‌కు గల సంబంధాలను మరొక ప్రకరణంలో చూద్దాం. ప్రస్తుతం అస్వతంత్ర దేశాలతోనూ. వలసదేశాలతోనూ సోవియట్‌ప్రభుత్వానికి ఎలాంటి సంబంధాలు ఉన్నవో పరిశీలిద్దాం.

(1) రష్యన్ జారుసామ్రాజ్యకాలంలో రష్యాచే దోపిడీచేయబడిన వలస దేశాలన్నిటి (లిథూనియా. లాట్వియా. ఇస్థోనియా. ఫిన్లండు. పోలెండు మొదలైనవి) యొక్క సంపూర్ణస్వాతంత్ర్యాన్ని సోవియట్ ప్రభుత్వం గుర్తించింది. తనతోపాటు అవిగూడా సమానత్వాన్ని అనుభవించమని ఉత్తేజపరిచింది. జారు సామ్రాజ్యాధిపతులకు విదేశాల్లో (ఉ॥ చైనా. ఇరాన్) గల పలుకుబడిరంగాలను. వ్యాపార రక్షణ హక్కులను. రావలసిన బాకీలను. కప్పాలను అన్నిటిని వదులుకుని ఆదేశాల అనుమానాలను పూర్తిగానిర్మూలించింది. వందలసంవత్సరాలపాటు జారు చక్రవర్తి పీడకు గురిఅయిన చైనా ప్రజలకు, సోవియట్ వైఖరి ఫలితంగా, సోవియట్ ప్రభుత్వంమీద నమ్మకం ఏర్పడి. రెండు దేశాలకు గొప్ప స్నేహసంబంధాలు బయలుదేరినాయి 1920 తరువాత సోవియట్ యూనియన్‌కు చైనాకు ఏర్పడిన సన్నిహితసంబంధం (అనగా 60 కోట్ల ప్రజల ఐక్యత) ఆసియా ఖండ వాసులనందరిని ఉత్తేజపరచి. తూర్పుప్రాంతంలో పీడితప్రజలు సాగించే సామ్రాజ్యవాదవ్యతిరేక పోరాటమునకు గొప్ప అండగా తయారైంది.

(2) రష్యన్ జారుసామ్రాజ్యకాలంలో అధికసంఖ్యాకులైన రష్యన్‌జాతి ఆధిపత్యం క్రింద ఇతరజాతులు విపరీతమైన హింసకు గురిఅయ్యేవి. పైగా రష్యన్ జారుచక్రవర్తి వివిధజాతులమధ్య ద్వేషాలను రగుల్గొల్పి ప్రజాఉద్యమం మధ్య చీలికలు కల్పించేవాడు. ఇతరజాతులవారు బానిసప్రజలవలె పరిగణించబడ్డారు. (రష్యన్‌జాతికి చెందిన ప్రజలను జార్ దోపిడిచేయలేదనికాదు !) సోవియట్ యూనియన్‌లోని జాతులన్నిటియొక్క సంపూర్ణస్వయంనిర్ణయహక్కును గుర్తించి సోవియట్‌ప్రభుత్వం వాటిమధ్య గల పాత పరస్పరద్వేషాలనన్నిటిని నిర్మూలించి ఏదేశం ఎన్నడూ ఎరుగని ఐక్యతను నిర్మించినసంగతి అందరికీ తెలిసినదే.

(3) సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించి, ఆదర్శకరమైన శ్రామికరాజ్యాన్ని స్థాపించిన రష్యన్ విప్లవం, ఆసియాఖండంలోని పీడితప్రజల స్వాతంత్ర్యపోరాటాల కన్నిటికి ప్రోత్సాహమిచ్చింది. అవి మరింత తీవ్రతరమై బలపడసాగాయి. "రష్యన్ ప్రజలు తమ దేశంలో సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసినప్పుడు, మనం ఎందుకు చేయలేం?" అను ఆత్మవిశ్వాసం ఎక్కువయింది. రష్యన్ విప్లవప్రభావం 1920 భారతజాతీయపోరాటంలోనూ, చైనాజాతీయవిప్లవంలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. రష్యన్ విప్లవం వలసదేశ విప్లవాలను ఉత్తేజపరుచుటవల్ల రష్యన్ విప్లవంతో సామ్రాజ్యవాదవ్యతిరేకంగా నూతనవిప్లవయుగం ప్రారంభమయింది (స్టాలిన్).

(4) సామ్రాజ్యవాదం ఒక ప్రపంచ విధానం. 1900 నాటికి సామ్రాజ్యవాదం ప్రపంచాన్నంతా ఆవరించింది. అందువల్ల సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించుటకు చేయవలసిన పోరాటానికిగూడా అంతర్జాతీయ లక్షణం ఏర్పడింది. 20వ శతాబ్ద రాజకీయాలను అర్థంచేసుకోవాలంటే ఈ ప్రపంచ రాజకీయదృక్పథంయొక్క ఆవశ్యకతను గురించి జవహర్‌లాల్ పండితుడు మనకెన్నోసార్లు ఉద్బోధించాడు. ప్రపంచ సామ్రాజ్యవాదులనందరిని ఎదిరించి, సామ్రాజ్యవాద ప్రపంచంలోనుంచి విడిపోయి రష్యన్ ప్రజలు నిర్మించుకున్న సోషలిస్టు ప్రపంచం, పీడిత ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి పెద్ద అండగా తయారైంది. ఈవిధంగా భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి, ఇతర ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటాలకు - సోవియట్ యూనియన్‌కు ప్రజాసన్నిహిత సంబంధాలు ఏర్పడినాయి. సోవియట్ యూనియన్ బలపడి, వివిధదేశ ప్రజల స్వాతంత్ర్య పోరాటాలు తీవ్రమైనకొలదీ ప్రపంచ ప్రజల ఉద్యమాలకుగల సంబంధం గట్టిపడుటవల్ల, సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఎక్కువై. ప్రపంచం మొత్తంమీద 1917 నుంచి సామ్రాజ్యవాదం గొప్ప సంక్షోభంలో చిక్కుకొని క్షీణిస్తోంది. సరియైన ఈ అంతర్జాతీయ దృక్పథంనుంచి ఆలోచిస్తే సోవియట్‌యూనియన్ అన్ని వలస దేశాలకు ఎంత పెద్ద అండగా సహాయపడుతున్నదో వెంటనే బోధపడుతుంది.

(5) ఆసియా ఖండంలోని పీడిత ప్రజల స్వాతంత్ర్య ఉద్యమాలకు కీలకమైన చైనా స్వాతంత్ర్య పోరాటానికి సోవియట్ యూనియన్ అపారమైన సహాయంచేసింది. నామమాత్రమైన రాజకీయ స్వాతంత్ర్యం ఉన్నా యథార్థంగా చైనా ఒక అర్ధవలసరాజ్యం. బ్రిటిష్ అమెరికన్, జపాన్, జర్మన్, ఫ్రెంచి పెట్టుబడిదారులు ఆర్థికంగా చైనాను కొల్లగొట్టారు. చైనామీద ఆర్థిక అధికారమంతా వారిదే. విదేశసామ్రాజ్య వాదుల దోపిడీకి గురిఅయిన చైనా జాతీయవిప్లవానికి నాయకుడైన సన్‌యట్‌సేన్ 1925లో చనిపోయే సమయంలో మరణశయ్యమంచి సోవియట్ ప్రభుత్వ కార్యవర్గానికి ఈ దిగువ విధంగా సందేశాన్నిపంపాడు:

"ఇంతవరకూ నాదేశానికి మీరుచేసిన సహాయం శాశ్వతంగా ఉండగలదని దృఢంగా నమ్ముతున్నాను. కామ్రేడ్స్! త్వరలోనే సోవియట్ యూనియన్ శక్తివంతమైన స్వతంత్ర చైనాను తన మిత్రునిగా పరిగణిస్తూ, ప్రపంచ ప్రజల విముక్తికై జరుగబోయే మహత్తర పోరాటాల్లో, రెండుదేశాలూ భుజం భుజం కలిపి విజయాన్ని సాధించగలవని కోరుతున్నాను. సెలవు — సన్‌యట్‌సేన్".

1923—27 ల మధ్య మిలిటరీ నిపుణులను, ఇతరులను సన్‌యట్‌సేన్‌తో చేసుకొన్న ఒడంబడిక ప్రకారం సోవియట్ పంపి, చైనా జాతీయోద్యమానికి, అన్నివిధాలా సహాయంచేసింది. బ్రిటిషు ప్రభుత్వం చైనా జాతీయ విప్లవంవల్ల తన సామ్రాజ్యానికి దెబ్బ తగులుతుందనే భయంతో, చైనా జాతీయోద్యమానికి సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జపాను మిలిటరీ ఫాసిస్టులను బలపరచి ప్రోత్సహించింది. జపాను చైనామీద యుద్ధం 1931 నుండి గావించసాగింది. 1937లో చైనాలో జంగ్-కై-షేకు కమ్యూనిస్టులతో కలసి జపానును ఢీకొనడానికి తయారయ్యాడు. సోవియట్ యూనియనుతో తిరిగి సంబంధాలు నెలకొల్పాడు. అప్పటినుండి సోవియట్ యూనియను చైనాకు ఆయుధసహాయం, తదితర సహాయం ఎక్కువగాచేసి, జపానును ఎదుర్కోడానికి తగినబలాన్ని కలుగజేసింది.

చైనాకు సోవియట్ యూనియన్ పంపిస్తున్న సహాయాన్ని నిరసిస్తూ 1938 లో జపాన్‌రాయబారి మాస్కోలో తన అసమ్మతి తెలియబరిచినప్పటికీ చైనాకు సోవియట్ యుద్ధసామగ్రులు పంపుట ఆగలేదు. వాస్తవంగా సోవియట్ల సహాయంవల్లనే ఐక్యచైనా, జపాన్‌తో 7 సంవత్సరాలుగా యుద్ధం సాగించగల్గుతోంది.

1939 లో చైనాకు, రష్యాకు మళ్లీ వ్యాపార ఒడంబడిక జరిగింది. కొన్ని కోట్ల డాలర్ల విలువగల యుద్ధసామగ్రులను, యంత్రాలను చైనాకు పంపుటకు 1941 జనవరిలో సోవియట్ యూనియన్ అంగీకరిస్తూ మరొక ఒడంబడిక జరిగింది.

1941 జూన్‌లో హిట్లర్ రష్యామీద దాడి ప్రారంభించిన తరువాతగూడా 1941 జనవరి ఒడంబడిక క్రింద చైనాకు పంపవలసిన సహాయాన్ని 1941 డిసెంబర్ ఆఖరుకు సోవియట్ యూనియన్ అందజేసింది.

1941 డిసెంబరులో మాస్కో ముట్టడి విఫలమయి ఆందోళనపడుతున్న హిట్లర్‌కు సహాయంగా జపాన్ యుద్ధంలోకి దిగి బ్రిటన్ అమెరికాలమీద యుద్ధం ప్రకటించింది. పసిఫిక్ సముద్రంలో జపాన్‌దాడి ప్రయత్నాల గురించి స్టాలిన్ 1931 లోనే వెల్లడిచేశాడు. ఇప్పుడు జపాను యుద్ధంలోకి దిగగానే, జపాన్‌దాడి

ప్రమాదాన్ని గురించి ఆసియావాసులందరినీ సోవియట్ పత్రికలు హెచ్చరించాయి. అక్షరాజ్యాల దోపిడిదొంగలలో జపాన్ ఒకటనిసోవియట్ నాయకులుఖండించారు.

సోవియట్లసహాయంతో నిలబడగల్గిన చైనా జపాన్‌కు వ్యతిరేకంగా చేస్తున్న ఎడతెగని పోరాటం, జపాన్ ఇండియామీదికి దూకకుండా ఇండియాకు సహాయ పడుతోంది.

(6) సోవియట్ విజయాలవల్ల యూరప్‌లో నాజీసైన్యాలు పరాజయంపొంది పతనాన్ని సమీపిస్తున్నకొలదీ, తూర్పుప్రాంతంలో జపాన్ కుట్రలన్నీ భగ్నమయి నప్పుడు, చైనాలో చీలికలు కల్పించటానికి ప్రారంభించింది జపాన్. చైనా కమ్యూ నిస్టులకు, కమ్యూనిస్టువ్యతిరేకులకూ మధ్య భేదాలు కల్పించి చైనాతో వేరుగా రాజీచేసుకొనుటకు ప్రయత్నిస్తోంది జపాన్. సోవియట్ యూనియన్ ఈ జపాను కుట్రలన్నిటినీ బట్టబయలు చేసి చైనా ప్రజలకు హెచ్చరిక ఇచ్చింది. 1943 ఆగస్టులో "యుద్ధం, కార్మికవర్గం" అను ప్రముఖసోవియట్ పత్రిక ఈ విధంగా వ్రాసింది. :

"చైనా స్వాతంత్ర్యం చైనాదేశప్రజల బలంమీద, చైనా జాతీయఐక్యత మీదనే ప్రధానంగా ఆధారపడి ఉంది. ప్రస్తుతం చైనా ప్రజలు సాధించిన ఐక్యతను ఎంతగట్టిగా బలపరచి ఎంతఎక్కువగా శత్రువును ప్రతిఘటిస్తారో, అంత త్వరలో బయటనుంచి చైనా ప్రజలకు సహాయం వస్తుంది" జపాన్ పెట్టేఎరలకు చైనాలో ఎవరూ గురిగాకుండా సోవియట్ యూనియన్ ఈ విధంగా చైనా ప్రజలను ఉత్సాహ పరుస్తోంది.

(7) మలయా, బర్మాలను ఆక్రమించిన జపాన్ ఇండియాసరిహద్దులకు వచ్చింది, బర్మాను ఆక్రమించుటవల్ల, బర్మారోడ్డు గూడా జపాన్ వశమయినందు వల్ల చైనా వేరుచేయబడింది. చైనామీద యుద్ధాన్ని తీవ్రంచేసి, ఇండియామీద దాడిచేయుటకు జపాన్ సరియైన అవకాశంకొరకు ఎదురుచూసింది. కాకసస్ ప్రాంతాలన్నిటినీ హిట్లర్ ఆక్రమించుకుని ఇండియావైపుకు వచ్చియున్నట్లయితే ఫాసిస్టుల ప్రపంచాధిపత్యప్లానులు నెగ్గేవి. ఇండియాలో హిట్లర్, టోజోలు కలుసు కుని ఉండేవారు. కాని సోవియట్‌యూనియన్ ఫాసిస్టుసామ్రాజ్యవాదుల ప్లానులను భగ్నంకావించింది. స్టాలిన్‌గ్రాడ్‌వద్ద హిట్లర్‌సైన్యాలను ఓడించుటవల్ల జర్మన్ ప్లానుతే గాక; జపాన్ ఇండియా, చైనాల ఆక్రమణలను గురించి వేసినప్లానులన్నీ భగ్నమయినాయి. స్టాలిన్‌గ్రాడ్ భారతదేశాన్ని ఫాసిస్టులబారినుండి రక్షించింది. రక్షించుటయేకాదు; జపాన్ ప్లానులన్నీ భగ్నంచేయుటద్వారా, మన దేశ ప్రజలు సోవియట్, చైనా ప్రజలవలె ఐక్యమగుటకు వ్యవధిని కల్పించింది.

శ్రీమతి సరోజినీనాయుడి విప్లవాభివందనాల అర్థం ఇదే. ఇంతకంటె ఎక్కువ ఏం చెయ్యాలి సోవియట్ యూనియన్ ఇండియాకు?

(8) సోవియట్ విజయపరంపరలు, వాటిఫలితంగా బ్రద్దలవుతున్న ఆక్రమిత దేశాల తిరుగుబాట్లు, మిత్రమండలి దేశాల ప్రజల వత్తిడి - ఫలితంగా రెండవరంగం ప్రారంభించుటవల్ల త్వరగా హిట్లర్‌గూడా పతనమైనయెడల, మిత్రమండలి దేశాల దృష్టిఅంతా జపాన్‌ను అణిచివేయుటకు కేంద్రీకరించబడుతుంది. జపాన్‌తో యుద్ధాన్ని సాగించాలంటే, ఇండియా ప్రధాన యుద్ధకేంద్రంగా తయారుగాక తప్పదు. దానితో ఇండియా స్వాతంత్ర్య సమస్య ముందుకువచ్చి తీరుతుంది. చైనాకు ఎక్కువ సహాయం లభించే అవకాశాలు ఏర్పడుతాయి.

ఈవిధంగా సోవియట్‌యూనియన్ హిట్లర్‌ను సాధ్యమైనంతత్వరగా ఓడించుటకు తనశక్తినంతా కేంద్రీకరించుటవల్ల ఆసియాఖండవాసులందరితోపాటు భారతీయులందరికీ అపారమైన మేలుచేస్తోందనే విషయాన్ని గుర్తించకుండా ఎలా ఉండగలం?

సోవియట్ యూనియన్‌వల్ల పీడితప్రజల ఉద్యమాలకు ఇంత మేలుకల్గుతున్నప్పటికి, ఫాసిస్టుల బారినుండి భారతదేశాన్ని సోవియట్ సైన్యాలు రక్షించినప్పటికి — సూటిగా భారతదేశ విషయంలో సోవియట్ యూనియన్ ఎందుకు కల్పించుకొనగూడదని కొందరి దేశభక్తుల ఆందోళన. ఇతరదేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోవడం సోవియట్ యూనియన్ పంథాకాదని ఇదివరకే తెలుసుకున్నాం. స్పెయినుప్రజాప్రభుత్వకోర్కెమీద స్పెయిన్‌కు 1936—39 మధ్య సోవియట్ ప్రభుత్వం ఎంత ఎక్కువగా యుద్ధసామగ్రులను, ఆహారపదార్థాలను పంపిందో అందరికీ తెలిసిన విషయమే. స్పెయిన్‌లో ఏర్పడిన ప్రజా ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు స్పెయిన్ ధనికవర్గం ఇటలీ, జర్మనీల సహాయంతో అక్రమ యుద్ధానికి పూనుకుంది. స్పెయిన్‌లో ఫాసిజానికి ప్రజాస్వామ్యానికి మధ్య జరిగిన భీషణయుద్ధంలో బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు అవమానకరమైన పాత్రను వహించి స్పెయిన్‌ను ఫాసిస్టులకు వప్పగించినప్పుడు, సోవియట్ యూనియన్ బహిరంగంగా స్పెయిను ప్రజాపోరాటానికి అన్నిరకాల సహాయాన్ని పంపింది. ఈ సహాయంవల్లనే 1936 నుంచి 2½ సంవత్సరాలకు పైగా స్పెయిన్ ప్రజలు స్వాతంత్ర్యంకొరకు యుద్ధాన్ని చేయగల్గారు.

అయితే స్పెయిన్ విషయంలో స్వతంత్ర ప్రభుత్వమైన స్పానిష్ ప్రజాప్రభుత్వ కోర్కెమీద సోవియట్ యూనియన్ జోక్యం కల్గించుకుంది. అదేరీతిగ భారతప్రజలు తమ ప్రభుత్వాన్ని ఐక్యప్రజాబలంవల్ల నిర్మించుకుంటే ఆ ప్రజాప్రభుత్వానికి సోవియట్ సంపూర్ణాధికారా లివ్వవలసినదని పట్టుపట్టడానికి, మరితరవిధాల పూర్తిగ తోడ్పడడానికి, వీలుపడుతుంది.

# ఫాసిస్టు జపాన్‌తో సోవియట్ యూని యన్ ఎందుకు ఒడంబడిక చేసుకుంది ?

"జపాన్ ఇండియాకు స్వాతంత్ర్యం ఇస్తుందనుకొనుట పొరపాటే. అలాంటి అభిప్రాయాలు మనదేశ జాతీయోద్యమ సాంప్రదాయాలకే విరుద్ధం. జపాన్ సామ్రాజ్యతృష్ణతో ఇండియానుగూడా మ్రింగజూస్తోంది. కాని అటువంటి ఫాసిస్టు సామ్రాజ్యవాద ప్రభుత్వంతో సోవియట్ యూనియన్ నిరాక్రమణ ఒడంబడిక ఎందుకు చేసుకుంది ?" అని ప్రశ్నిస్తారు కొందరు దేశభక్తులు.

ఈ ప్రశ్నను జాగ్రత్తగా పరిశీలించినయెడల, జపాన్‌తో సోవియట్ ప్రభుత్వం ఎందుకు ఒడంబడిక చేసుకున్నది అనే ప్రశ్నకంటె, ప్రపంచప్రజల (సోవియట్ ప్రజలను మినహాయించి) నందరిని పీడిస్తున్న సామ్రాజ్యవాదులతో సోవియట్ యూనియన్ ఎందుకు ఒడంబడికలు చేసుకుంటోంది? అను ప్రశ్న విశాలమైనది. రెండవ ప్రశ్నలోనే మొదటిది ఇమిడిఉంది.

అనగా సోవియట్-జపాన్ ఒడంబడికనేగాక, 1941 జూన్ 22 కు పూర్వం ఫాసిస్టుజర్మనీ, ఇటలీలతో సోవియట్‌యూనియన్ చేసుకున్న ఒడంబడికలను, నేడు బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో సోవియట్ యూనియన్‌కు గల పరస్పర సహాయ ఒడంబడికలను అన్నింటిని ప్రశ్నిస్తున్నామన్నమాట. అనగా సామ్రాజ్యవాద దేశాలతో సోవియట్ యూనియన్ ఒడంబడిక చేసుకొనిన సోషలిస్టు సిద్ధాంతాలకు, పీడితప్రజల స్వాతంత్ర్యఉద్యమాలకు, విరుద్ధమా అనే విషయాన్ని పరిశీలించవలసి యుంది.

పెట్టుబడిదారీ దేశాలతో, సామ్రాజ్యవాద దేశాలతోనూ సోవియట్‌ప్రభుత్వం, ఎలాంటి సంబంధాలు పెట్టుకోవాలనే ప్రశ్న సోవియట్‌ప్రభుత్వ పుట్టుకతోనే బయలు దేరింది. అది 1914-17-18 యుద్ధకాలం. నవంబరు 7వ తేదీన రష్యన్‌విప్లవం జరిగింది. యుద్ధంలోనుంచి విరమించుకొన్నసోవియట్‌ప్రభుత్వం అమరునాదేయుద్ధంలో ఇంకా నిమగ్నమైఉన్న దేశాలన్నిటికీ "ఈ సామ్రాజ్యవాద యుద్ధాన్ని వెంటనే ఆపి శాంతిని నెలకొల్పాలి" అని విన్నవించుకుంది. బ్రిటిష్, ఫ్రాన్స్ సామ్రాజ్యవాదులు ఈ శాంతి సూచనలను లెక్కచేయలేదు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకించే

సోవియట్ ప్రభుత్వం యుద్ధంలోనుంచి విరమించుకొనక తప్పలేదు. అందువల్ల- సోవియట్ ప్రభుత్వం జర్మనీతో సంధి చేసుకుంది.

(సోవియట్ ప్రభుత్వం ఏర్పడేవరకూ రష్యన్ జార్ సామ్రాజ్యవాదులు జర్మనీకి వ్యతిరేకంగా మిత్రమండలి పక్షంలో ఉండి యుద్ధంసాగించారు.) యుద్ధంనుంచి విరమించుకొనకపోతే సోవియట్ ప్రభుత్వం ధ్వంసమయిపోయేది. యుద్ధంనుంచి విరమించుకొని జర్మనీతో సంధి (బ్రెస్టలిటోవస్క్ సంధి) చేసుకున్నందుకు, మిత్రమండలికి ద్రోహం చేసిందనే పేరుతో బ్రిటన్, ఫ్రాన్సులు సోవియట్ ప్రభుత్వమును నాశనం చేస్తామని బెదిరించాయి. సోవియట్ ప్రభుత్వంయొక్క బలహీనపరిస్థితిని ఆదనుగా తీసుకుని జర్మనీ, సంధి షరతులనుమించి రష్యాలోని ప్రధాన భూభాగాలను ఆక్రమించింది. జర్మనీ ఎన్నికఠోరమైన షరతులు పెట్టినప్పటికి విధిలేక లెనిన్ అంగీకరించాడు. బ్రిటిష్, అమెరికన్లతో కూడి యుద్ధం చేయుటకొరకు రష్యాతో తాత్కాలికంగా నైనా యీసంధికి జర్మనీ అంగీకరించింది. ఈ విధంగా సామ్రాజ్యవాదులమధ్య చీలికలను ఉపయోగించుకొని లెనిన్ సోవియట్ ప్రభుత్వ ఉనికిని కాపాడాడు.

కాని జర్మన్ సామ్రాజ్యవాద ప్రభుత్వంతో సోవియట్ ప్రభుత్వం సంధి చేసుకొనుటలో గల అర్థాన్ని మనం గుర్తించాలి. ట్రాట్స్కీ ఆసంధిని గర్హించాడు. సోషలిస్టు సిద్ధాంతాలను విడిచిపెట్టడమే అవుతుందన్నాడు.

అవమానకరమైన షరతులుపెట్టిన జర్మన్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి యుద్ధం చేయాలన్నాడు. ఎట్టి పరిస్థితిలో? రష్యన్ సేనలు 3 1/2 సంవత్సరాలకు పైగా యుద్ధంలో అపజయాలుపొంది, మనోనిబ్బరాన్ని కోల్పోయి, శాంతికొరకు ఘోషిస్తున్నప్పుడు, దేశంలో కరువుకాటకాలు బయలుదేరినప్పుడు, సామ్రాజ్యవాద యుద్ధంలో తిరిగిపాల్గొనుట సోవియట్ ప్రభుత్వాన్ని నాశనంచేయుటయే అవుతుందని లెనిన్ వాదించాడు. సామ్రాజ్యవాద ప్రపంచంలో వాటి మధ్యగల వైరుధ్యాలను ఉపయోగించుకుని సోవియట్ ప్రభుత్వం బలపడుటయే సోషలిస్టు ఉద్యమానికి శ్రేయస్కరం అని లెనిన్‌వాదన. లెనిన్ పంతం నెగ్గింది. సోవియట్ ప్రభుత్వం నిలిచింది. "అవమానకరమైన" బ్రెస్టలిటోవస్క్ సంధిని జర్మనీ ఓటమితో సోవియట్ ప్రభుత్వం రద్దుచేసింది.

(1) చుట్టూ సామ్రాజ్యవాదులు ఉన్నంత కాలంలో వారి వైరుధ్యాలను పూర్తిగా వుపయోగించుకొని సోవియట్ యూనియన్ బలపడాలి. (2) పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలతో సాధారణ వ్యాపార, నిరాక్రమణ ఒడంబడికలు చేసుకొనుటద్వారా సోషలిస్టునిర్మాణం జయప్రదంగావించి సోవియట్ యూనియన్

బలపడాలి-ఇవే సోవియట్ యూనియన్ సామ్రాజ్యవాద దేశాలతో చేసుకొన్న ఒడం బడికలకు మూలసూత్రాలు.

పై సిద్ధాంతాల ననుసరించి 1917 నుంచి నేటివరకూ సోవియట్ ప్రభుత్వం అనేక ఒడంబడికలను చేసుకుంది. నేడు జపాన్‌కు సోవియట్ ప్రభుత్వానికి గల నిరాక్రమణ ఒడంబడికగూడా ఈఒడంబడికలలో ఒకటి. అయితే ఈఒడంబడికల ఫలితంగా సోషలిస్టునిర్మాణం జయప్రదమగుటయే గాక ప్రపంచపీడిత ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంగూడా ఉన్నత స్థాయికి రాగల్గింది. సోవియట్ వైఖరివల్ల ఈ ఫలితాలు ఎలా కల్గినవో 1917 నుంచి నేటివరకూ వివరంగా చూద్దాం.

ఏదేశాలతోనూ ఒడంబడికలులేక సోవియట్లు ఒంటరిగా ఉన్న దశ యిది.

## 1918 — 1921

సోవియట్ విప్లవంతో సామ్రాజ్యవాదుల ప్రపంచపెత్తనానికే తీరని దెబ్బతగిలిందని తెలుసుకున్నాం. సామ్రాజ్యవాదుల 'కోటను' ఎగిరించే ప్రజాప్రభుత్వకోట ఒకటి బయలుదేరింది. అంత పెద్దవిశాల భూభాగంలో బయలుదేరిన సోషలిజాన్ని తమ సామ్రాజ్యాలలోని వలసదేశ ప్రజలుగూడా అనుకరిస్తారనే భయం సామ్రాజ్యవాదులకు కల్గింది. సోవియట్ యూనియన్‌మీద 14 పెట్టుబడిదారీ దేశాలుకలిసి 4 దిక్కులనుంచీ చేసిన బహిరంగ అక్రమదాడి 1921 వరకూ సాగింది.

ఈదశలో సోవియట్ ప్రభుత్వం సోవియట్ ప్రజలందరిని సమీకరించి సామ్రాజ్యవాదులదాడిని ఓడించింది. ఇతరదేశ కార్మికప్రజలు (ఉ॥ బ్రిటన్, ఫ్రాన్సు) గూడా సోవియట్ ప్రభుత్వానికి సహాయం చేశారు. సోవియట్ ప్రభుత్వం స్థిరపడు ప్రారంభించింది.

ఈ దశలోనే 1920 లో ఏర్పడిన "జాతిసమితి"కి తన్ను ఆహ్వానించక పోయినా సోవియట్ ప్రభుత్వం తన సూచనలను పంపింది. అన్నిదేశాల స్వాతంత్ర్యాన్ని గుర్తించి, వలస విధానాన్ని నిర్మూలించి, యుద్ధఅప్పులను రద్దుగావించి, సంపూర్ణ ఆయుధ విసర్జనచేయుటద్వారానే నిజమైన ప్రపంచశాంతి చేకూరగలదని తన స్పష్టమైన సామ్రాజ్యవ్యతిరేక వైఖరిని ప్రపంచమంతా సోవియట్ ప్రభుత్వం చాటింది.

## 1921 — 2925

సోవియట్ మీద దాడి విఫలమయిన తరువాత సోవియట్ యూనియన్‌ను అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ రంగాలనుంచి బహిష్కరించాలని సామ్రాజ్యవాదులు ప్రయత్నించారు. ఈ ప్రయత్నాల నన్నిటిని భగ్నంచేస్తూ, సరిహద్దు

దేశాలన్నిటి యొక్క సంపూర్ణస్వాతంత్ర్యాన్ని గుర్తించుటద్వారా సోవియట్ యూనియన్ వాటితో స్నేహ, వ్యాపార ఒడంబడికలను చేసుకొనగల్గింది.

సోవియట్ భూమిలోని సహజసంపదనంతా దోపిడిచెయ్యాలని కొత్తకుట్రలు ప్రారంభించారు సామ్రాజ్యవాదులు. సోవియట్ యూనియన్‌లోని ఫ్యాక్టరీలను విదేశపెట్టుబడిదారులకు స్వాధీనం చెయ్యాలని, జారుప్రభుత్వం ఇవ్వవలసిన పాత బాకీలను చెల్లించాలని, (అకారణంగా వారు 3 సవంత్సరాలపాటు చేసిన దాడివల్ల సోవియట్ యూనియన్‌కు కల్గిన నష్టానికి ఇప్పటివరకూ సంజాయిషీ చెప్పక పోయినా!) లేనియడల మరల సోవియట్ మీద దాడి సాగిస్తామని 1922 లో జీనో పట్టణంలో జరిగిన సమావేశంలో సోవియట్ ప్రభుత్వాన్ని బెదిరించారు. సోవియట్ ప్రభుత్వం ఈ సూచనలను నిరాకరించింది. తిరిగి సామ్రాజ్యవాదుల చీలికలను ఆధారంచేసుకొని ఆ సమయంలోనే, అక్కడనే జర్మనీతో స్నేహ, వ్యాపార ఒడంబడికలను చేసుకుంది.

1922 నాటికి ముఖ్యయూరపియన్ దేశాలన్నిటితో వ్యాపార ఒడంబడికలను సోవియట్ ప్రభుత్వం చేసుకొనగల్గింది. 1924 లో మిగిలిన బాల్కన్ దేశాలతోనూ (యుగోస్లావియా మినహా) 1925 లో పోలెండుతోనూ వ్యాపార ఒడంబడికలు ఏర్పడ్డాయి. 1925 లో జపాన్ సోవియట్‌తో ఒడంబడిక చేసుకుంది.

ఇంత వివరంగా ఈ విషయాన్ని పరిశీలించుటకు కారణం గుర్తించాలి. ఒక వైపునుంచి సామ్రాజ్యవాదుల కుట్రలను నాశనంగావిస్తూ, విదేశాలచే తాను గుర్తింపబడుటకై సామ్రాజ్యవాదుల చీలికలను ఉపయోగించుకొని సోవియట్ యూనియన్ పోరాటంచేసిన రోజులవి.

ఇక లాభంలేదనుకొని 1924 లో బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీలు సోవియట్ ప్రభుత్వంతో, మామూలు వ్యాపారసంబంధాలేగాక, రాజ్యాంగ తంత్రసంబంధాలను గూడా కల్పించుకొని (సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించి) రాయబారులను పంపుటకు ప్రారంభించాయి. 1924 లోనే చైనాకు సోవియట్లకు మధ్య సమానత్వాన్ని గుర్తించే ఒడంబడిక జరిగింది. జపాన్ 1925 లో సోవియట్ యూనియన్‌ను గుర్తించింది. ఇకవరుసనే అన్నిదేశాలు (అమెరికా మినహా) సోవియట్ యూనియన్‌ను గుర్తించినాయి. అమెరికా 1933 లో, రూజువెల్టు అధ్యక్షుడయిన పిదప, సోవియట్ యూనియన్‌ను గుర్తించింది.

ఈ ఒడంబడి[illegible] సోవియట్ యూనియన్ క్రమేణా స్వంత ప[illegible]శ్రమలను సోషలిస్టు ప్లాను ప్రకారం అభివృద్ధి చేసుకుంటూ త్వరలోనే బ్రిటన్, అమెరికాలతో సమాన పారిశ్రామిక అభివృద్ధిని సంపాదించింది.

## 1926 — 1929

సోవియట్ యూనియన్ పారిశ్రామిక అభివృద్ధికి ఎన్ని ఆటంకాలు కల్గించాలో అన్నిటినీ సామ్రాజ్యవాద ప్రభుత్వాలు కల్గించినాయి అంతర్జాతీయ సాంప్రదాయాలకు వ్యతిరేకంగా 1927 మే నెలలో లండన్‌లోని సోవియట్ వ్యాపార, రాయబార భవనాలమీద పోలీసుదాడిని జరిపి బ్రిటిష్‌ప్రభుత్వం సోవియట్‌తో సంబంధాన్ని త్రెంచుకుంది. 1927 జూన్‌నెలలో పోలెండులోని రాయబారి కామ్రేడ్ వాయకోవ్ ఖూనీ చేయబడ్డాడు. అదేసమయంలో లెనిన్‌గ్రాడ్‌లోని ఒక కమ్యూనిస్టుపార్టీ క్లబ్బు మీద బ్రిటిష్ ఏజంట్లు బాంబులువేసి 30 మందిని గాయపరిచారు. అసంవత్సరంలోనే బెర్లిన్‌లోనూ, చైనాలో పెకింగ్, షాంగ్‌హై, టీన్‌స్టిన్ నగరాలలోని రష్యన్ రాయబారుల భవనాలమీద దాడులు జరిగినాయి. ఈ విధంగా సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌మీద కొత్తదాడిని ప్రారంభించారు. సోవియట్ ప్రజలు సామ్రాజ్యవాదుల ప్రయత్నాలకు లొంగలేదు. చివరికి 1929 లో చైనాను సోవియట్ యూనియన్‌కు తగాదాపెట్టి సోవియట్‌ను యుద్ధంలోకి లాగాలని చూశారు. సోవియట్‌కు చెందిన తూర్పు చైనారైల్వేను చైనా మిలిటరీ అధికారులు స్వాధీనం చేసుకొనుటకు ఉసిగొల్పారు. కాని ఈ ప్రయత్నాలనన్నిటిని ధ్వంసం గావించి సోవియట్ యూనియన్ శాంతిని కాపాడింది.

## 1929 — 1933

ఇది ప్రపంచ ఆర్థిక సంక్షోభకాలం. ఒక్క సోవియట్ యూనియన్‌లో తప్ప మిగిలిన పెట్టుబడిదారీ ప్రపంచమంతటా పెద్ద ఆర్థిక సంక్షోభం బయలుదేరింది. పారిశ్రామిక ఉత్పత్తి 1929 లో కంటె 1933 లో అమెరికాలో నూటికి 35, బ్రిటన్‌లో 14, జర్మనీలో 34, ఫ్రాన్సులో 23 వంతులు క్షీణిస్తే, సోవియట్ యూనియన్‌లో ఆదేకాలంలో పారిశ్రామిక ఉత్పత్తి నూటికి 200 వంతులు ఎక్కువయింది. అమెరికాలో, ఇంగ్లండు, జర్మనీ, పశ్చిమ యూరప్ దేశాలలో మొత్తం 2 కోట్ల నిరుద్యోగులు బయలుదేరితే సోవియట్‌యూనియన్‌లో ఆ సమస్యేలేదు.

ఈ విధంగా ఒకవైపున సోవియట్ యూనియన్ బలపడుతూంటే, మరొక వైపున తమ సామ్రాజ్యాలలో రోజురోజుకూ అభివృద్ధి అవుతున్న జాతీయ ఉద్యమాలు, కార్మిక విప్లవోద్యమాలు అభివృద్ధి అవుతూంటే, తమ మధ్యగల పరస్పర వైరుధ్యాలు, పోటీలుగూడా తీవ్రమయి సామ్రాజ్యవాదులు బలహీనపడసాగారు.

ఈ సమయంలోనే బ్రిటన్, ఫ్రాన్సులకు పోటీగా జర్మనీ, జపాన్, ఇటలీ, ఫాసిస్టు సామ్రాజ్యవాదుల కూటమి బయలుదేరింది. తమకుకూడా సామ్రాజ్యాలు కావాలని యుద్ధాలకు దిగారు. వెనుకనుంచి బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు ఫాసిస్టు

లను బలపరచటం ప్రారంభించారు. చిన్న చిన్న దేశాలను ఫాసిస్టులకు బలియిచ్చి ఫాసిస్టు ప్రభుత్వాలను సంతృప్తి పరచుటద్వారా వాటిని సోవియట్ యూనియన్ మీదికి ఉసిగొల్పి తమ ప్రపంచపెత్తనాన్ని కాపాడుకోవాలని సామ్రాజ్యవాదులు కుట్రలు పన్నారు. పశ్చిమాన, తూర్పున బయలుదేరిన ఫాసిస్టుయుద్ధ ప్రమాదాన్ని సామ్రాజ్యవాదుల సోవియట్ వ్యతిరేకదాడిని ఎదుర్కొనుటకు సోవియట్ యూనియన్ సన్నాహమయింది.

## 1934 — 1939

మొత్తంమీద సామ్రాజ్యవాదులు, ఫాసిస్టులకు మధ్య పెరిగిపోతున్న ప్రపంచ పంపకపు తగాదా మరొక ప్రపంచయుద్ధానికి దారి తీస్తోంది. ఫాసిస్టులు ఏపరిస్థితిలోనైనా యుద్ధానికి తయారైనారు. జపాన్ 1931 లోనే చైనామీద దాడి ప్రారంభించింది. సామ్రాజ్యవాదులు (బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు) సామ్రాజ్యవాద యుద్ధంగాక, సోవియట్ వ్యతిరేకయుద్ధానికి కుట్రలుపన్నుతూ ఫాసిస్టులను బలపరిచారు.

ఫాసిస్టులకు లోనుగావలసి వస్తుందనే భయంతో యూరపులోని చిన్నరాజ్యాలన్నీ ఫాసిస్టు వ్యతిరేకంగా సోవియట్ యూనియన్‌వైపుకు మొగ్గటం ప్రారంభించినాయి. ఫ్రాన్సు హిట్లర్‌కు వ్యతిరేకంగా సోవియట్ యూనియన్‌ను జాతి సమితిలోకి రావాలని కోరింది. ఫాసిస్టు సామ్రాజ్యవాదులదాడిని ప్రతిఘటించుటకై 1934 లో సోవియట్ యూనియన్ జాతిసమితిలో చేరింది. జాతిసమితి లోపలి నుంచి, బయటనుంచి ఫాసిస్టు సామ్రాజ్యవాదుల కుట్రలను బట్టబయలుచేస్తూ ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక సంఘటనకు పూనుకుంది. అబిసీనియామీద ఇటాలియన్ ఫాసిస్టు (ముస్సోలినీ) ప్రభుత్వంచేసిన దాడిని ఖండిస్తూ, ఫాసిస్టుదాడిని ఎదుర్కొనుటకు 1935లో ఫ్రాన్సు జెకోస్లోవేకియా ప్రభుత్వాలతో పరస్పర సహాయ ఒడంబడికలను చేసుకుంది. సామ్రాజ్యవాదుల వైరుధ్యాలను చక్కగా వినియోగించుకుంటూ సోవియట్ యూనియన్ ముందుకు సాగిపోయి ఫాసిస్టు వ్యతిరేక ప్రజాసంఘటనను నిర్మించుటకు సర్వశక్తులతో ప్రయత్నించింది; తనచుట్టూ ఉన్న అన్ని దేశాలతోనూ, 1937 లో తిరిగి చైనాతోనూ, నిరాక్రమణసంధులు చేసుకుంది. ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమ ఫలితంగా ఫ్రాన్సు, స్పెయిన్, చైనా దేశాలలో ఫాసిస్టు వ్యతిరేకసంయుక్త ప్రభుత్వాలు ఏర్పడినాయి.

ఈ విధంగా ప్రజలందరూ యుద్ధాలకు, ఫాసిస్టు దురాక్రమణలకు వ్యతిరేకంగా సోవియట్ యూనియన్ నాయకత్వంక్రింద ఐక్యమవుతూంటే, బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు నిద్రపట్టలేదు. ఫాసిస్టు వ్యతిరేకసంఘటనను భగ్నం

చేయుటకు తయారైనాయి సామ్రాజ్యవాద ప్రభుత్వాలు. 1935 లో అబిసీనియా ఆక్రమణ విషయంలోనూ; 1936 లో స్పెయిన్ మీద ఇటలీ జర్మనీలు, 1937 లో చైనామీద జపాన్ గావించిన దురాక్రమణ విషయంలోనూ బ్రిటన్, ఫ్రాన్సు ప్రభుత్వాలు(తమ జాతి సమితి తీర్మానాలకు వ్యతిరేకంగా :) ప్రజాపోరాటాలకు ద్రోహం చేసి ఫాసిస్టులను బలపరచిన సంగతి ప్రపంచ ప్రజలందరికి తెలిసిన విషయమే. సోవియట్ యూనియన్. చైనా, స్పెయిన్, ప్రజాపోరాటాలకు సాధ్యమైనంత. సహాయం చేసింది.

తిరిగి సామ్రాజ్యవాదయుద్ధం బయలుదేరి ప్రపంచాన్ని భీభత్సంలో ముంచి వేయకుండా, ఫాసిస్టు దురాక్రమణలను అరికట్టి శాంతిని కాపాడుటకు సోవియట్ యూనియన్ చివరినిమిషం వరకూ సర్వశక్తులూ వినియోగించి ప్రయత్నించింది. అబిసీనియా, స్పెయిన్, ఆస్ట్రియా, జెకోస్లావేకియా........మొదలైన దేశాలను ఆక్రమించుకుని ప్రజలను పీడిస్తూ ప్రపంచ యుద్ధానికి కాలుద్రవ్వుతున్న ఫాసిస్టులను అరిట్టుటకై 1933 నుంచి నిర్మించబడిన ఫాసిస్టువ్యతిరేక సంఘటనలో బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు చేరాలని సోవియట్ యూనియన్‌తోపాటు బ్రిటిష్, ఫ్రెంచి ప్రజలు తీవ్రమైన ఆందోళనచేశారు. బ్రిటన్, ఫ్రాన్సులతో ఒడంబడికలు చేసుకొనుటకై సోవియట్ ప్రభుత్వం 1939 లో యుద్ధం ప్రారంభమయేవరకూ సంప్రదింపులు సాగించింది. కాని యుద్ధాన్ని ప్రేరేపించి, సోవియట్ మీదికి మరల్చాలని తహతహలాడుతున్న బ్రిటన్, ఫ్రాన్సులు ఫాసిస్టులకు వ్యతిరేకంగా సోవియట్‌తో ఒడంబడికకు తయారుకాలేదు. ఇక బ్రిటన్, ఫ్రాన్సులతో ఒడంబడిక లాభంలేదని రుజువైనపిమ్మటనే సోవియట్ ప్రభుత్వం జర్మనీతో నిరాక్రమణ సంధిచేసుకుంది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు, ఫాసిస్టులు ఐక్యంకాలేక పోవుటకు కారణం వారిమధ్యగల వైరుధ్యాలే. ఒకరిని మరొకరు ఉపయోగించుకొని ప్రపంచ పెత్తనానికి ప్లానులు వేస్తున్న ఇద్దరిమధ్య పెరిగిపోయిన తీవ్రవైరుధ్యాలే. బ్రిటన్, ఫ్రాన్సు సామ్రాజ్యవాదుల కోర్కెల ప్రకారం జర్మనీ సోవియట్‌పై యుద్ధంచేయకపోవడమేగాక సోవియట్‌తో నిరాక్రమణ ఒడంబడిక చేసుకొనుట బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు మరింత ద్వేషంకల్గించింది. దానిఫలితంగా 1939 సెప్టెంబరు 1 వ తేదీన బ్రిటన్ ఫ్రాన్సులు - జర్మనీలమధ్య 2 వ సామ్రాజ్యవాద యుద్ధం ప్రారంభమయింది.

ఏయుద్ధం రాకుండా చేసుకొనుటకై 1933 నుంచి ఫాసిస్టులకు మేతపెట్టి సామ్రాజ్యవాదులు బలపరచారో అలాంటి యుద్ధమే సామ్రాజ్యవాదులను ఎదుర్కొంది : సోవియట్ ప్రజా ప్రభుత్వం యుద్ధంలో చిక్కుకొనకుండా తాత్కాలికంగా కాపాడుకుంది.

# 1939 – 41 జూన్ 22

సామ్రాజ్యవాదులు ఆధిక్యతను నిర్ణయించుకొనుటకు తమలో తాము యుద్ధాన్నిసాగిస్తూ, ప్రజాసామాన్యాన్ని యుద్ధంలోకిలాగిన రోజులవి. ప్రజా సామాన్యానికి నష్టదాయకమైన ఈ సామ్రాజ్యవాద యుద్ధాన్ని వెంటనే ఆపాలని సోవియట్ ప్రభుత్వం నినాదం ఇచ్చింది. నిజమైన శాంతి కావాలని, యుద్ధంవల్ల ప్రజలు మారణహోమంలో ఆహుతిఅగుటతప్ప మరొకటికాదని, శాంతిని ఏర్పరచ గల ప్రజాప్రభుత్వాలకొరకు అన్నిదేశాల ప్రజలు సామ్రాజ్యవాద ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యుద్ధవ్యతిరేక ఉద్యమాలను సాగించారు. పోలెండు యుద్ధమైన తరువాతనైనా (1939 సెప్టెంబరులో) యుద్ధాన్ని ఆపమని బ్రిటన్, ఫ్రాన్సులకు సోవియట్ ప్రభుత్వం చేసుకొన్న విన్నపం నిరుపయోగమైంది. యుద్ధాన్ని వ్యాపింపజేస్తూ, సోవియట్ వ్యతిరేకయుద్ధంగా మార్చాలని బ్రిటిష్, ఫ్రెంచి ప్రభు త్వాలు తెగ ప్రయత్నించినాయి. ఉదాహరణ ఫిన్లండుయుద్ధం. ఫిన్లండుకు – సోవి యట్ యూనియన్‌కు – రెంటికీ లాభకరమైన సంప్రదింపులకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు ఫిన్లండు ప్రభుత్వాన్ని సోవియట్‌మీదికి ఉసిగొల్పి, దాన్ని ముఖ్యయుద్ధంగా మార్చాలని 1940 మేలో చర్చిల్ అధికారంలోకి వచ్చేవరకూ కుట్రలు జరిగాయి; ఈ కుట్రలన్నీ విఫలమయినాయి.

1940 జూన్‌లో ఫ్రాన్సును ఆక్రమించాడు హిట్లర్. ప్రమాదం బ్రిటిష్ ప్రజల నెత్తిమీదికే వచ్చింది ఇప్పుడు. హిట్లర్‌బలం స్పష్టంగా ఎక్కువయింది. 1940 ఆగస్టునుంచి హిట్లర్ బ్రిటిష్‌ప్రజలమీద ఘోరమైన విమానదాడులు ప్రారం భించాడు. 1941 మేతో యూరప్‌అంతా హిట్లర్ వశమయింది. దీనితో ఫాసిస్టు లకు పైచెయ్యి వచ్చింది.

ఫాసిస్టులను ఇంత కాలంనుంచి బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు బలపరచి నందువల్ల కల్గిన ఫలితాలను యూరపియన్ ప్రజలందరూ అనుభవంద్వారా తెలుసు కున్నారు. సోవియట్ యూనియన్ సూచనల ప్రకారం బ్రిటన్, ఫ్రాన్సులు సోవి యట్‌తో ఒడంబడిక చేసుకొని ఉండినట్లయితే, ఈయుద్ధమే రాకుండా ఫాసిస్టులు అరికట్టబడి ఉండేవారనిగూడా సర్వసామాన్యంగా విదితమయింది. ఫాసిస్టు ప్రమా దం హెచ్చుతున్నకొలదీ, బ్రిటన్ సోవియట్‌తో ఒడంబడిక చేసుకొని హిట్లర్‌ను ఎదుర్కొని యుద్ధాన్ని త్వరలో అంతంచేసి శాంతిని నెలకొల్పాలని 1940 జూన్ నుంచి బ్రిటిష్ ప్రజల ఆందోళన ఎక్కువయింది. ఫాసిస్టు అనుకూలమైన ఛేంబర్లే యిన్ మంత్రివర్గం అధికారంలోనుంచి వెళ్ళగొట్టబడింది. ఫాసిస్టు అనుకూలురను ప్రభుత్వ యంత్రంనుంచి తొలగించటం ప్రారంభించారు.

హిట్లర్ ఆక్రమించిన యూరపియన్ దేశాలలో ఫాసిస్టు వ్యతిరేక సంఘటన ప్రారంభమయింది. పూర్వం ప్రభుత్వాలు కొన్ని గంటలు, రోజులు, వారాల్లో హిట్లర్‌కు లొంగిపోతే, ఇప్పుడు ఫాసిస్టులకు వ్యతిరేకంగా నిలబడి పోరాడుటయే స్వాతంత్ర్యానికి మార్గమని గ్రహించిన యుగోస్లోవియా ప్రజలు యుగోస్లోవియా రాజైన పాల్‌ను కూలద్రోసి నూతన ప్రభుత్వాన్ని స్థాపించి, సోవియట్ ప్రభుత్వంతో పరస్పర స్నేహ ఒడంబడికను చేసుకున్నారు. గ్రీసు ప్రజలు నిలబడి యుద్ధంచేశారు. సోవియట్ యూనియన్‌తో ఒడంబడికలు కావాలని బాల్కన్ ప్రజల ఆందోళన హెచ్చింది. బాల్టిక్ దేశాలైన లిథూనియా, లాట్వియా, ఇస్థోనియా దేశాలు సోవియట్ విధానాన్ని అంగీకరించి సోవియట్ యూనియన్‌లో చేరిపోయాయి. ప్రజాశక్తులన్నీ నిజమైన ఫాసిస్టు సామ్రాజ్య వ్యతిరేక దేశమైన సోవియట్ యూనియన్ వైపుకు తిరిగినాయి.

1941 జూన్ 22 వ తేదీన హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడి ప్రారంభించాడు. ఇదివరకే యూరప్‌ఖండమునంతా ఆక్రమించి పైచెయ్యి సంపాదించిన హిట్లర్ సోవియట్ భూమినిగూడా ఆక్రమిస్తే ప్రపంచ ప్రజలందరితోపాటు భారతదేశానికిగూడా ఫాసిస్టు బానిసత్వం తప్ప మరేముంది !

25 సంవత్సరాలపాటు సామ్రాజ్యవాదులు కలలుగన్న సోవియట్ వ్యతిరేక యుద్ధం వచ్చేసరికి, సోవియట్‌కు వ్యతిరేకంగా నిలబడుటకు సామ్రాజ్యవాదులకు సాధ్యంకాలేదు. 1933 నుంచి అభివృద్ధిఅయి, యుద్ధకాలంలో పూర్తి అయిన ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సంఘటన సామ్రాజ్యవాదుల కోర్కెలను భగ్నం కావించింది. యుద్ధాన్ని త్వరలో ముగించి శాంతిని స్థాపించాలంటే, సోవియట్‌తో తమ ప్రభుత్వాలుగూడా ఒడంబడికలు చేసుకొని ఫాసిస్టులను నాశనం చేయుట ఒకటే మార్గమని ప్రజలు చేస్తున్న వత్తిడికి లొంగిపోయి, 41 జూన్ 22 వ తేదీన సోవియట్ మీద దాడి ప్రారంభమయిన వెంటనే బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాలు సోవియట్ యూనియన్‌తో పరస్పరసహాయ ఒడంబడికలు చేసుకోవడం తప్పనిసరి అయింది.

1941 జూన్ 22 నుంచి ప్రపంచచరిత్రలో ఒక నూతన ఘట్టం ప్రారంభమయింది. ఫాసిస్టు దురాక్రమణనుంచి స్వాతంత్ర్యమును కాపాడుకొనుటకై అన్ని దేశాల ప్రజలు ముందుకువచ్చి, మొదటినుంచి ఫాసిస్టు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిలబడిన సోవియట్ ప్రజల మహత్తర స్వాతంత్ర్యపోరాటాన్ని ఆదర్శంగా పెట్టుకొని, ఫాసిస్టు అనుకూలురైన సామ్రాజ్యవాదులను అణిచివేస్తూ, సామ్రాజ్యవాద ప్రభుత్వాల నెత్తిమీదుగా ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యయుద్ధంలో పాల్గొనడానికి అవకాశాలు ఏర్పడినాయి. ఇదే ఈ నూతనదశయొక్క ప్రాముఖ్యత.

ప్రస్తుత విషయం ఏమిటంటే, సోవియట్ ప్రభుత్వం ఇతర పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలతో ఒడంబడికలు చేసుకొనుట సోషలిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంకాదు; ఆ ఒడంబడికలద్వారా సోవియట్ యూనియన్‌లో సోషలిజమ్ విజయవంతమై రోజురోజుకు బలపడింది. సోవియట్ వ్యతిరేక కుట్రలన్నీ శాశ్వతంగా భగ్నమయి సామ్రాజ్యవాదం ప్రపంచం మొత్తంమీద విచ్ఛిన్నమయింది. ప్రపంచ ప్రజలందరూ పరస్పరంగా ఐక్యమయి, సోవియట్ ప్రజలతో కలిసి స్వాతంత్ర్యంకొరకు అంతిమ పోరాటాన్ని సాగించగల్గుతున్నారు.

1941 లో జరిగిన సోవియట్ - జపాన్ ఒడంబడికనుగూడా ఈదృక్పధం నుంచే అర్థంచేసుకోవాలసియున్నది. దానికి మరొక అర్థంలేదు. హిట్లర్ పశ్చిమాన సోవియట్‌మీద దాడిచేసినప్పుడు అక్షరాజ్యాల ముఠాలో చేరిన జపాన్ గూడా సోవియట్ యూనియన్‌మీద తూర్పునుంచి దాడిచేయకుండా చూసుకొనుట అత్యవసరం. అక్షరాజ్యాలమధ్యగల వైరుధ్యాలను ఉపయోగించుకుంటూజపాన్‌తో నిరాక్రమణ ఒడంబడిక చేసుకొని, పశ్చిమాన నాజీహంతకుల దురాక్రమణను జయప్రదంగా సోవియట్ యూనియన్ ఎదుర్కొంటూఉంది.

జపాన్ ఫాసిస్టుసామ్రాజ్యవాదంతో సోవియట్ యూనియన్ కలిసిపోయిందని అనుకొనుట పొరపాటు. జపాన్‌కు వ్యతిరేకంగా చైనా ప్రజలుసాగించే పోరాటంలో సోవియట్ యూనియన్ నేటికీ చేస్తున్న సహాయాన్ని గురించి ఇదివరకే తెలుసుకున్నాం. నిరాక్రమణ ఒడంబడిక ఉన్నప్పటికి, 1941 డిసెంబరు 7 వ తేదీన జపాన్ యుద్ధంలోకిదిగి ఇండోచైనా, మలయా, బర్మా, తూర్పుఇండియా దీవులు....మొదలైన దేశాలను ఆక్రమించుటకు ప్రారంభించినప్పుడు, బహిరంగంగా ఈ ఫాసిస్టు దుండగీండ్రను ఖండించింది. అంతేకాదు, ఈ మధ్య జపాన్, చైనా ప్రజలలో చీలికలు కల్పించి జాతీయఐక్యతను భగ్నంచేయుటకై చైనాతో సంధిసూచనలు చేస్తూ అంతర్యుద్ధాన్ని ప్రేరేపించినప్పుడు సోవియట్ యూనియన్ ఒక్కటే బహిరంగంగా ఈ సూచనలను ఖండించి, తమజాతీయైక్యతను కాపాడుకొని ఇంకా పెంపొందించుకుంటూ తమ విముక్తికై జపాన్‌కు వ్యతిరేకంగా నిలబడి పోరాడుటయే సరియైన మార్గమని చైనాప్రజలను హెచ్చరించింది (1943 ఆగస్టు). గత 25 సంవత్సరాల్లో జపాన్ - సోవియట్ సంబంధాలచరిత్ర అంతా సోవియట్ సామ్రాజ్యవ్యతిరేక వైఖరినే రుజువుచేస్తుంది.

సోవియట్ యూనియన్ ఫాసిస్టు దేశాలతో ఒడంబడికలు చేసుకున్నదంటే ఆ ఒడంబడికలవల్ల బలపడింది సోషలిజమేకాని ఫాసిస్టులుకారు. సామ్రాజ్యవాదులు ఫాసిస్టులతో చేసుకున్న ఒడంబడికలవల్ల బలపడింది ఫాసిస్టులేగాని

సామ్రాజ్యవాదులుకారు । ఇదీవ్యత్యాసం. సోవియట్ ఫాసిస్టు జర్మనీతో సరాక్రమణ ఒడంబడిక చేసుకున్నందువల్ల (1) సోవియట్ యూనియన్ యుద్ధంలోకి లాగబడ లేదు. (2) ఫాసిస్టులకు సామ్రాజ్యవాదులకు గల వైరుధ్యాలు మరీ తీవ్రమయినం దువల్ల సామ్రాజ్యవాదంయొక్క బలహీనత హెచ్చింది. (3) ఒడంబడిక ఉన్నప్ప టికీ ఫాసిజానికీ, ఫాసిస్టులను బలపరచిన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా గొప్ప ఫాసిస్టువ్యతిరేక ప్రజాఐక్యసంఘటనను సోవియట్ యూనియన్ నిర్మించ గల్గింది. (4) వ్యవధిని సంపాదించుకుని తాను బలపడుటయేగాక ఇతరదేశ ప్రజలకు సహా యం చేయగల్గింది. (5) ఇక ఒడంబడిక చేసుకున్నప్పటినుంచి ఫాసిస్టులు. వెనుక బలపడుతున్న సోవియట్ యూనియన్ అంటే భయపడవలసివచ్చింది. "బాల్టిక్ దేశాలు సోవియట్ యూనియనులో కలిసి పోయినాయి; సోవియట్ యూనియన్ రక్షణ కేంద్రాలు బలపడినాయి; పొరపాటుచేశాను" అని హిట్లర్ 1941 జూన్ కు పూర్వమే అనేకసార్లు ఏడ్చాడు.

అదేవిధంగా జపాన్ తో ఒడంబడికలు చేసుకొనుటవల్ల (1) సోవియట్ యూనియన్ సాధ్యమైనంతవరకు తూర్పు ప్రాంతంలోగూడా యుద్ధంలోకి దిగ కుండా ఉండుటకుపీలైంది. (2) ఒడంబడికవల్ల కల్గినవ్యవధిని ఉపయోగించుకుంటూ తూర్పు సైబీరియాను, రక్షణకేంద్రాలను బలపరచుకోగల్గింది. (3) వ్యవధిని ఉపయో గించుకుని చైనాకు అపారసహాయంచేస్తూ జపాన్ వ్యతిరేక పోరాటానికి సహాయం చేసింది. తాను హిట్లరుతో పోరాడే సమయం వచ్చేసరికి ఐక్యమైనా జపాన్ను ఎదుర్కొంటూ నిలిచింది. (4) సామ్రాజ్యవాద ఆశయాలతో జపాన్ సోవియట్ తో ఒడంబడిక చేసుకుంది. కాని పసిఫిక్ సముద్రంలో జపాన్ సామ్రాజ్యవాద ఆశ యాలకు వ్యతిరేకంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు ఉన్నారు. అనగా జపాన్-అమెరికా సామ్రాజ్యవాదుల మధ్యగల వైరుధ్యాలు పెరిగినాయి. దాని ఫలితంగా జపాన్ కు క్లిష్టపరిస్థితులు ఏర్పడినాయి. (5) జపాన్ ఫాసిస్టువాడి ప్రారంభమయేసరికి ఒడంబడిక ఉన్నప్పటికీ జపాన్ దురాక్రమణను ఖండిస్తూ జపాన్ కు వ్యతిరేకంగా ఆసియా ప్రజలను ఉత్తేజపరిచింది. (6) జపాన్ కు వ్యతిరేకంగా ఆసియా ప్రజల ఐక్యసంఘటన ప్రారంభమయింది.

ఈవిధంగా సోవియట్ యూనియన్ ఫాసిస్టులతో చేసుకున్న ఒడంబడికలు ఫాసిస్టులకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు బలపడడానికి తోడ్పడ్డాయి.

అందువల్ల సోవియట్ ప్రభుత్వం సామ్రాజ్యవాద, ఫాసిస్టు ప్రభుత్వాలతో చేసుకున్న ఒడంబడికల ఫలితంగా సోవియట్ యూనియన్ యొక్క సామ్రాజ్య వ్యతిరేక సిద్ధాంతాలకు దెబ్బ తగులుతుందని అనుకొనుట పొరపాటు. పైగా గత

26 సంవత్సరాల చరిత్రఅంతా సోషలిస్టు ఉద్యమం సోవియట్ యూనియన్‌లోనే గాక, ప్రపంచమంతటా బలపడుతోందని రుజువుచేస్తోంది. అయితే సామ్రాజ్య వాద ప్రభుత్వాలు ఉన్నంతకాలం వాటిమధ్యగల వైరుధ్యాలను ఉపయోగించుకునే ఒడంబడికలు తప్పనిసరియని తెలుసుకున్నాం. ఇంతకాలంనుంచి నాశనం గావిం చాలని అనుకొన్న సామ్రాజ్యవాద ప్రభుత్వాలు సోవియట్ సోషలిస్టు ప్రభుత్వంతో ఒడంబడికలు చేసుకొని, సోవియట్ యూనియన్‌కు ప్రపంచ ప్రజలంతా జోహారు లర్పిస్తుంటే సహించుట తప్పనిసరియైంది!

1941 జూన్ 22 నుంచి ప్రారంభమయిన నూతన స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సోవియట్ ప్రభుత్వం బ్రిటన్ అమెరికా ప్రభుత్వాలతో ఇంకా ఒడంబడి కలు చేసుకుంది. వీటినే త్రైరాజ్య ఒడంబడికలు అంటున్నాం. ఈ ఒడంబడిక లన్నీ సోషలిస్టు సిద్ధాంతాలకు విరుద్ధంకాకపోగా ప్రపంచ ప్రజాస్వాతంత్ర్య పోరాటాలన్నిటికీ ఎలా తోడ్పడుతున్నవో ఇప్పుడే చూద్దాం.

# అట్లాంటిక్ చార్టర్‌లో స్టాలిన్ ఎందుకు సంతకం చేశాడు?

1942 రష్యన్ విప్లవదినోత్సవ సందర్భంలో సందేశాన్నిఇస్తూ, సోవియట్ యుద్ధాశయాలను గురించి స్టాలిన్ ఈ దిగువవిధంగా చెప్పాడు :

"ఆంగ్లో-సోవియట్-అమెరికన్ కూటమియొక్క కార్యాచరణ ఆశయాలు ఇవియే : ఒకజాతి మరొకజాతికన్న ప్రత్యేకతగలది, గొప్పదనే భావాన్ని నిర్మూలించుట; వివిధ జాతుల సమానత్వాన్ని, వారి దేశాల (భూభాగాల) స్వాతంత్ర్యాన్ని కాపాడుట; స్వాతంత్ర్యమును గోల్పోయిన జాతులను విముక్తిగావించి, వారి స్వాతంత్ర్య రాజ్యాంగహక్కులను పునరిద్ధరించుట; తనఇష్టప్రకారం ప్రతిదేశం తన వ్యవహారములను చక్కబెట్టుకొనునట్లు చూచుట; బాధించబడినదేశములకు ఆర్థిక సహాయాన్నిచ్చి, ఆయాదేశముల ప్రజలమేలుకొరకు సహాయం చేయుట; ప్రజాస్వామ్యహక్కులను పునరుద్ధరించుట; హిట్లర్ విధానాన్ని నాశనం గావించుట"

— స్టాలిన్ 1942 నవంబర్ 6.

సోవియట్ యూనియన్‌యొక్క విముక్తిఆశయాలను గురించి సోవియట్ విదేశాంగ మంత్రిఅయిన మాలటోవ్ 1941 లో జరిగిన త్రైరాజ్య సమావేశంలో ఈ విధంగా ఉపన్యసించాడు.

"హిట్లర్ వ్యతిరేక పోరాటంలో సహాయంచేస్తూ, ఈ (ఆక్రమిత) దేశాలను రక్షించే బాధ్యత సోవియట్ యూనియన్‌మీద పడింది. ఒక యూరప్ ప్రజలనేగాక, మా ఆశయాలను సరిగా అర్థంచేసుకొని ఆమోదించే ప్రపంచ ప్రజలందరినీ సోవియట్ యూనియన్, సోవియట్ ప్రజలు తప్పని సరిగా విముక్తి గావించే సమయం వస్తోంది."

— యం. మాలటావ్ - 1941 అక్టోబర్ 3.

పైన ఉదహరించబడిన సోవియట్ నాయకుల ప్రకటనలు సోవియట్ యుద్ధాశయాలను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సోవియట్ ఆశయాలను తెలియజేసే ప్రకటనలు ఇంకా ఎన్నోఉన్నాయి। అయినప్పటికి సోవియట్ యూనియన్‌ను

గురించి కొందరు దేశభక్తులు ప్రశ్నిస్తున్నారు. ఉదహరణానికి, అట్లాంటిక్ ఛార్టర్‌లో సోవియట్ యూనియన్ ఎందుకు సంతకం చేసిందని కొందరు అడుగుతారు. ఈ విషయాన్ని వివరంగా పరిశీలిద్దాం.

1941 ఆగస్టు 14 వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వం తరపున చర్చిల్, అమెరికన్ ప్రభుత్వం తరపున రూజువెల్ట్ కలిసి (అట్లాంటిక్ సముద్రంలో ఎక్కడో ఒకచోట) యుద్ధానంతర 'ప్రపంచ భావిగతి'ని గురించి కొన్నిసూత్రాలను నిర్ణయించారు. ఈ సూత్రాలను ఆమోదిస్తూ తరువాత అనేక మిత్రమండలి రాజ్యాల తరపున సంతకాలు చేయబడినాయి. సోవియట్ యూనియన్‌గూడా ఈ సూత్రాలకు సమ్మతిని తెలియజేస్తూ సంతకం చేసింది. ఇండియా ప్రభుత్వం తరపున బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఏజెంట్లు సంతకంచేశారు। ఈ సూత్రాలనే అట్లాంటిక్ ఛార్టర్ అని పిలుస్తున్నాం. అట్లాంటిక్ ఛార్టర్‌లో ఇమిడియున్న 8 సూత్రాలు ఇవి:

(1) ఇతర దేశముల అక్రమణకు ప్రయత్నించము.

(2) ఒక ప్రాంతంలోని ప్రజల సమ్మతి లేకుండా అప్రాంతపు సరిహద్దులను మార్చుటకు ప్రయత్నించము.

(3) యుద్ధానంతరం ఏదేశపు ప్రజలైనా వారికి ఇష్టంవచ్చిన ప్రభుత్వాన్ని స్థాపించుకొనవచ్చును ఫాసిస్టు దురాక్రమణవల్ల స్వదేశములను గోల్పోయిన వారికి తిరిగి వారిదేశములు (స్వయంనిర్ణయ హక్కుతోసహా) వచ్చునట్లు ప్రయత్నిస్తాం.

(4) చిన్నదేశాలైనా, పెద్దవైనా వాటికి అవసరమైనటువంటి ఆర్థిక అభివృద్ధికితోడ్పడి, అసమానత్వంలేకుండా, వాటికి కావలసిన ముడిసరుకులు సరఫరా అగుటకు, వ్యాపారం అభివృద్ధి అగుటకు సహాయపడరాం.

(5) అన్నిదేశాల ప్రజలకు ఆర్థిక అభివృద్ధి. సామాజికభద్రత, జీవిత ప్రమాణముల హెచ్చింపు కలుగుటకై వివిధదేశముల మధ్య అవసరమైన పూర్తి సహకారం ఏర్పరుచుటకు ప్రయత్నిస్తాం.

(6) నాజీ హంతకులను నాశనంచేసిన తరువాత అన్ని దేశాలలోని ప్రజలు శాంతి భద్రతలతో జీవించుటకు, కరువు కాటక భయాలులేకుండా స్వేచ్ఛా స్వాతంత్ర్యములతో తమ సరిహద్దులలో నివసించుటకు తోడ్పడే శాంతిని స్థాపిస్తాం.

(7) మహాసముద్రములమీద ఏ అడ్డంకులు లేకుండా అందరూ ప్రయాణ వ్యాపారములను కొనసాగించుకొనుటకై అవసరమైన శాంతిని స్థాపిస్తాం.

(8) యదార్థ పరిస్థితులవల్లనైతేనేమి, ఆధ్యాత్మిక కారణాలవల్లనైతేనేమి అన్నిదేశములు దౌర్జన్యపద్ధతులను విడనాడుట అవసరం. కొన్నిదేశములు దురా

క్రమణ చేయుటకై సైన్యాన్నిగాని, నావికాదళాన్నిగాని, వైమానికదళాన్నిగాని కల్గియున్న యెడల శాంతి ఏర్పడజాలదు. కనుక కొత్త ప్లాను ప్రకారం ప్రపంచ శాంతి ఏర్పరిచేయుందు, దురాక్రమణకుదిగే దేశాలయొక్క దౌర్జన్యశక్తులను విసర్జింపచేయాలి. అదేవిధంగా అన్ని దేశాల ప్రజలమీద భారాన్ని తగ్గించుటకై ఆయుధ విసర్జనాన్ని ప్రోత్సహిస్తాం.

పై 8 సూత్రాలతోకూడిన 'అట్లాంటిక్ ఛార్టర్' ప్రపంచంలోని అన్ని దేశాలకూ వర్తిస్తుందా? అనే ప్రశ్న వెంటనే బయలుదేరింది. ఎవరికి తోచిన వ్యాఖ్యానం వారు చేయ మొదలుపెట్టారు. 'అట్లాంటిక్ ఛార్టర్'లో సంతకంచేసిన చర్చిల్ ఇంటికి చేరకముందే పార్లమెంటులో ఈ ప్రశ్నవచ్చింది. అట్లాంటిక్ ఛార్టర్ ఇండియాకు వర్తిస్తుందా అని పార్లమెంటు డెప్యూటీ ప్రధాని అయిన మేజర్ అట్లీను అడుగగా తప్పక వర్తిస్తుందన్నాడు. లండన్‌లోని పశ్చిమాఫ్రికా విద్యార్థి సంఘం ఇచ్చిన ఆహ్వానసందర్భంలో మాట్లాడుతూ 1941 ఆగస్టు 16వ తేదీన అట్లీ ఈవిధంగా చెప్పాడు:

"ఏ స్వేచ్ఛా, శాంతి భద్రతలకై మనం పోరాటంజరుపుతున్నామో అవి మానవ జాతికి చెందిన ఏభాగమువారికైనా వర్తించవనే సూచన అట్లాంటిక్ ఛార్టర్‌లో కనపడదు. నిన్నటి రోజున మన ప్రభుత్వం తరఫున ప్రకటించిన సూత్రాలు (అట్లాంటిక్ ఛార్టర్) ప్రపంచ ప్రజలందరికి వర్తించునని నేను నమ్ముతున్నాను."

ఈలోపల మూలసూత్రకారులలో ఒకరైన చర్చిల్ ఇంగ్లండుకు చేరాడు. వెంటనే అట్లాంటిక్ ఛార్టర్ ఇండియాకు వర్తిస్తుందా అనే ప్రశ్నవచ్చింది. పార్లమెంటులో 1941 సెప్టెంబర్ 9 తేదీన ఆవిషయాన్ని గురించి మాట్లాడుతూ,

అట్లాంటిక్ ఛార్టర్‌ను తయారుచేసిన ఇద్దరు పార్టీలలో ఒకరైన రూజువెల్ట్‌తో సంప్రతించకుండా ఛార్టర్‌ను గురించి వ్యాఖ్యానం చేయుట సరియైనదికాదని చెప్తూ, బ్రిటిష్ సామ్రాజ్య భాగములైన దేశాలయొక్క రాజ్యాంగ పరిణామ అభివృద్ధికై బ్రిటిష్ ప్రభుత్వముచే అంతవరకూ చేయబడిన ప్రకటనలలో ఇప్పుడు అట్లాంటిక్ ఛార్టర్ మార్పులేమీ చేయుటలేదని, 1940 ఆగస్టులో వైస్రాయ్ చేసిన ప్రకటనయే ఇండియాను స్వపరిపాలనాభివృద్ధి మార్గంలో తీసుకొని పోగలదని, అట్లాంటిక్ ఛార్టర్‌ను తయారు చేసినప్పుడు యూరపియన్ ఆక్రమిత (ఫాసిస్టులచే) రాజ్యాలే తమ మనస్సులో ఉండెనని.........చెప్పాడు.

త్వరలోనే అమెరీ, చర్చిల్ అభిప్రాయాలను మరింత స్పష్టపరుస్తూ అట్లాంటిక్ ఛార్టర్ ఇండియాకు వర్తించదని తేల్చేశాడు.

కాని అట్లాంటిక్ ఛార్టర్ ఇండియాకు వర్తిస్తుందా? అని రూజువెల్ట్‌ను ప్రశ్నించినప్పుడు ప్రపంచానికంతకూ వర్తిస్తుందని ప్రకటించాడు; అమెరికా అధ్యక్షుడు.

అమెరికా విదేశాంగ మంత్రిఅయిన కార్డెల్‌హల్ "చర్చిల్-రూజువెల్టులు చేసిన ప్రకటనలోని ప్రధాన అంశాలన్నీ ప్రపంచమున కంతకూ వర్తిస్తాయి" అన్నాడు. అంతేకాదు ఈ సూత్రాలను అంగీకరిస్తూ సోవియట్‌తరపున మెయిస్కీ సంతకం చేస్తూ ఈ సూత్రాలు ఎట్టి మినహాయింపులేక అన్నిదేశాలకు వర్తింప జేయడం సోవియట్ ఆశయమని ప్రకటించాడు. అంటే చర్చిల్‌వ్యాఖ్యను కాదని ఇండియాకుకూడ వర్తించుతుందని సోవియట్ ఉద్దేశ్యం.

బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ, అమెరికన్ కమ్యూనిస్టుపార్టీ, దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ, ఆస్ట్రేలియన్ కమ్యూనిస్టుపార్టీ, మొదలైన సంస్థలన్నీ అట్లాంటిక్ ఛార్టర్‌ను ఇండియాకు వర్తింపచేయాలని ఆందోళన ప్రారంభించారు.

బ్రిటన్‌లోని 63 గురు మతగురువులుకలసి అట్లాంటిక్ ఛార్టర్ సార్వజనికంగా ప్రపంచానికంతకూ వర్తించే విషయాన్ని గురించి ప్రశ్నించారు.

ఈ విధంగా ఇండియా యుద్ధానంతర భవిష్యత్తును గురించి "ఆఫ్రికానుంచి అలాస్కావరకూ" ప్రశ్నలు బయలుదేరినాయి.

1944 లో అమెరికన్ అధ్యక్షపదవికి తయారవుతున్న వెండల్ విల్కీ 49 రోజుల్లో 31000 మైళ్ళు ప్రయాణంచేసి భూగోళాన్ని అంతాచుట్టి అన్నియుద్ధరంగాలను పరికించిన తరువాత రచించిన"ఒకే ప్రపంచం"అనే పుస్తకంలో ఈవిధంగా వ్రాశాడు.

"ఆఫ్రికా మొదలుకొని అలాస్కావరకూ ఒకే ఒకప్రశ్న అడుగుతున్నారు. ఇండియా విషయం ఏమిటి? పశ్చిమసామ్రాజ్యవాదం కంటె జపాన్ పరిపాలన ఎక్కువ క్రూరంగా ఉంటుందనే కారణంతో వారినందరిని మనతో కలవమని అడుగుతున్నామని ఆసియా ప్రజలందరూ భావిస్తున్నారు. అంతకంటె మంచికారణం ఏమీ మనం వారికిచూపించలేదు. "స్వాతంత్ర్యం, అవకాశం" అను రెండుమాటలు ఆసియా ప్రజలందరిలో నేడు అద్భుతమైన పనిచేస్తున్నాయి. అటువంటి మాటలను మనదగ్గరనుంచి జపాన్ ప్రజలు దొంగిలించి వారి ప్రయోజనములకొరకై వినియోగపరుచుకోనిస్తున్నాం."

ఈయుద్ధం ప్రపంచప్రజలందరియొక్క విముక్తియుద్ధమని స్టాలిన్ చెప్పిన విషయంతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని; అట్లాంటిక్ ఛార్టర్‌ను అన్నిదేశాల ప్రజలకు (పశ్చిమ, తూర్పు) వర్తింపచేసి ఫాసిస్టులకు వ్యతిరేకంగా ఆసియా ప్రజలందరిని యుద్ధంలోకి పూర్తిగా తీసుకురావాలని విల్కీ వ్రాశాడు.

ఈవిధంగా 'అట్లాంటిక్ ఛార్టర్' పీడితదేశ ప్రజలందరికి వర్తింపచేయాలనే ఆందోళన రోజురోజుకూ పెరుగుతూవచ్చింది.

ప్రపంచ విముక్తి యుద్ధంలో ప్రపంచ ప్రజలందరితోపాటు ఫాసిస్టు సామ్రాజ్యవాదుల నెదుర్కొనుటకై మనదేశంలో మనంగూడా ఐక్యమయి జాతీయ ప్రభుత్వమును గుంజుకొనుటద్వారా 'అట్లాంటిక్ ఛార్టర్'ను మన భారతదేశానికి వర్తింపచేసుకొనగలమని భారత కమ్యూనిస్టుపార్టీ చెప్తోంది. 'అట్లాంటిక్ ఛార్టర్'ను మన దేశానికి వర్తింపజేయుటకై ప్రపంచ ప్రజలుచేసే ఆందోళనతోపాటు మనదేశంలోని చీలికలను నిర్మూలించి, కాంగ్రెసు-లీగు ఐక్యత నిర్మించుకొన్నయెడల అట్లాంటిక్ ఛార్టర్ మనదేశానికిగూడా వర్తించగలదు. వర్తింపచేసుకునే బాధ్యత మనమీదనే ఉందని భారత కమ్యూనిస్టుపార్టీ చెప్తోంది.

1941 అక్టోబర్ 29 వ తేదీన భారతదేశ కేంద్రశాసనసభలో అట్లాంటిక్ ఛార్టర్ ఇండియాకు వర్తించాలని ఏకగ్రీవంగా తీర్మానించబడింది. ప్రభుత్వ సభ్యులందరూ తీర్మానాన్ని వ్యతిరేకించకుండా తాటస్థ్యం వహించాల్సి వచ్చింది. భారత దేశంలోని ప్రజాసంస్థలన్నీ ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చినాయి.

ఇండియాలోనేగాక, విదేశాల్లోగూడా భారతదేశ స్వాతంత్ర్యాన్ని గురించి ఆందోళన నానాటికి ఎక్కువయింది. 70 లక్షల బ్రిటిష్ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఇండియాకు జాతీయప్రభుత్వాన్ని ఇవ్వాలని తీర్మానించింది. ఇదేవిధంగా 60 లక్షల అమెరికను కార్మికుల సంస్థ; సి. ఐ. ఓ. 6 లక్షల ఆస్ట్రేలియను కార్మికుల సంస్థకూడ తీర్మానాలు ప్యాసుచేసి ఆందోళన సాగిస్తున్నాయి.

1943 డిసెంబర్ 13 వ తేదీన మళ్ళీ "అట్లాంటిక్ ఛార్టర్-అమెరీ" ప్రశంస వచ్చింది. బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బి. బి. సి. రేడియో) వార కార్యంక్రమంలో వికామ్‌స్టీడ్ "ఇండియా - చతుర్విధ స్వాతంత్ర్యాలు" అను విషయాన్ని గురించి మాట్లాడుతున్నప్పుడు, "ఇండియా మొదలైన ఆసియా దేశాలను అట్లాంటిక్ ఛార్టర్‌నుంచి బహిష్కరించుటయేనా?" అని ప్రశ్నించగా "కాదు, గట్టిగా కాదు" అని సమాధానంచెప్తూ ఈవిధంగా ప్రసంగించాడు — "బాధ్యతగల రాజ్యాంగవేత్త లెందరో ఈవిషయాన్ని గురించి చెప్పినతరువాత మళ్ళీమళ్ళీ దీన్ని గురించి ప్రశ్నించుట ఆశ్చర్యంగాఉంది. అయినా, అనుమానరహితం చేసుకొనుటకై ఇండియా సెక్రటరీ ఆఫ్ స్టేట్ అయిన అమెరీనే ఈ విషయాన్నిగురించి ప్రశ్నించాను. ఇండియాకు సంబంధించి నంతవరకూ అట్లాంటిక్ ఛార్టర్ సూత్రాలను రూజ్‌వెల్టు - చర్చిల్ ప్రకటనకు ముందే ప్రకటించబడినవని అమెరీ చెప్పమన్నాడు" అని వికామ్‌స్టీడ్ జవాబు చెప్పాడు.

ఆంగ్లో - సోవియట్ ఒడంబడిక 1942 మేనెలలో జరిగినపుడు దానిలోకూడ అట్లాంటిక్ ఛార్టర్ యునైటెడ్ నేషన్సు కన్నిటికీ వర్తిస్తాయని; ఆ ఛార్టర్‌లోని

స్వయంనిర్ణయహక్కు ననుసరించే ప్రపంచశాంతి నిర్మాణానికి పూనుకుంటామని స్పష్టంగా వ్రాయబడింది. యునైటెడ్ నేషన్సు ఒడంబడికలో భారతదేశంకూడ ప్రత్యేకంగా సంతకంచేసి ఉందనే విషయం మనం జ్ఞాపకముంచుకోవాలి.

అట్లాంటిక్ ఛార్టర్ ఇండియాకు వర్తిస్తుందని చెప్పుటకు సామ్రాజ్యవాదులు నిరాకరిస్తున్నారంటే ఆశ్చర్యమేముంది? "బ్రిటిష్ సామ్రాజ్యాన్ని రద్దుచేయుటకు కాదు నేను ప్రధానమంత్రినైంది"అని చర్చిల్ ఘోషిస్తున్నాడంటే బ్రిటిష్ప్రభుత్వం యొక్క సామ్రాజ్యవాద ఆయాశలు స్పష్టపడుతున్నాయి.

"ప్రపంచ పీడిత ప్రజలందరికీ మన సర్వశక్తులా సహాయంచేసి, వారివారి మాతృదేశాల్లో యథేచ్ఛగా వారు కోరుకునే సంపూర్ణస్వేచ్ఛను వారు అనుభవించేట్లు చూడాలి." అని స్టాలిన్ చెప్తున్నప్పుడు సోవియట్ యుద్ధాశయాలుగూడా స్పష్టపడుతున్నాయి. "ఒక్క యూరపియన్ ప్రజలకేగాక, మా ఆశయాలను సరిగా అర్థం చేసుకొని ఆమోదించే ప్రపంచ ప్రజలందరిని సోవియట్ యూనియన్ ప్రజలు తప్పనిసరిగా విముక్తిగావించే సమయం వస్తోంది" అని సోవియట్ విదేశాంగ మంత్రి ఖచ్చితంగా చెప్తున్నప్పుడు సోవియట్ ఆశయాలను అనుమానించవలసిన పనేముంది?

అయితే 'అట్లాంటిక్ ఛార్టర్' ఇండియాకు వర్తించేది లేనిది నిర్ణయించే దెవరు? యుద్ధానంతర భావిగతిని (కాగితపు ప్లానులమీదగాక) యదార్థంగా ఎవరు నిర్ణయించబోతారో వారు నిర్ణయిస్తారు. యుద్ధానంతర ప్రపంచ పునర్నిర్మాణవిషయాన్ని సామ్రాజ్యవాదులు నిర్ణయించబోతారా? లేక ఫాసిస్టుల, సామ్రాజ్యవాదుల పాలనను ప్రత్యక్షంగా అనుభవించి, ఫాసిజాన్ని నాశనంగావించుటకై సామ్రాజ్యవాదులుపెట్టే అడ్డంకులనన్నిటినీ త్రోసివేసుకుంటూ ముందుకువెళ్ళి పైచెయ్యిని సంపాదిస్తున్న ప్రజాశక్తులచే ప్రపంచ భావిగతి నిర్ణయించబడుతుందా? ఈ ప్రశ్నమీద అంతా ఆధారపడిఉంది.

కాని ప్రపంచ రాజకీయ పరిస్థితులన్నీ ప్రజాస్వాతంత్ర్య ఉద్యమాలకు రోజురోజుకూ అనుకూలంగా పరిణమిస్తున్నాయి. ఇండియాను గురించి 'ఆఫ్రికా నుంచి అలాస్కావరకూ' ఆందోళన బయలుదేరింది. యుద్ధానంతరం తమ పెత్తనాన్ని యథాప్రకారంగా సాగించాలని సామ్రాజ్యవాదులు వేస్తున్న ప్లానులన్నీ ఒకటితరువాత ఒకటి భగ్నం అవుతున్నాయి. సోవియట్ ప్రజలు సాధిస్తున్న మహత్తర విజయాలవల్ల ఫాసిస్టుల పతనం సమీపించుటయేగాక, యుద్ధాన్ని త్వరగా ముగించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను స్థాపించుకొనుటకు ప్రజాశక్తులు ముందుకు వస్తున్నాయి.

అయితే 'అట్లాంటిక్ ఛార్టర్' మనదేశానికి వర్తింపచేసుకొనుటకై మనం చేయవలసిన కృషినిచేస్తూ ప్రపంచ ప్రజలందరితోపాటు, సోవియట్ యూనియన్‌తోపాటు, సామ్రాజ్యవాదులు కల్పించే అడ్డంకులను త్రోసివేసుకుంటూ ముందుకు సాగిపోవాలి. మనదేశరక్షణకు (మనదేశరక్షణ విషయంలో సామ్రాజ్యవాదుల బాధ్యతకంటె మన బాధ్యతయే ఎక్కువకదా!) జాతీయైక్యతను నిర్మించుకుని ఇతరదేశ ప్రజలతో ఐక్యం కాగల్గినప్పుడు, అట్లాంటిక్ ఛార్టర్ మీద అమెరీ, చర్చిల్ ప్రభృతులుచేసే వ్యాఖ్యలు నిజమయేది లేక సోవియట్ వ్యాఖ్యలు నిజమయేది తేలుతుంది.

అంతేగాని, అట్లాంటిక్ ఛార్టర్ ఇండియాకు వర్తిస్తుందా? లేదా? అనేప్రశ్నకు సామ్రాజ్యవాదులనుంచి సమాధానం కొరకు ఎదురుచూస్తూ, ఈ లోపల స్టాలిన్ అందులో ఎందుకుసంతకం చేశాడు? అని ప్రశ్నిస్తూ నిస్తబ్ధత వహిస్తూ కూర్చుంటే ఫాసిస్టు ప్రమాదమునకు గురి అగుటయేగాక ప్రపంచప్రజల స్వాతంత్ర్యోద్యమానికి ద్రోహం చేసినవారమవుతాం.

ఈవిషయంలో 1943 ఆగష్టు నెలలో ప్రముఖ సోవియట్ పత్రిక అయిన "యుద్ధం, కార్మికవర్గం" చైనాప్రజలకిచ్చిన సందేశం మనకుగూడా మార్గదర్శకంగా తోడ్పడగలదు ఐక్యచైనా ప్రజాశక్తులలో చీలికలు కల్పించుటకు జపాన్ కొత్తఎరలువేస్తున్న సమయంలో ఆపత్రిక ఇలా వ్రాసింది.

"చైనా ప్రజలయొక్క స్వాతంత్ర్యం ప్రధానంగా చైనా ప్రజలయొక్క స్వయంశక్తి, జాతీయైక్యతలమీదనే ఆధారపడియుంటుంది. ఎంతదృఢంగా మీజాతీయైక్యతను బలపరచుకొని ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతారో, అంత త్వరగా బయటనుంచి మీకు సహాయం వచ్చుటకు మార్గాలు ఏర్పడుతాయి."

# సోవియట్ విజయాలవల్ల సామ్రాజ్యవాదులు బలపడుతున్నారా?

"జర్మన్ దురాక్రమణ దుండగీడులను నాశనంగావించగలవారు మీరేనని యావత్ప్రపంచమూ మీవైపుచూస్తోంది. జర్మన్ దురాక్రమణదారులచే బానిసలుగా చేయబడిన యూరపియన్ ప్రజలందరూ తమను విముక్తిగావించే రక్షకులుగా మీవంక ఎదురుచూస్తున్నారు. ఒక గొప్ప స్వాతంత్ర్య సంపాదనా కార్యక్రమం మీకు లభించింది. ఈ ఉత్తమ కార్యసాధనకు తగినవారమని మీరు రుజువు చేయండి. మీరు సాగించేది ఒక మహత్తర స్వాతంత్ర్యయుద్ధం - ఒక ధర్మ యుద్ధం. మహాపురుషులైన మన పూర్వీకుల చిరస్మరణీయకార్యాలవల్ల మీరు ఉత్తేజపూరితులుకండి. మహత్తరమైన లెనిన్ విజయపతాకం మీ శిరస్సులపైగా ఎగురుగాక!

లెనిన్ పతాకంక్రింద, ముందుకుసాగి విజయాన్ని సాధించండి!!"

—స్టాలిన్, 1941 నవంబర్ 6

"ఈ విముక్తియుద్ధంలో మనం ఒంటరిగాలేము. ఈమహాయుద్ధంలో యూరపియన్ ప్రజలు, అమెరికన్ప్రజలు, – హిట్లర్ దుండగీడుల అక్రమ పరిపాలనక్రింద క్రమ్గుచున్న జర్మన్ ప్రజలుగూడా – మనకు నిజమైన మిత్రులుగా ఉంటారు. స్వాతంత్ర్యంకొరకు, ప్రజాస్వామ్యహక్కులకొరకు యూరప్, అమెరికా ప్రజలు సాగించే పోరాటంతో మన స్వాతంత్ర్య పోరాటం కలిసిపోతుంది. హిట్లర్ బానిసత్వానికి, లేక బానిసత్వప్రమాదానికి గురిఅయిన ప్రజలందరితో కూడిన స్వాతంత్ర్యాన్ని ఆశించే ప్రజాఐక్యసంఘటనగా ఈయుద్ధం పరిణమిస్తోంది".

— స్టాలిన్: 1941 జులై 3

యుద్ధ పరిణామగతిని పరిశీలించే వారందరికి ఒక విషయం స్పష్టంగా కన్పిస్తుంది. రోజురోజుకూ మిత్రమండలికి పైచెయ్యి అగుటయేగాక ఫాసిస్టుల వినాశనంగూడా సమీపిస్తోందని వెంటనే బోధపడుతుంది. ఈ పరిణామానికి ప్రధానకారణం సోవియట్ ప్రజలు, సోవియట్ - జర్మనీ యుద్ధరంగంలో సాధి

స్తున్న మహత్తర విజయాలే. ముస్సోలినీ పతనానికి సోవియట్ విజయాలు ఎలా కారణమైనవో ఇప్పుడే తెలుసుకుంటాం. సోవియట్ విజయాలు హిట్లర్ ఓటమిని దగ్గరకు తీసుకువస్తున్నాయి. యూరప్‌లో ఫాసిస్టులు నాశనమైనప్పుడు మిత్రమండలి ప్రజాశక్తులన్నీ జపాన్‌ను ఓడించడానికి కేంద్రీకరింపబడుతాయి. ఇప్పటికే జపాన్ పసిఫిక్‌సముద్రంలో దెబ్బను కాచుకునేస్థితికి వచ్చింది. మొత్తంమీద ప్రపంచ యుద్ధరంగాలన్నీ కలిపిచూస్తే మిత్రమండలి గెలుస్తోందని స్పష్టమవుతోంది. ప్రస్తుత ప్రపంచ యుద్ధం యొక్క పరిస్థితి ఇది.

అయితే మిత్రమండలి గెలుస్తోందంటే కొందరి దేశభక్తులకు నిరుత్సాహం దేనికి? మిత్రమండలి విజయాన్ని, మిత్రమండలి యుద్ధకృషిని కాంగ్రెస్ సంస్థ కోరింది. అమానుష ఫాసిస్టులు ప్రపంచజానిసత్వానికి దారితీసే క్రూరులని, ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మిత్రమండలి ఆశయాలు న్యాయమైనవని, కాంగ్రెసు 1942 ఆగస్టు తీర్మానంలో స్పష్టంగా చెప్పింది. ప్రస్తుత యుద్ధం రెండు పక్షాలమధ్య జరుగుతోందని, — ఫాసిస్టులు, ఫాసిస్టు వ్యతిరేకులైన మిత్రమండలి - ఫాసిస్టు వ్యతిరేక సాంప్రదాయాలు కలిగిన ఇండియాయొక్క న్యాయమైన స్థానం మిత్రమండలి పక్షంలోనేనని కాంగ్రెసు అధ్యక్షుడు మౌలానా అజాద్ సగర్వంగా ప్రకటించాడు. అయితే ఫాసిస్టు వ్యతిరేకంగా మిత్రమండలి యుద్ధకృషిలో పాల్గొనుటకై జాతీయ ప్రభుత్వాన్ని కోరింది. కాని ప్రపంచం మొత్తంమీద మిత్రమండలి విజయాన్నే మనసార కాంగ్రెసు కోరింది. బ్రిటిష్ ప్రభుత్వం జాతీయ ప్రభుత్వానికి అంగీకరించనప్పటికి కాంగ్రెసు అంతర్జాతీయ ఆశయాల్లో మార్పేమీలేదు. అయినప్పటికి మిత్రమండలి గెలుస్తూంటే దేశభక్తులు నిరుత్సాహపడటానికి కారణం ఏమిటి? మిత్రమండలి అంతిమ విజయం దగ్గరకు వస్తున్నకొలదీ, యుద్ధం అంతమయ్యే సమయం సమీపిస్తున్నకొలదీ, బ్రిటిష్ సామ్రాజ్య వాదులు యధాస్థానంలో ఉండిపోతారని, ఇండియాసమస్య యధాస్థితికి వస్తుందని, యుద్ధాన్ని భారతీయులు వినియోగించుకోలేకపోయారని ఈ దేశభక్తుల ఆవేదన. మిత్రమండలి విజయమంటే సామ్రాజ్యవాదుల విజయమనే అభిప్రాయంతో అటువంటి విజయానికి కారణమవుతున్న సోవియట్ ప్రజల ఫాసిస్టు వ్యతిరేకవిజయాలంటే కొందరు దేశభక్తులు ఉత్సాహాన్ని కనపరచరు. సోవియట్ విజయాలు సోవియట్ ప్రజలను ఫాసిజాన్నుంచి రక్షించుటయేగాక సామ్రాజ్యవాదులకు మరొక "హయాం"ను కల్గిస్తున్నవనిగూడా వీరు అభిప్రాయపడతారు.

నేటి ప్రపంచ రాజకీయరంగంలో అనుక్షణంవస్తున్న బ్రహ్మాండమైన మార్పులను గుర్తించలేకపోతున్నారు వీరు. యదార్థంగా మిత్రమండలిసాధించే ప్రతి విజయంతో సామ్రాజ్యవాదం మరింత విచ్ఛిన్నమయిపోతున్నప్పుడు, సామ్రాజ్య

వాదం యథాస్థితిలో ఉన్నదని, పైగా బలపడుతోందని అభిప్రాయపడుట జరుగుతోంది. సామ్రాజ్యవాదంయొక్క శక్తి అకుంఠితమైనదనే గ్రుడ్డినమ్మకం ఏర్పడి. ప్రజాశక్తియొక్క అపారబలాన్ని గుర్తించలేకపోవుటవల్ల నిరుత్సాహానికి దారితీస్తోంది. నిజానికి సామ్రాజ్యవాదం ప్రతినిమిషం విచ్ఛిన్నమవుతోంది. సామ్రాజ్యవాదుల యుద్ధానంతర ప్లానులన్నీ ఒకటితరువాత ఒకటి భగ్నం అవుతున్నాయి. ఎన్నడూలేనంత బలహీనస్థితికివచ్చింది సామ్రాజ్యవాదం. సామ్రాజ్యవాదుల ముఠాలో అపూర్వ వైరుధ్యాలు పెరిగిపోయి, రోజురోజుకు క్లిష్టపరిస్థితులలో చిక్కుకుంటోంది. యుద్ధానంతరం వారి పెత్తనం సాగే సూచనలు ఎక్కడా కన్పించుటలేదు. ప్రతినిమిషం ప్రజలనుంచి దూరమైపోతూ, ఎప్పుడూ లేనంతటి ఒంటరిస్థితికి వచ్చింది. ప్రపంచ రాజకీయ పరిణామంలో ఫాసిజంతోపాటు సామ్రాజ్యవాద వినాశనంగూడా జరుగుతుంది. 1941 జూన్‌లో సోవియట్ యూనియన్ యుద్ధంలో ప్రవేశించిన తరువాత, ఈవినాశనం ఇంకా త్వరితగతిలో జరుగుతోంది. సోవియట్ విజయాలన్నీ సోవియట్ ప్రజలను ఫాసిజాన్నుంచి రక్షించుటయేగాక, ప్రపంచ ప్రజలందరికి పైచెయ్యి కలుగజేయుటకు ఎలా సహాయపడుతున్నవో వివరంగా చూద్దాం.

1944జూన్ తరువాత బయలుదేరిన నూతనదశలో సామ్రాజ్యవాద వినాశనం ఎంత త్వర త్వరగా జరుగుతున్నదో చూసేముందు, ఎట్టి విచ్ఛిన్న పరిస్థితులలో సామ్రాజ్యవాదం ఈ నూతనదశలో ప్రవేశించిందో చూద్దాం.

* * * *

సామ్రాజ్యవాదం అత్యున్నతస్థాయికివచ్చి ప్రపంచాన్నంతా ఆవరించుకొని ఇప్పటికి 43 సంవత్సరాలయింది. అనగా 1900 నాటికి ప్రపంచాన్నంతా ఆర్థికంగాగాని, రాజకీయంగాగాని, సామ్రాజ్యవాదులు పంచుకున్నారు. అప్పటినుంచి సామ్రాజ్యవాదం ప్రత్యక్షంగాగాని పరోక్షంగాగాని ప్రపంచ ప్రజలందరిని పీడించటం ప్రారంభించింది. అనగా ప్రపంచ ప్రజల నిత్యజీవితమంతా ఈ సామ్రాజ్యవాదుల అధీనం అయిందన్నమాట. కాని సామ్రాజ్యవాద వినాశనంకూడా 1900 తోనే ప్రారంభమయింది. కారణాలు : (1) సామ్రాజ్యవాదుల మధ్యగల పోటీలు. (2) సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా అభివృద్ధిఅవుతున్న వలసదేశ జాతీయోద్యమాలు (3) సామ్రాజ్యవాదదేశాల్లో అభివృద్ధిఅవుతున్న విప్లవ కార్మికోద్యమాలు—ఈ వైరుధ్యాలన్నింటివల్ల సామ్రాజ్యవాదం శిథిలమగుట ప్రారంభించింది. శిథిలమగుటయేగాని అభివృద్ధి లేకపోవుటకు కారణం, కొత్త దేశాలను ఆక్రమించుకొనుటకు సామ్రాజ్యవాదులకు అవకాశాలు పోయినాయి. ప్రపంచమంతా పంపకమయిపోవుటవల్ల, యుద్ధాల ద్వారానే సామ్రాజ్యవాదుల పరస్పర వైరుధ్యాలు పరి

ష్కారం చేసుకోవలసివచ్చింది. అనగా సామ్రాజ్యవాదుల పక్షంలో చీలికలు ఎక్కువయి, ప్రపంచం మొత్తంమీద సామ్రాజ్యవాదం శిథిలమగుట ప్రారంభించింది.

భారతీయులను పీడించే సామ్రాజ్యవాదం భారతీయులనేగాక ప్రపంచ ప్రజానీకాన్నంతా పీడిస్తోంది. ప్రపంచవిధానమైన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగించే స్థానిక సామ్రాజ్యవ్యతిరేక పోరాటాలన్నీ ప్రపంచసామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో భాగాలే. ఈదృక్పథం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే ప్రతి వ్యక్తికి అవసరం. ఈ దృక్పథం లేకపోతే ప్రపంచ ప్రజలు సాగించే సామ్రాజ్య వ్యతిరేకపోరాటం తనకు ఎలా సహాయపడుతుందో గ్రహించలేక, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఒంటరిపెత్తులు వేసుకుంటూ దూరమయిపోక తప్పదు. ముఖ్యంగా ఈనాడు జరుగుతున్న ప్రపంచ యుద్ధపరిణామాన్ని దానిలోనుంచి బయలుదేరే నూతన భవిష్యత్తును అవగాహనచేసుకొని ఇతరదేశ ప్రజలందరితో బాటు ముందుకు సాగిపోవుటకు ఈ ప్రపంచ దృక్పథం ఎంతో అవసరమవుతోంది. అయితే సామ్రాజ్యవాదం 1900 నుంచి ఎలా శిథిలమయిపోతున్నదో గ్రహించుట ప్రతి దేశభక్తునికి అనివార్యమవుతోంది.

1900-1914 మధ్య సామ్రాజ్యవాదులమధ్య జరిగిన కీచులాటలన్నీ మొదటి సామ్రాజ్యవాద యుద్ధానికి దారితీసినాయి. 4 సంవత్సరాలపాటు సామ్రాజ్యవాదులు ప్రజాసామాన్యాన్ని మారణహోమంలో ఆహుతిచేసి. తమ వైరుధ్యాల పరిష్కారానికై యుద్ధంచేశారు. కాని సామ్రాజ్యవాద యుద్ధవ్యతిరేకంగా కృషి చేసిన సోవియట్ విప్లవంమాత్రం విజయంపొందింది.

సోవియట్ విప్లవం (1917) సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి గెలిచింది. అనాడే సామ్రాజ్యవాదుల ప్రపంచ పెత్తనానికి స్వస్తి చెప్పబడింది. ఇప్పుడు ప్రపంచ భూభాగంలో $\frac{1}{6}$ వంతు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రజల వశమయింది. యుద్ధంవల్ల సామ్రాజ్యవాదులమధ్య వైరుధ్యాలు మరింత తీవ్రమయిన సమయంలో బయలుదేరిన సోవియట్ సోషలిస్టు ప్రభుత్వం మిగిలిన సామ్రాజ్య వాదులందరికి (రష్యన్ సామ్రాజ్యవాదం అంతరించింది) కంటకంగాతయారైంది. అప్పటినుంచి, ఇదివరకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న 3 ప్రధాన వైరుధ్యాలకు తోడుగా ఒక నూతన ప్రపంచ వైరుధ్యం బయలుదేరింది. అదే — సామ్రాజ్యవాద ప్రపంచానికి వ్యతిరేకంగా సోషలిస్టు ప్రపంచం.

సోవియట్ విప్లవం ప్రపంచ రాజకీయరంగంలో ప్రాముఖ్యమైన అనేక విప్లవమార్పులు తీసుకొనివచ్చింది. సోవియట్ విప్లవంతో ఒక నూతనవిప్లవ

యుగం ప్రారంభమయిందని, ఈ నూతనయుగానికి 4 ప్రధానలక్షణాలు ఉన్నవని స్టాలిన్ చెప్పాడు :

(1) సోవియట్ విప్లవంతో ఒక నూతన స్వాతంత్ర్యమార్గాన్ని చూపే కార్మికవర్గ శక్తి బయలుదేరింది. ప్రపంచ ప్రజలందరూ శిక్షణగల్గిన విప్లవ పార్టీలను (కమ్యూనిస్టు పార్టీలు) నిర్మించుకొని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వర్గపోరాట సిద్ధాంతంమీద ఐక్యమగుటకు ప్రారంభించారు. (2) సోవియట్ విప్లవంతో సామ్రాజ్యవాదుల పెత్తనానికి శాశ్వతంగా స్వస్తి చెప్పబడింది. పైగా సామ్రాజ్యవాదులమధ్య చీలికలు ఎక్కువయినాయి. (3) సోవియట్ విప్లవంతో వలసదేశ విప్లవాలవెల్లువ ఒకటి క్రొత్తగా బయలుదేరింది. చైనా, ఇండియా, టర్కీ, ఇరాన్, సిరియా, పాలెస్టయిన్, ఈజిప్టుదేశాల జాతీయ విప్లవాలు కొన్ని ఉదాహరణలు. (4) మార్క్సిజమ్ పీడిత ప్రజాపోరాటానికి ఒక శక్తివంతమైన ప్రత్యక్ష ఆయుధంగా నిరూపించబడింది. అంతవరకూ కేవలం ఒక సిద్ధాంతంగా ఉన్న మార్క్సిజమ్ ఒక ప్రత్యక్ష ఆయుధంగా ఉపయోగపడగలదని అందరూ గ్రహించారు.

సోవియట్ విప్లవఫలితాలన్నీ సామ్రాజ్యవాదానికి పెద్ద దెబ్బలుగా తయారైనాయి. యుద్ధంవల్ల (1914) సామ్రాజ్యవాదుల మధ్యగల వైరుధ్యాలన్నీ మరింత తీవ్రమయినాయి. జర్మన్ పెట్టుబడిదారీవర్గం పూర్తిగా దెబ్బతిన్నది. దాని వలసదేశాలన్నీ బ్రిటన్, ఫ్రాన్సుల వశమయినాయి. బ్రిటన్ మార్కెట్లలో అమెరికా ప్రవేశించింది. యుద్ధానికిపూర్వం ప్రపంచమార్కెట్టులో బ్రిటన్‌కుగల ఆధిక్యత నశించి అమెరికాపైకి వచ్చింది. బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదుల మధ్య బాగా పెరిగిపోయిన వైరుధ్యం సామ్రాజ్యవాద ప్రపంచంలో ప్రధాన వైరుధ్యంగా మారింది. యూరప్‌లో ఫ్రాన్సు ఆధిక్యత హెచ్చుటవల్ల బ్రిటన్,ఫ్రాన్సుల మధ్యగల వైరుధ్యం తీవ్రమయింది - సరే, జర్మనీకి—మిగిలిన సామ్రాజ్యవాదులకు మధ్య విషమించిన సంబంధాన్ని గురించి చెప్పనక్కరేలేదు. ఇటలీలో అమానుష ఫాసిస్టు ప్రభుత్వం బయలుదేరింది (1922). పసిఫిక్‌లో జపాన్ ఆధిక్యత పెరుగుటవల్ల చైనా దోపిడీవిషయంలో వివిధ సామ్రాజ్యవాదులమధ్య (బ్రిటన్, అమెరికా, జర్మనీ, ఫ్రాన్సు, జపాన్ వైరుధ్యాలు తీవ్రమయినాయి. ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాదుల చీలికలను క్లిష్టంచేయుటకు ఉపయోగపడింది. సోవియట్ యూనియన్ బయలుదేరుటవల్ల, క్లిష్టమైన సామ్రాజ్యవాద వైరుధ్యాలు మరింత క్లిష్టమయినాయి. తమలోతాము కొట్టుకుంటూ, సోవియట్ యూనియన్ మీద దెబ్బకొట్టాలని వారిఉద్దేశ్యం. ఈ పరిస్థితులకుతోడు సామ్రాజ్యవాద వ్యతి

రేక శక్తులన్నీ యుద్ధానంతరం బాగా తలయెత్తినాయి. (జాతియ విప్లవాలు, కార్మిక ఉద్యమాలు.)

ఈవిధంగా 1917 తరువాత ప్రపంచ సామ్రాజ్యవాదం నూతన క్లిష్టదశలో ప్రవేశించింది. ఈ దశనుంచి నేటివరకూ సామ్రాజ్యవాదులు బయటపడలేదు. ముందుగూడా బయటపడలేని పరిస్థితులు వారిని చుట్టుముట్టి వేస్తున్నాయి. అందువల్లనే సామ్రాజ్యవాదం 1917 నుంచి శాశ్వత సంక్షోభంలో చిక్కుకొనిపోయి, త్వరత్వరగా శిథిలమయిపోతోందని చెప్తున్నాం.

యుద్ధానంతరం సామ్రాజ్యవాదులువేసే సోవియట్ వ్యతిరేక ఎత్తులన్నిటినీ భగ్నంచేసి, సోవియట్ యూనియన్ ఎలా బలపడిందీ ఇదివరకే చూశాం. యుద్ధానంతరం తమ పెత్తనానికి స్థిరత్వం కల్గించుకోడానికి సామ్రాజ్యవాదులు అనేక ఎత్తులు వేశారు. జర్మనీని పైకిరాకుండా చేయాలని, సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగానూ, యూరప్‌లో కొత్త సరిహద్దులతో కొత్త దేశాలను (ఆస్ట్రియా, జెకోస్లవేకియా, హంగెరీ, యుగోస్లావియా దేశాలను, బాల్టిక్ రాజ్యాల గ్రూపును) నిర్మించారు. కొత్తముఠాలను ఏర్పరిచారు. 'జాతిసమితి'ని ఏర్పరిచారు. సామ్రాజ్యవాదులసంధి అయిన వర్సైల్స్‌సంధిగూడా సామ్రాజ్యవాదుల నూతన ఆక్రమణలను రక్షిస్తుందనుకున్నారు. ఒకటికాదు; అనేక ఎత్తులు వేశారు. అన్నీ భగ్నం అయినాయి. ఇదంతా పాతచరిత్ర. కాని ముఖ్యవిషయమేమిటంటే, సామ్రాజ్యవాదుల యుద్ధానంతర ప్లానులన్నీ ఒకటితరువాత ఒకటి భగ్నమయి, పోను పోను, వారి మధ్య వైరుధ్యాలు మరింత తీవ్రమయినాయి. అనగా సామ్రాజ్యవాదం 1917 నుంచి మరింత త్వరగా శిథిలమగుట ప్రారంభించింది. అందువల్లనే లెనిన్ సామ్రాజ్యవాదయుగాన్ని (1900 తరువాత) సామ్రాజ్యవాదం శిథిలమయే యుగమని గూడా పిలిచాడు.

1929 లో ప్రారంభమయిన ప్రపంచ ఆర్థికసంక్షోభం పెట్టుబడిదారీ విధానం యొక్క బలహీనతను బహిర్గతంచేసింది. 1929—1933 మధ్యవచ్చిన ఆర్థిక సంక్షోభం సామ్రాజ్యవాద ప్రపంచాన్ని ఊగులాడించింది. ప్రపంచవ్యాపారం స్తంభించింది. మార్కెట్లు అన్నియు నశించినాయి. ఉత్పత్తి ఆగిపోయింది. ఫ్యాక్టరీలన్నీ మూతబడినాయి పెట్టుబడిదారీ దేశాలన్నిటిలో నిరుద్యోగం పెరిగిపోయింది. యుద్ధానంతరం యథాస్థితికి వచ్చుటకై సామ్రాజ్యవాదులువేసిన ప్లానులన్నీ భగ్నమయినాయి. ఈ ఆర్థిక సంక్షోభకాలంలో సామ్రాజ్యవాదులమధ్య చీలికలు మరింత వృద్ధిఅయినాయి. అదేసమయంలో సంక్షోభంలో చిక్కుకొనకుండా, సోషలిస్టు ప్లాను ప్రకారం పరిశ్రమలను, వ్యవసాయవిధానాన్ని అభివృద్ధి చేసుకుంటూ నిరుద్యోగ సమస్యలేకుండా సోవియట్ యూనియన్ బాగా బలపడింది; సోషలిస్టు విధా

నానికి సామ్రాజ్యవాదానికి గల తీవ్రవ్యత్యాసం సంక్షోభకాలంలో స్పష్టంగా నిరూపించబడింది. సోవియట్ యూనియన్ అంటే సామ్రాజ్యవాదులకు కంగారు ఎక్కువయింది. దీనికితోడు వలసదేశ జాతీయోద్యమాలుగూడా బాగా బలపడి సామ్రాజ్యవాదాన్ని కూలద్రోయుటకు సకల ప్రయత్నాలు చేస్తున్నాయి.

సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొన్న ఈ క్లిష్టపరిస్థితులలో జర్మనీలో బయలుదేరిన విషమస్థితి సామ్రాజ్యవాదులను కలవరపెట్టింది. యుద్ధఫలితాలవల్ల ఇంకా కోలుకొనని జర్మనీలో ఆర్థిక సంక్షోభం మరీ తీవ్రరూపం దాల్చింది; జర్మనీలో కార్మికవిప్లవం బయలుదేరే పరిస్థితులు ఏర్పడినాయి. సోవియట్ యూనియన్‌తోపాటు జర్మనీలోగూడా విప్లవం జయంపొందితే, యూరప్‌అంతా సోషలిజమ్! ప్రపంచ సామ్రాజ్యవాదానికే స్వస్తి చెప్పబడుతుంది. అందువల్ల జర్మనీలో కార్మికవిప్లవాన్ని క్రూరంగా అణిచివేయాలని కుట్రలు చేస్తున్నజర్మన్ పెట్టుబడిదారులకు సామ్రాజ్యవాదులు పూర్తిసహాయంచేసి ఫాసిస్టు ప్రభుత్వానికి దారితీశారు. ఆ ఫాసిస్టుప్రభుత్వం సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ఉపయోగపడుతుందని ఆశించారు. సామ్రాజ్యవాదుల ఈ నూతన ప్లానుగూడా త్వరలోనే భగ్నమయింది.

1933 తరువాత సామ్రాజ్యవాదుల కూటమిలో - పరస్పర వైరుధ్యాలు అలా ఉండగానే - రెండు స్పష్టమైన ముఠాలు బయలుదేరినాయి. సామ్రాజ్యవాదులు (బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా;) ఫాసిస్టు సామ్రాజ్యవాదులు (జర్మనీ, జపాన్, ఇటలీ). పాతవారికి వ్యతిరేకంగా ప్రపంచ పెత్తనంకొరకు ఫాసిస్టుముఠా తయారైంది. ఇద్దరూ సోవియట్ యూనియన్‌కు విరోధులే, కాని ఒకరినొకరు ఉపయోగించుకుంటూ సోవియట్‌మీద దెబ్బకొట్టి తమ ప్రపంచ ఆధిక్యతకొరకు కుట్రలు పన్నటం ప్రారంభమయింది. సామ్రాజ్యవాదుల కూటమిలో ప్రళయం బయలుదేరింది. పాతవాళ్ళు తమ సామ్రాజ్యాలను ఎలా నిలుపుకొనగలమా అని ఆలోచనలోపడి, సామ్రాజ్యవాదులయుద్ధం బయలుదేరినప్పటికీ, తమ సామ్రాజ్యాలు నాశనమగునేమో అను భయంతో, కొత్తవాళ్ళు యుద్ధాలకు కాలుత్రవ్వి దురాక్రమణచేసినప్పుడల్లా మెదలకుండా లొంగి, ఆదురాక్రమణలను బలపరచారు. ఈకథ అందరికీ తెలిసిందే. ఒకదేశం తరువాత ఒకటి ఆక్రమించుకుంటూ ఫాసిస్టులు బలపడ్డారు-కాని ఫాసిస్టులఆశకు హద్దులేకపోయింది. చివరికి సోవియట్ యూనియన్ మీద యుద్ధానికి వెళ్ళుటకు సోవియట్‌బలాన్ని చూచి హిట్లర్ నిరాకరించాడు, సులభంగా తనకు లొంగుతూవచ్చిన బ్రిటన్, ఫ్రాన్సులపైదుముకడానికి తయారయ్యాడు. చివరికి 1939 సెప్టెంబరులో సామ్రాజ్యవాదుల మధ్యనే యుద్ధం బయలుదేరింది. 1917 నుంచి సోవియట్ వ్యతిరేక యుద్ధంకొరకు ప్రయత్నిస్తే, చివరికి సామ్రాజ్య

వాద కూటమిలో కలతలు ఎక్కువయి, సామ్రాజ్యవాదయుద్ధం బయలుదేరింది. సామ్రాజ్యవాదం పతనాన్ని సమీపిస్తోంది.

యుద్ధం బయలుదేరగానే, వలసదేశప్రజలు, విప్లవకార్మికపక్షాలు, పీడిత ప్రజలంతా సామ్రాజ్యవాదయుద్ధాన్ని వ్యతిరేకించారు. యుద్ధానికి బయటఉన్న సోవియట్ యూనియన్ సామ్రాజ్యవాదుల యుద్ధాన్ని ఖండిస్తూ, సామ్రాజ్యవాదుల లాభంకొరకు ప్రజలను ఆహుతిచేయవద్దని, విప్లవశాంతికొరకు ప్రజలంతా నడుముకట్టాలని పీడితప్రజలందరిని ఉత్తేజపరిచింది. ఈవిధంగా సామ్రాజ్యవాదులు తమలో తాము కొట్టుకుంటున్న సమయంలో వెనుకనుంచి పీడిత ప్రజలందరు సామ్రాజ్య వ్యతిరేక పోరాటాం సాగించారు. సామ్రాజ్యవాదులకు దెబ్బమీద దెబ్బతగిలింది. 1900 లో ప్రారంభమయిన పతనం, రాజకీయపరిణామంలో, రోజురోజుకూ తీవ్రమై, సామ్రాజ్యవాదులకు ఊపిరిఆడకుండా పోయింది. యదార్థరాజకీయాలు ఇవి.

1939 సెప్టెంబరు నుంచి 1941 జూన్ 22 వరకూ జరిగిన సామ్రాజ్యవాద యుద్ధకాలంలో సామ్రాజ్యవాదుల నగ్నస్వరూపం బయటపడింది. "స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, చిన్నదేశాలను రక్షించుటకు ఫాసిస్టులతో పోట్లాడుతున్నాం" అని సామ్రాజ్యవాదులు తమ యుద్ధాశయాలను ప్రకటించినప్పుడు ప్రజాసామాన్యంలో నమ్మినవాడెవడు ! వలసదేశాల ప్రజలమాట అలాఉంచి, సామ్రాజ్యవాదదేశాల ప్రజలే ఇంతకాలంనుంచి ఫాసిస్టులను తమ ప్రభుత్వాలు బలపరుచుటవల్ల కలిగిన ప్రమాదాన్ని అనుభవంలో తెలుసుకొని, సామ్రాజ్యవాద ప్రభుత్వముల నగ్న స్వరూపాన్ని గ్రహించారు చేంబర్లయిన్ ప్రభుత్వాన్ని వెళ్ళగొట్టారు. ఫాసిస్టు అనుకూలురందరికి స్వస్తిచెప్పటం ప్రారంభించారు. ప్రజల సహకారాన్ని ఏవగించుకున్న సామ్రాజ్యవాద ప్రభుత్వాలు క్రమేణా యూరప్‌నంతా హిట్లర్‌కు ఒప్పచెప్పినాయి. హిట్లర్ దురాక్రమణ క్రిందికి యూరప్‌దేశ ప్రజలందరూ వచ్చారు. ఫాసిస్టులబలం ప్రమాదకరంగా తయారైంది. ప్రపంచ ఆధిపత్యంకొరకు దెబ్బకొట్టేస్థితిలోకి వచ్చారు ఫాసిస్టులు ! దానిఫలితంగా పాత సామ్రాజ్యవాదులకు కొత్తవారికి మధ్య వైరుధ్యాలు అతి ఉచ్ఛస్థాయికి వచ్చినాయి.

"నిజంగా ఫాసిస్టులను ఓడించాలంటే, ప్రజల సహకారాన్ని సోవియట్ యూనియన్ సహకారాన్ని తీసుకునే ప్రజాప్రభుత్వం కావాలి" అనే ఆందోళన బ్రిటన్‌లో హెచ్చింది. బ్రిటన్‌మీద హిట్లర్ సాగించిన ఘోరవిమానదాడులు బ్రిటిష్ ప్రజల కళ్ళు తెరిచినాయి. ఫాసిస్టు ఆక్రమణ క్రిందికి వచ్చిన యూరపియన్ ప్రజలు ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. సామ్రాజ్య

వాదులు ప్రజాశక్తులను గుర్తించి వారి సహకారం తీసుకోవాలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

1941 జూన్ 22 న హిట్లర్ సోవియట్ యూనియన్‌మీద దాడి ప్రారంభిం చాడు. యూరప్‌నంతా ఆక్రమించినా, వెనుక సోవియట్‌యూనియన్ బలపడుతూ ఆక్రమిత ప్రజల తిరుగుబాట్లను ఉత్తేజపరుస్తూంటే, బ్రిటన్ అమెరికాలతో తెంపు లేని సముద్రయుద్ధంలోకి దిగటానికి సాధ్యంగాని హిట్లర్ 6 వారాల్లో సోవియట్‌ను ఓడించి, తనబలాన్ని రెట్టింపుచేసుకుని బ్రిటన్ అమెరికాలపని పట్టుదామని ఆశిం చాడు. సామ్రాజ్యవాదులవన్నీ ఊహలే! సామ్రాజ్యవాదుల ఆశయాలన్నీ భగ్న మగుట ప్రారంభించి చాలాకాలం అయింది!

చివరికి సామ్రాజ్యవాదులుకోరిన యుద్ధం వచ్చింది! అయితేనేం? యూరపి యన్ ప్రజల ఫాసిస్టు వ్యతిరేక చైతన్యం, సోవియట్ వ్యతిరేకతతో ఫాసిస్టులను బలపరిచి నెత్తిమీదికి ప్రమాదాన్ని తీసుకొనివచ్చిన సామ్రాజ్యవాద ప్రభుత్వాలంటే ఏవగింపు, సోవియట్ యందుగల సానుభూతి మొదలైన ఫలితాలన్నీ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా తయారైనాయి. "కమ్యూనిస్టు వ్యతిరేకినే" అంటూ చర్చిల్ ఫాసిస్టులకు వ్యతిరేకంగా సోవియట్ యూనియన్‌తో కలిశాడు. హిట్లర్, సోవి యట్‌ను ఆక్రమిస్తే అమెరికాకుగల ప్రమాదాన్ని గుర్తించిన అమెరికాప్రజల ఆందోళనా ఫలితంగా అమెరికా సోవియట్‌తో కలవాల్సి వచ్చింది.

25 సంవత్సరాల సోవియట్ వ్యతిరేక కుట్రలు శాశ్వతంగా భగ్నమయినాయి. సామ్రాజ్యవాదుల సోవియట్ వ్యతిరేకత నశించిందనికాదు. సోవియట్‌మీద సామ్రాజ్యవాదులందరూకలిసి దాడిచేసే ప్రయత్నాలు శాశ్వతంగా విఫలమయి నాయి. సోవియట్ వ్యతిరేకత చూపించినప్పుడల్లా స్వాతంత్ర్యంకొరకు పోరాడు తున్న ప్రజలు ఒకవైపునుంచి సోవియట్ యూనియన్ రెండోవైపునుంచి సామ్రాజ్యవాదుల సోవియట్ వ్యతిరేకత వైఖరులు తలఎత్తకుండా ఎప్పటికప్పుడు అణచివేసే పరిస్థితులు ఏర్పడినాయి. ఈవిధంగా సామ్రాజ్యవాదులకూటమిలో ప్రళయంపుట్టి ఫాసిస్టుముఠా వేరుచేయబడింది. రెండవముఠా ఆయా దేశ ప్రజల ఉద్యమాలు బలపడేకొద్ది పతనమవుతోంది. ఫాసిస్టు, సామ్రాజ్యవాదాలను నాశనం చేసి స్వాతంత్ర్యాన్ని సంపాదిచుకొనుటకై ప్రపంచ ప్రజలందరూ సోవియట్ యూనియన్ అండతో ముందుకుపోతున్నారు. 1941 జూన్ 22 తరువాత ప్రారంభ మయిన నూతన ప్రజాయుద్ధదశయొక్క ప్రాముఖ్యత ఇది.

ఇప్పుడు సోవియట్ యూనియన్ యుద్ధంలోకి వచ్చింది. "ప్రపంచ నాగరి కతను నాశనంచేసి ప్రపంచాధిపత్యాన్ని సంపాదించి, ప్రపంచప్రజలను పీడించాలని చూస్తున్న ఫాసిస్టు సామ్రాజ్యవాదాన్ని నాశనంచేయుటయే మా యుద్ధాశయాలు"

అని సోవియట్ ప్రభుత్వం చెప్తుంటే నమ్మనివాడెవడు? 25 సంవత్సరాల సామ్రాజ్య వ్యతిరేక చరిత్రగల సోవియట్ యూనియన్ యొక్క యుద్ధాశయాలు పీడిత ప్రజాసామాన్యాన్నంతనూ ఉత్తేజపరుస్తున్నాయి. దానికితోడు ప్రపంచప్రజలందరి యుద్ధాశయాలే సోవియట్ యూనియన్ యుద్ధాశయం. అందువల్ల 1941 జూన్ 22 నుంచి ప్రపంచ ప్రజలందరూ కలసి స్వాతంత్ర్యంకొరకూ ఒకే యుద్ధాశయంతో పోరాడే నూతన చారిత్రకదశ ప్రారంభమయింది. 40 సంవత్సరాల రాజకీయపరిణామంలో వివిధదేశాల స్వాతంత్ర్య పోరాటాలన్నీ చివరికి మిళితమైపోయి ప్రపంచ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజలందరూ కలిసి పోరాడే మహాదవకాశం ప్రారంభమయింది.

ఈ అవకాశం ఎలా లభించింది? ఫాసిస్టులనుంచి తమ దేశాలను తమ పెట్టుబడిదారీ ప్రభుత్వాలు రక్షించలేవని ప్రజలు గుర్తించారు. ఫ్రెంచి ప్రభుత్వ ద్రోహం, పోలెండు మొదలైన దేశాల అనుభవంవల్ల ఈ విషయాన్ని ప్రజలు పూర్తిగా గుర్తించారు. ఒకసమయంలో దేశప్రజల క్షేమంకంటె, తమ వర్గ క్షేమాన్నే అభిలషించి పెట్టుబడిదారీవర్గాలు ద్రోహం చేయుటవల్ల ఫాసిస్టు బానిసత్వం గతి అవుతుందని ప్రజలు గ్రహించారు. మరొకవైపున ప్రజల సహకారం లేకుండా ఫాసిస్టులను నాశనంచేయుట అసంభవమనిగూడా తేలింది. ఈ విషయం బర్మా, మలయా; చైనా, రష్యా ఉదాహరణలవల్ల మరింత స్పష్టపడింది తరువాత. అందువల్ల ఫాసిస్టులను నాశనంచేయాలంటే, ప్రజాయుద్ధంతప్ప మరొకటి నాశనం చేయలేదు. ప్రజల స్వాతంత్ర్య యుద్ధంగా ఈయుద్ధాన్ని నడిపినప్పుడే ఫాసిస్టులను గెలుచుట సాధ్యపడుతుందని తేలింది. అనగా ఫాసిస్టులను ఓడించి దేశరక్షణకు ముందుకుపోతున్న ప్రజాశక్తులకు ఆయాదేశపు ప్రభుత్వాలు (ప్రజాశక్తుల విజృంభణను సహించలేక) అడ్డంకులుకల్పిస్తే, ఆ అడ్డంకులను తోసివేసుకుంటూపోతేనే ఫాసిస్టుల ఓటమి, దేశరక్షణ స్వాతంత్ర్యాలు సాధ్యపడతాయి. లేకపోతే ఫాసిజమే గతిఅయ్యే విషమపరిస్థితులు ఏర్పడినాయి.

ఈవిధంగా ప్రపంచ ప్రజలందరి విముక్తికి దారితీసే అవకాశం ఏర్పడుట వల్ల యుద్ధస్వభావంలో మార్పువచ్చిందని అన్నిదేశాలప్రజలు గ్రహించారు. యుద్ధంలో పాల్గొంటున్నారు. సామ్రాజ్యవాదానికి ఆఖరు ఈరోజులు సమీపించినాయి. సోవియట్ వ్యతిరేక యుద్ధంకొరకు 25 సంవత్సరాలు కుట్రలుచేస్తే 1939 లో సామ్రాజ్యవాద యుద్ధం బయలుదేరింది. ఇప్పుడు సామ్రాజ్యవాద యుద్ధంలోనుంచి ప్రజాశక్తిముందు సామ్రాజ్యవాదులను లొంగదీసే ప్రజాయుద్ధం బయలుదేరింది. సామ్రాజ్యవాదుల ప్లానులన్నీ ఈవిధంగా భగ్నమయినాయి. ఈ ప్రజాయుద్ధదశలో సామ్రాజ్యవాదుల పతనం అతివేగంగా జరుగుతోంది.

ఫాసిస్టులను ఓడించి. వీరైతే తమపెత్తనాన్ని రక్షించుకోవాలని సామ్రాజ్యవాదులు పన్నే కుట్రలన్నీ ఎప్పటికప్పుడు ఎలా భగ్నమవుతున్నవో, సోవియట్ విజయాలు సామ్రాజ్యవాద వినాశనానికి ఎలా దారితీస్తున్నవో, వాటి ఫలితంగా సామ్రాజ్యవాదం బలపడుటగాక ఎలా శిథిలమయిపోతోందో ఇక చూద్దాం.

* * * *

సోవియట్ యూనియన్ మీద యుద్ధం ప్రారంభమయినప్పటి నుంచి నాజీ సైన్యాలన్నీ ప్రధానంగా సోవియట్ – జర్మన్ యుద్ధరంగంలో కేంద్రీకరించబడ్డాయి. బ్రిటన్ మీద విమానదాడుల తీవ్రతగూడా తగ్గింది. బ్రిటిష్, అమెరికన్ ఫాసిస్టు అనుకూలురు కొత్తప్లానులు వేయటం ప్రారంభించారు. ఇప్పుడు వారి యుద్ధవైఖరి ఏమిటి? జర్మనీ, సోవియట్ యూనియన్ హోరాహోరీ యుద్ధం చేసుకొని బలహీనపడతాయి. అప్పుడు తమ ఆధిక్యత నిలుస్తుందని వారి ఆశయం. ఫాసిస్టు ప్రమాదం నెత్తిమీదేఉంది. ఫాసిజాన్ని వీలైనంత త్వరలో ఓడించి, యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించాలని యుద్ధంవల్ల పీడించబడే ప్రజాసామాన్యం, వారిలోగూడా ముఖ్యంగా హిట్లర్ వశమయిన యూరపియన్ ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయినప్పటికి సామ్రాజ్యవాదులలో నిస్తబ్దత కన్పించింది. యుద్ధం త్వరగా ముగించుటకై రెండవరంగం తెరవటానికి ఉత్సాహం చూపించలేదు. ఇండియాకు జాతీయ ప్రభుత్వాన్ని ఇచ్చి ఫాసిస్టు వ్యతిరేకపోరాటంలోకి 40 కోట్ల భారతీయుల బ్రహ్మాండశక్తినిగూడా ఆహ్వానించుటకు బదులు, ఫాసిస్టులకు సహాయపడునట్లుగా జాతీయ ఉద్యమాన్ని నాశనంచేయ సంకల్పించారు. యుద్ధానంతరగతిని గురించి ఆలోచించటం ప్రారంభించారు. యుద్ధానంతరం బ్రిటిష్ ప్రజలకు లాభదాయకమని వారు చెప్పే ఇన్సూరెన్సు స్కీమును (బెవరిడ్జ్‌ప్లాను) తయారుచేసి, యుద్ధానంతరం బ్రిటన్‌లో నిరుద్యోగంవల్లగాని, వైద్యసహాయంలేకగాని, ముసలితనంలో ఆర్థికబాధలవల్లగాని, ఎవరూ బాధపడని స్కీమ్ అదిఅని ప్రచారం ప్రారంభించారు. ఇంకా ఫాసిజం నశించలేదు. సోవియట్ యూనియన్ ఒంటరిగా హిట్లర్‌సైన్యాలను 1500 మైళ్ళ పొడవైన యుద్ధరంగంలో ఎదుర్కొని పోరాడుతుంటే, వారు యుద్ధానంతరప్లానులపై ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నించారు. హిట్లర్ నాశనమైనతరువాత యూరపియన్ దేశాలలో ఎటువంటి ప్రభుత్వాలను నెలకొల్పాలో లండన్‌లో ఆలోచనలు బయలుదేరినాయి. ప్రజలకు ద్రోహంచేసి హిట్లర్‌కు వప్పజెప్పిన విద్రోహక ప్రభుత్వాలను, ఫ్రాన్సును హిట్లర్‌కు వప్పజెప్పిన 'విషీ' ప్రభుత్వ ప్రతినిధులను, బలపరచటం ప్రారంభించారు. సోవియట్ వ్యతిరేకవైఖరిగూడా కొంతవరకు తలఎత్తింది.

యుద్ధానంతరం వారిగతి ఏమికానున్నదని సామ్రాజ్యవాదులకు గల ఆందోళనయే ఈకుట్రలన్నిటికి దారితీసింది. ఈ కుట్రలన్నీ ఎలా భగ్నమవుతున్నాయో చూద్దాం.

సామ్రాజ్యవాదులందరూ కలిసి సోవియట్‌యూనియన్‌కు వ్యతిరేకంగా చేసిన కుట్రల ఫలితంగా కల్గిన ప్రమాదాన్ని అనుభవంలో చవిచూచిన ప్రజలు ఎప్పటికప్పుడూ సామ్రాజ్యవాదులను ఒకకంటితో కనిపెట్టుతూ, వారి క్రొత్త ప్లానులను భగ్నంచేయుటకు ప్రారంభించారు.

సోవియట్ యూనియన్‌కు సహాయంచేస్తామని ప్రకటిస్తే చాలదు. సోవియట్ యూనియన్ హిట్లర్ పిశాచ సైన్యాలతో ఒంటరిగా పోట్లాడుతోంది. సోవియట్ యూనియన్‌కు సహాయాన్ని ఎక్కువచెయ్యాలి - అనే ఆందోళన ప్రారంభమయింది. సోవియట్ వ్యతిరేకులైన సామ్రాజ్యవాదులకు ఈ ఆందోళన అయిష్టకరమైనదే. అయినప్పటికి ముందుకు నెట్టబడి, రెండు ఆంగ్లో సోవియట్ ఒడంబడికలు చేసుకున్నారు. మొదటి ఒడంబడిక 1941 జూలై 12 వ తేదీన జరిగింది. హిట్లర్‌ను ఓడించుటకై పరస్పర సహాయంచేసుకొనుటకు, హిట్లర్‌తో ఏఒకరూ వేరుగాతాత్కాలికశాంతిని చేసుకొనకుండుటకై యీ ఒడంబడికలో అంగీకరించబడింది. ఇది ఒక గొప్ప ప్రజా విజయంగా ఎంచ బడింది. కారణం ? ఇంత కాలం ప్రజాభిప్రాయాన్ని లెక్కజేయకుండా, సోవియట్ వ్యతిరేకదృష్టితో ఫాసిస్టులను బలపరిచిన సామ్రాజ్యవాదులచేత ప్రజలసహకారం, సోవియట్ సహకారం తీసుకుంటూ ఫాసిస్టుల నాశనానికి పోట్లాడుతామని ఒప్పించుట ప్రజావిజయం కాదూ ? మిత్రమండలిలోని ఫాసిస్టు అనుకూలురను తొలగిస్తూ, ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో రోజురోజుకూ పైచెయ్యి సంపాదిస్తున్న ప్రజాపక్షానికి 2 వ ఆంగ్లో - సోవియట్ ఒడంబడిక (1942 మే 26) మరొక గొప్ప విజయం. ఈ ఒడంబడిక ఉపోద్ఘాతంలో ఈవిధంగా ఒడంబడిక ఆశయాలను తెలియబరిచారు : "1941 జూలై 12 వ తేదీన బ్రిటిష్, సోవియట్ ప్రభుత్వాలు చేసుకున్న ఒడంబడికలలోని సూత్రాలను ధృఢపరుస్తూ, యుద్ధానంతర శాంతికి తిరిగి దురాక్రమణలు జరుగకుండా చూచుటకు పరస్పరంగానూ, మిత్రమండలికి చెందిన అన్నిదేశాల సహకారంతోనూ 1941 ఆగస్టు 14 వ తేదీన ప్రకటించబడిన అట్లాంటిక్ సూత్రాల నాధారంచేసుకొని ప్రపంచ పునర్నిర్మాణానికి, శాంతి స్థాపనలకు, పూనుకుంటాం." 2 వ ఒడంబడిక మొదటి ఒడంబడికకంటె ఒక అడుగు ముందుకు వెళ్ళింది. యుద్ధానంతరం, సోవియట్ వ్యతిరేక కూటములను బలపరచమని 7 వ షరతులోనూ, యూరపియన్ దేశాల అంతరంగిక వ్యవహారాల్లో ఎవరూ జోక్యం కల్గించుకొనమని 6 వ షరతులవల్ల స్పష్టపరుచబడింది. అనగా ఈ ఒడంబడిక

వల్ల ఫాసిస్టు వ్యతిరేక ప్రజలపక్షం మరింత బడిపడింది. క్రమేణా సోవియట్ యూనియన్‌కు సహాయం ఎక్కువగా చేయవలసివచ్చింది.

ఇక రెండవరంగం విషయం చూద్దాం. "ఒంటరిగా పోరాడుతున్నాం. రెండవ రంగాన్ని పశ్చిమ యూరప్‌లో ప్రారంభిస్తే హిట్లర్ సైన్యాలను త్వరగా నాశనం చేయవచ్చును" అని సోవియట్ ప్రభుత్వం తెలుపుతూనే వచ్చింది. "రెండవరంగం ప్రారంభిస్తే 1942 చివరికే ఫాసిస్టులను తప్పక నాశనం చేయగలం" అని స్టాలిన్ చెప్పినప్పుడు, సామ్రాజ్యవాదుల చెవికి పట్టలేదు. వెనుకనుంచి ప్రజావత్తిడిగూడా అవసరమైంది. రెండవరంగం కొరకు అన్నిదేశాల ప్రజలు, అన్ని పత్రికలు బ్రహ్మాండమైన ఆందోళన ప్రారంభించారు. బ్రిటిష్ కార్మికవర్గం రెండోరంగం కావాలని ప్రదర్శనాలు చేసింది. సామ్రాజ్యవాదులు ఎలాగైనాసరే యుద్ధానంతర పెత్తనాన్ని నిలబెట్టుకోవాలని వేసేప్లానులలో రెండవరంగాన్ని ఆలస్యం చేయుటగూడా ఒకటి. రెండవరంగాన్ని ప్రారంభించి హిట్లర్‌ను త్వరగా నాశనం చేస్తే (సోవియట్ యూనియన్ పూర్తిగా బలహీనపడకముందే ! - ఈ యుద్ధంవల్ల సోవియట్ యూనియన్, ప్రజాశక్తులు రోజురోజుకూ బలపడుతున్నవని సామ్రాజ్యవాదుల బుర్రలకు తట్టదు) యూరప్‌లో సామ్రాజ్య వ్యతిరేక ప్రజాప్రభుత్వాలు ఏర్పడునేమోనని వారి భయం !! 1943 లో రెండవరంగం ప్రారంభిస్తామన్నారు. తరువాత ఉత్తర ఆఫ్రికాలో జర్మన్ సైన్యాలకు వ్యతిరేకంగా వారు సాగించిన తాబేలు వ్యూహమే రెండవరంగమన్నారు. 43 మేలో ఉత్తర ఆఫ్రికానుంచి జర్మనులు ఖాళీచేసిన తరువాత ఇటలీలో వారు నెమ్మదిగా లాగుతున్న ఒంటెద్దుబండియే రెండవరంగ మనుకోమన్నారు. చివరికి చర్చిల్ పార్లమెంటులో మాట్లాడుతూ జర్మనీమీద వారు సాగించే విమాన విమానదాడులే రెండవరంగమనిఅనుకోమన్నాడు. విమానదాడులుతప్పమరేమీ సాధ్యంకాదన్నాడు. ఎంత ఆలస్యంచేస్తే మాత్రం సామ్రాజ్యవాదుల అంతిమప్లానులను ఎవరు అర్థం చేసుకోలేరు ? "హిట్లర్‌ను ఓడించటానికి సోవియట్‌సైన్యాలు సరిపోతాయి" అని వారి ఊహ. హిట్లర్‌ను ఓడించటానికేకాదు, సామ్రాజ్యవాదుల కుట్రలను, రెండవరంగాన్ని తెరుచుటకు వారు చేసే ఆలస్యాన్నిగూడా నాశనంచేసి ఫాసిస్టులను త్వరగా ఓడించే అతీతశక్తులుగా తయారైనాయి సోవియట్ విజయాలు. సోవియట్ - జర్మన్ రంగంలో సోవియట్ సైన్యాలు సాధించేవిజయాలు ముస్సోలినీ పతనానికి దారితీసి, హిట్లర్ పతనానికిగూడా దారితీస్తున్న స్థితిలో, రెండవరంగం కొరకు ప్రజావత్తిడి మరీ తీవ్రమయింది. చివరికి 43 నవంబర్‌లో మాస్కోలో సోవియట్ యూనియన్, బ్రిటన్, అమెరికాల విదేశాంగమంత్రుల సంప్రతింపులవల్ల "హిట్లర్ జర్మనీని నాశనంగావించుటకు తూర్పునుంచి, పడమర

నుంచి ఒకేసారి యుద్ధం సాగించుటకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకొనుటకు ఏకగ్రీవంగా అంగీకరించబడింది." మాస్కో విదేశాంగ మంత్రుల సమావేశం తరువాత వెంటనే జరిగిన టెహరాన్ త్రైరాజ్య సమావేశంలో (స్టాలిన్ - చర్చిల్-రూజువెల్టుల సమావేశం) తూర్పు, పడమర, దక్షిణాలనుంచి హిట్లరుకు వ్యతిరేకంగా ప్రారంభంకానున్న రెండవరంగాలను గురించి వివరాలతో నిర్ణయించబడింది. ఎప్పుడు ప్రారంభం అయ్యేది, దానికి అవసరమైన చర్యలను తీసుకోటానికి నిర్ణయాలు జరిగినాయి. సోవియట్ ప్రభుత్వ పత్రిక అయిన "ఇజ్వెస్టియా" సంతృప్తితో "రూజ్‌వెల్ట్, స్టాలిన్, చర్చిల్ ప్రకటనను జాగ్రత్తగా చదివినవారికి యుద్ధ గతి పూర్తిగా నిర్ణయించబడిందని తెలియగలదని" వ్రాసింది. టెహరాన్ సమావేశ నిర్ణయాలు మిత్రమండలిలో చీలికలు కల్పించాలని చూస్తున్న ఫాసిస్టులకు, ఇతర ఫాసిస్టు అనుకూలురకు, పెద్ద చెంపదెబ్బగా తగిలినాయి. ఈవిధంగా రెండవరంగాన్ని 1944 లో ప్రారంభించే పరిస్థితులు ఏర్పడినాయి. రెండవరంగాన్ని ఆలస్యం చేయాలని ఎంత ప్రయత్నించినా సామ్రాజ్యవాదుల ప్లానులన్నీ భగ్నంకాకతప్పలేదు. ఫాసిజాన్ని సాధ్యమైనంత త్వరలో నాశనంచేసి యుద్ధాన్ని అంతంచేయాలని ఆందోళనచేస్తున్న ప్రపంచ ప్రజలు సామ్రాజ్యవాదుల ఆలస్యాన్ని సహించలేకపోయారు. ఒకవైపున ప్రపంచ ప్రజలు, రెండవవైపున సోవియట్ యూనియన్ ఫాసిస్టులకు వ్యతిరేకంగా యుద్ధం సాగిస్తున్నప్పుడు ప్రజాపక్షంలో చిక్కుకున్న సామ్రాజ్యవాదులు ప్రజాపక్ష ఆశయాలకులొంగిపోవలసివస్తోంది.

అయినప్పటికి సామ్రాజ్యవాదులు సోవియట్ వ్యతిరేకవైఖరిని అప్పుడప్పుడూ వెలిబుచ్చుట మానలేదు. యుద్ధానంతర సోవియట్ఆశయాలు తమకు సరిగా అర్థమగుటలేదని, సోవియట్‌సైన్యాలు జర్మనులను సోవియట్ సరిహద్దుల నుంచి వెళ్ళగొట్టిన తరువాతసోవియట్ సరిహద్దులతో ఆగిపోవునా? లేక యూరప్‌లో ప్రవేశించి బెర్లిన్‌వరకూ సాగిపోతవా? యుద్ధానంతర సోవియట్ సరిహద్దులు యుద్ధప్రారంభ సరిహద్దులనుబట్టి నిర్ణయించాలా? లేక 1939 సెప్టెంబరులో జరిగిన పోలెండు విభజనమీద ఆధారపడిన సరిహద్దులా? 1940 ప్రారంభంలో సోవియట్ యూనియన్‌లో బుద్ధిపూర్వకంగా కలిసిపోయిన లిథూనియా, లాట్వియా, ఇస్థోనియాలు సోవియట్ యూనియన్‌లోనే ఉండాలా? మొదలైన అనవసర. అప్రస్తుత సందేహాల నెన్నో లేవదీసి సోవియట్ వ్యతిరేక వైఖరిని వెలిబుచ్చుతారు. సోవియట్ యూనియన్ వీటికి సరియైన సమాధానాలుచెప్తూ సోవియట్ వ్యతిరేకుల విద్రోహక వైఖరినిబట్టి బట్టబయలుచేస్తూవచ్చింది: హిట్లర్‌ను త్వరలో ఓడించుటయే ప్రధాన కర్తవ్యమైనప్పుడు ఈ సోవియట్ వ్యతిరేకులప్రచారం, మిత్రమండలిలో చీలికలు కల్పించాలని చేసేప్రయత్నాలు ఫాసిస్టులకు ఉపయోగపడుననీ, అందువల్ల

ఈవిద్రోహక ప్రచారాన్ని వెంటనే అరికట్టాలని సోవియట్‌ప్రభుత్వ పత్రిక అయిన "యుద్ధం,కార్మికవర్గం" స్పష్టపరిచింది. సోవియట్ సరిహద్దులనుగురించి ఇప్పుడు చర్చచేయాలనడం తెలివితక్కువయని. యునైటెడ్‌స్టేట్స్ సరిహద్దులను గురించి ఇప్పుడు చర్చించుట ఎంతఅసందర్భమో సోవియట్ సరిహద్దులను గురించి చర్చించుటగూడా అంత అసందర్భమని ఆపత్రికయే జవాబిచ్చింది. టెహరాన్ సమావేశానంతరం ఒకకొత్త సోవియట్ వ్యతిరేకప్రచారం ప్రారంభించారు. ప్రపంచాన్నంతా బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్ పంచుకోటానికి చూస్తున్నవని యూరపియన్ దేశాలను బ్రిటన్, సోవియట్ విభజించుకున్నవనీ, కొన్ని పత్రికలు వ్రాసినాయి. సామ్రాజ్యవాద పాతకాపుఅయిన జనరల్‌స్మట్స్ ఈమధ్య ఇచ్చిన ఉపన్యాసాలుగూడా ఈ అపార్థాలకు సహాయపడినాయి. స్మట్స్ తన ఉపన్యాసాల్లో యుద్ధానంతర ప్రపంచపెత్తనమంతా బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్లతో కూడిన త్రైరాజ్య కూటమిచేతుల్లో ఉండాలని, పశ్చిమ యూరపియన్ దేశాలన్నీ బ్రిటన్ పలుకుబడిలో ఉండాలని చెప్పాడు। సామ్రాజ్యవాదులబుర్ర సామ్రాజ్యవాదపంథాలోనే పనిచేస్తుంది। ఈ యుద్ధకాలంలో వస్తున్న బ్రహ్మాండమైనమార్పులుచూస్తూ యుద్ధానంతరం సామ్రాజ్యవాదుల పెత్తనం ఉండాలని సామ్రాజ్యవాదిఅయిన స్మట్స్ అభిలషిస్తాడు పాపం। అతడిఉపన్యాస ఆశయాలు ఏమైనప్పటికి, సోవియట్ యూనియన్ ఈసామ్రాజ్యవాదధావాలను ఎదుర్కొంటూ. 43 నవంబరు 21 వ తేదీన "యుద్ధం, కార్మికవర్గం" "యూరప్ పునర్నిర్మాణనాట" అను సంపాదకీయంలో ఈ విధంగా వ్రాసింది।

"సోవియట్ యూనియన్ ఆశయాలు స్పష్టమే. బానిసత్వంలోకి లాగబడిన దేశాల ప్రజలే వారిదేశ భవిష్యత్తును. పరిపాలనావిధానాన్ని, నిర్ణయించుకునే ఆఖరి హక్కు కల్గిఉండాలి. యూరపియన్ దేశాల భవిష్యత్ రాజకీయ,ఆర్థిక నిర్మాణాన్ని గురించి ముందరే నిర్ణయించాలనుటలో అర్థంలేదు. అందువల్లనే ఆ వ్యర్థప్రయత్నాలను సోవియట్ యూనియన్ చేయుటలేదు. యూరపియన్‌ప్రజలే వారి భవిష్యత్తును స్వయంగా నిర్ణయించుకొనగలదని సోవియట్‌ప్రజలకు బాగా తెలుసును" నవంబరు 18 వ తేదీ ఇజ్వెస్టియా పత్రికగూడా అదేధోరణిలో వ్రాస్తూ, ఏదేశపు భవిష్యత్ రాజ్యాంగమైనా ఆదేశపు ప్రజలే స్వేచ్ఛగానిర్ణయించుకోవాలని ప్రకటించింది. సోవియట్ యుద్ధానంతరఆశయాలు ఇంతస్పష్టంగా వెల్లడిచేయబడుతున్నప్పుడు జెనరల్ స్మట్స్ ప్లానులకు అవకాశం ఏం ఉండగలదు? 1941 నవంబరు 6 వ తేదీన రష్యన్‌విప్లవదినోత్సవసందర్భంలో స్టాలిన్ సందేశంలో ఈవిధంగా చెప్పాడు "ఇతరదేశ ప్రజలను - యూరపియన్ ప్రజలనుగాని లేక ఆసియా ప్రజలనుగాని (ఉదాహరణానికి ఇరాన్ ప్రజలు) బానిసత్వంలోకి లాగుట

గాని, లేక విదేశములను ఆక్రమించుటగాని మా ఆశయంకాదు; కానేరదు. మా సహాయాన్ని కోరుతున్న ప్రజలను బానిసత్వంలోకి లాగుట మా యుద్ధాశయం కాదు. మా సహాయాన్ని అర్థిస్తున్న ప్రజలందరికి ఈస్వాతంత్ర్యయుద్ధంలో సహాయంచేసి, తరువాత వారి వారి దేశాల్లో వారిఇష్టప్రకారం వారిజీవితాన్ని నిర్మించుకొనుటకై స్వేచ్ఛగా వదిలివేయటమే మా ఆశయం. ఇతరదేశవ్యవహారాల్లో ఎటువంటి జోక్యం కలిగించుకోగూడదు ! ! " అని స్టాలిన్ హెచ్చరించాడు.

సోవియట్ ఆశయాలకు, సామ్రాజ్యవాదుల ఆశయాలకు, పోలిక ఎక్కడుంటుంది ? ప్రజావత్తిడివల్ల సామ్రాజ్యవాద ప్రభుత్వాలు సోవియట్ యూనియన్‌తో కలిసి, ప్రపంచ శత్రువైన ఫాసిస్టు నాశనంలో పాల్గొనుట తప్పటంలేదు. ఫాసిస్టులను నాశనంచేయుట ఒకటే ఉమ్మడి ఆశయం.

యుద్ధానంతరం సోవియట్ సోషలిస్టు ప్రభుత్వంయొక్క ప్రాబల్యం హెచ్చుతుందనే భయం సామ్రాజ్యవాదులను కలవరపెట్తోంది. ఒకవైపు నుంచి సోవియట్‌తో కలిసి ఫాసిస్టులకు వ్యతిరేకంగా యుద్ధంసాగిస్తూ, వెనుకనుంచి సోవియట్‌కు వ్యతిరేకంగా విద్రోహకవర్గాలను బలపరచటం ప్రారంభించారు. ఉదాహరణకు పోలెండు వ్యవహారం. సోవియట్‌కు వ్యతిరేకంగా లండన్‌లోని పోలిష్ ప్రభుత్వాన్ని మొదట బలపరచి చివరికి ప్రజాందోళనవల్ల ఎలా మానుకోవలసివచ్చిందో చూడండి :—

## పోలండు సమస్య

1920 లో సోవియట్ ప్రభుత్వం నిరసిస్తున్నప్పటికీ బైలో రష్యన్లను, యుక్రేనియన్లను (రష్యాదేశానికి చెందినవారు) బలాత్కారంగా పోలెండులో పెట్టింది వెర్సైల్సు సంధి. 1939 లో హిట్లర్ పోలెండుమీదికి దాడి ప్రారంభించబోయే సమయంలో సోవియట్ల సహాయాన్ని నిరాకరించి పోలిష్ బూర్జువా ప్రభుత్వం బ్రిటిష్ వాగ్దానాలమీద ఆధారపడి 3 వారాల్లో పోలిష్ ప్రజలను హిట్లర్ పరంచేసి తను భద్రంగా పోలెండులోనుంచి తప్పించుకొని లండన్ చేరింది. పోలిష్ ప్రభుత్వం పడిపోయిన వెంటనే సోవియట్ సైన్యాలు పోలెండులో ప్రవేశించి రష్యాకు చెందిన బైలోరష్యన్లను యుక్రేనియన్లను హిట్లర్ దురాక్రమణ నుంచి రక్షించింది. 'సోవియట్ ప్రభుత్వం వెనుక నుంచి పోలెండుమీద దెబ్బ కొట్టిందని' దీనికి లండన్‌లోని పోలిష్ ప్రభుత్వం ప్రచారంచేసింది. సోవియట్ మీద హిట్లర్‌దాడి ప్రారంభమయిన తరువాత (1941) ఆ పోలిష్ ప్రభుత్వమే సోవియట్‌తో హిట్లర్‌కు వ్యతిరేకంగా సంధి చేసుకుంది. ఆనాటినుంచి సోవియట్ భూమిమీద 96,000 మంది పోలిష్ సైనికులకు శిక్షణఇచ్చి 30 కోట్ల రూబుల్సు

అప్పుఇచ్చి ఆ సైన్యానికి కావలసిన పరికరాల నన్నిటిని సోవియట్ ప్రభుత్వం సమకూర్చింది. కాని పోలిష్ ప్రభుత్వం ఈ పోలిష్ సైన్యాన్ని యుద్ధారంగానికి పంపదు. 1941 గడిచిపోయింది. 1942 జూన్ వచ్చింది కాని ఆ సైన్యాన్ని సోవియట్ - జర్మన్ యుద్ధరంగానికి పంపకుండా. మధ్యప్రాచ్య దేశాలకు పంపటం ప్రారంభించింది పోలిష్ ప్రభుత్వం. 1942 ఆఖరుకు ఈవిధంగా 30 000 మంది పోలిష్ సైనికులను రష్యానుంచి ఖాళీచేశారు; అందువల్ల 1943 జనవరిలో పోలిష్ సైన్యానికి ఇచ్చేసహాయాన్ని సోవియట్ ప్రభుత్వం ఆపుచేసింది. అప్పటికి రష్యాలోని పోలిష్ కుటుంబాలను ఖాళీచేయుటకై 10 కోట్ల రూబుల్సును సోవియట్ ప్రభుత్వం ఇచ్చింది. కృతజ్ఞత అంటే ఎరుగని పోలిష్ బూర్జువా ప్రభుత్వం సోవియట్ యూనియన్‌లో తన ఏజెంట్లద్వారా నిఘా ప్రారంభించింది. సోవియట్‌కు వ్యతిరేకంగా పోలిష్ ఆఫీసర్ల కుట్రలను రెండుసార్లు ప్రత్యక్షంగా పట్టుకుని సోవియట్ ప్రభుత్వం హెచ్చరించింది. ఈ పరిస్థితులలో ఫాసిస్టు అబద్ధాల మంత్రి గోబెల్సు ఒక సోవియట్ వ్యతిరేక ప్రచారాన్ని లేవదీశాడు. సోవియట్ ప్రభుత్వం 10.000 మంది పోలిష్ ఆఫీసర్లను ఖూనీచేసిందని. స్మోలెన్‌స్క్ నగరంవద్ద వారి శవాలు కన్పించినవని గోబెల్సు ప్రచారం; ఈ అబద్ధప్రచారాన్ని పోలిష్ ప్రభుత్వం బలపరచి సోవియట్ వ్యతిరేక ప్రచారం ప్రారంభించింది; ముఖ్య బ్రిటిష్ సామ్రాజ్యవాద పత్రికలు ఈ అబద్ధప్రచారాన్ని బలపరిచినాయి. గోబెల్సు సంతోషానికి మేరలేదు. సోవియట్ యూనియన్ ఈ ఫాసిస్టు అనుకూల ప్రచారాన్ని గట్టిగా ఎదుర్కొని ఆరోపణలను బట్టబయలుచేసి పోలిష్ ప్రభుత్వాన్ని ఖండించింది. చంపబడిన ఆఫీసర్లు 10.000 కావని. 2,000 అని. తరువాత 5000 అని. చివరికి 12000 అని ప్రచారం జరిగింది. వెంటనే పోలిష్ ప్రభుత్వంతో రాజకీయ సంబంధాలను త్రెంచుకొని ఫాసిస్టులకు సహాయపడుతున్న పోలిష్ ప్రభుత్వాన్ని బలపరుస్తున్న సామ్రాజ్యవాద ప్రభుత్వాలను గట్టిగా మందలించింది. వెంటనే బ్రిటిష్ ప్రజలు ఈ సోవియట్ వ్యతిరేక అబద్ధప్రచారాన్ని అరికట్టి మిత్రమండలి ఐక్యతను కాపాడాలని తీవ్ర ఆందోళన సాగించారు విద్రోహక ప్రచారకులనోళ్ళు మూతపడినాయి. సోవియట్ వ్యతిరేక ప్రచారం ఆగింది. గోబెల్సు ఆశయాలు భగ్నమయినాయి. సోవియట్ యూనియన్ యుద్ధానంతర పోలెండును పోలిష్ - సోవియట్ ఒడంబడికద్వారా గ్యారంటీచేసిన తరువాత ఎందుకు ఈ సోవియట్ వ్యతిరేక ప్రచారం? యుద్ధానంతరం పాతసరిహద్దులతో పోలెండు లండన్‌లో కూర్చున్న ప్రభుత్వాలవశం కాదేమోనని పోలిష్ బూర్జువావర్గభయం; యూరప్‌లో సోవియట్ ప్రాబల్యం ఎక్కడ హెచ్చుతుందోఅని సామ్రాజ్యవాదులభయం; కాని వీరి ప్రచారాలు నెగ్గే రోజులు దాటిపోయినాయి.

# ఫ్రెంచిజాతీయ కమిటీ

మరొక ఉదాహరణ తీసుకుందాం. ఫ్రెంచివ్యవహారం చూద్దాం. మళ్ళీ అదే కథ. 1940 జూన్‌లో ఫ్రాన్సు హిట్లర్ వశమయింది. ఫ్రెంచి బూర్జువావర్గద్రోహం వల్ల ఈ పెద్దదేశం 3 వారాల్లో ఫాసిస్టుల ఆక్రమణక్రిందకిపోయింది. ఈ విషయంలో ఫ్రెంచి బూర్జువావర్గం, ప్రజాసహకారాన్ని తీసుకొని యుద్ధంచేయుటకు బదులు, హిట్లరు ఫాసిజమునే కౌగలించుకొని ఫ్రెంచిప్రజలకు చేసినద్రోహం జగద్విదితమే! ఆక్రమణతరువాత హిట్లర్ అదుపాజ్ఞలలో నడిచే విషీ ప్రభుత్వంతో సామ్రాజ్యవాదులు సంబంధాలు వదులుకొనలేదు. విషీ ప్రభుత్వానికిచెందిన వ్యక్తులను తమ చేతిక్రిందికి తెచ్చుకొని నాటకం ఆడదామనిచూచారు. ఫ్రెంచి ఫాసిస్టుముఠాకుచెందిన డార్లాన్‌ను బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాలు బలపరచినాయి. హిట్లర్ ఆక్రమణ తరువాత ఫ్రెంచిప్రజలందరూ ఐక్యమయి, ఫ్రాన్సుకు బయట తమ స్వతంత్ర ఫ్రెంచికమిటీ ప్రతినిధిగా పరిగణిస్తున్న జెనరల్ డిగాల్‌కు ప్రాధాన్యత ఇవ్వకుండా సామ్రాజ్యవాదులు కుట్రలుపన్నటం ప్రారంభించారు. యుద్ధానంతరం ఫ్రాన్సులో ఒక విద్రోహకవర్గపు ప్రభుత్వాన్ని తమ అదుపాజ్ఞలక్రింద నెలకొల్పాలని సామ్రాజ్యవాదుల ఆశయం! కాని వారి ప్లానులన్నీ భగ్నమవుతున్నాయి. ఫ్రాన్సులో ఈనాడు 200,000 గెరిల్లాలు బయలుదేరి హిట్లర్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని సాగిస్తున్నారు. వీరిలో ఫ్రెంచికమ్యూనిస్టులు అగ్రస్థానాన్ని వహిస్తున్నారు. ఫ్రెంచి పార్లమెంటులో ఒకకమ్యూనిస్టుపార్టీసభ్యుడైన కామ్రేడ్ గ్రినియర్ ఫ్రాన్సునుంచి తప్పించుకొని లండన్ చేరాడు. "బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాలు జెనరల్ జీరోను సమర్థించటం గురించి ఫ్రాన్సులో ఏమనుకుంటున్నారు?" అని అతన్ని ప్రశ్నించగా "మనం మర్యాదగా మాట్లాడుకొనుట బాగుంటుంది. ఫ్రెంచిప్రజల ఫాసిస్టువ్యతిరేక నాయకుడు డిగాల్ కాని జీరోకాదు" అని స్పష్టపరిచాడు. స్వతంత్ర ఫ్రెంచికమిటీ తరఫున డిగాల్‌ను బలపరుస్తూ సామ్రాజ్యవాదుల ప్రచారాన్ని ఖండిస్తూ తీవ్రఆందోళన ప్రారంభమయింది. సోవియట్ యూనియన్ డిగాల్‌ను బలపరచింది. "డిగాల్, జీరో" వ్యవహారంలో ఫాసిస్టు అనుకూలురగు కొందరు సామ్రాజ్యవాదులు లేనిపోని కలతలు పెట్టున్నారు. డిగాల్ ఫ్రెంచి ప్రజల ఫాసిస్టువ్యతిరేక ప్రతినిధి అని సోవియట్ పత్రిక రెడ్ స్టార్ వ్రాసింది సామ్రాజ్యవాదులు కొంత క్రిందికిదిగారు. తర్వాత స్వతంత్ర ఫ్రెంచి కమిటీకి ఇద్దరు అధ్యక్షులను పెట్టారు. మిలటరి వ్యవహారాలను చూచుటకు జీరో, రాజకీయవ్యవహారాలకు డిగాల్ అధ్యక్షులు. జనరల్ జీరో, ఫాసిస్టు అనుకూలురైన విషీ ప్రభుత్వ మిలటరీ సైన్యాధిపకులను బాధ్యతగల స్థానాల్లో (ఉత్తర ఆఫ్రికాలో) పెట్టాడు. వారిని ఆ స్థానాల్లోనుంచి వెళ్ళగొట్టాలని ఆందోళన ప్రారంభ

మయింది. సామ్రాజ్యవాదులకు ఊపిరి ఆడకుండా వ్యతిరేకశక్తులు విజృంభించినాయి. ఫాసిస్టుఅనుకూలురను బలపరుస్తున్న ఎత్తులను పసిగించుకొననివారెవరూ లేరు. తిరిగి స్వతంత్ర ఫ్రెంచికమిటీ నిర్మించబడింది. ఇప్పుడు డిగాల్ ఒక్కడే స్వతంత్ర ఫ్రెంచికమిటీకి అధ్యక్షుడు. ఫ్రాన్సులో మిత్రమండలి సైన్యాలు దిగేవరకూ ఈ కమిటీ ఫ్రాన్సుకు బయట ఉన్న స్వతంత్రఫ్రెంచి వారిని ఫాసిస్టు వ్యతిరేకంగా ఆర్గనైజ్‌చేస్తూ ఉంటుంది. యుద్ధానంతర ఫ్రాన్సువిషయంలో ఈవిధంగా సామ్రాజ్య వాదులఎత్తులు భగ్నమవుతున్నాయి. స్వతంత్రఫ్రెంచి కమిటీని మొదట గుర్తించింది సోవియట్ యూనియన్. మిత్రమండలి మిలటరీ రాజకీయ కమిటీలో స్వతంత్ర ఫ్రెంచికమిటీకి ప్రాతినిధ్యం లభించింది. ఫ్రెంచి ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహించేది స్వతంత్ర ఫ్రెంచికమిటీ అని గుర్తించి సోవియట్ రాయబారినిగూడ పంపింది.

## ఇటలీ సమస్య

సామ్రాజ్యవాదులు ఒక ఎత్తుతరువాత మరొక ఎత్తువేస్తూ వచ్చారు. ఈ ఎత్తులు ఎలా భగ్నమవుతున్నవో నిరూపించుటకు ఇటలీ మరొక ఉదాహరణ. తాబేలు వ్యూహంతో జర్మన్ సైన్యాల్ని 43 మే 5 వ తేదీన ఉత్తర ఆఫ్రికానుంచి వెళ్ళగొట్టారు. తరువాత మధ్యధరాసముద్రంలోని దీవుల ఆక్రమణ ప్రారంభ మయింది. 43 జూలై 5వ తేదీన హిట్లర్ తన ఎండాకాలపు దండయాత్రను ఓరెల్-కుర్స్కు రంగంలో ప్రారంభించాడు. గత 2 ఎండాకాలాల్లో సంపాదించిన విజయాలు ఈ ఎండాకాలంలో అసంభవమయినాయి. సోవియట్ సైన్యాలు ఎండాకాలం లోనే హిట్లర్ సైన్యాలమీద దెబ్బతీసినాయి. హిట్లర్ సైన్యాలు పలాయనం చేయుటకు ప్రారంభించినాయి. ఈ సమయంలో మధ్యధరాసముద్రంలోనుంచి ఇటలీ మీదికి మిత్రమండలి సైన్యాలు ఇటలీ దండయాత్రకు సమీపిస్తూన్నాయి. తన ఎండాకాలపు దాడి జయప్రదమయినట్లయితే హిట్లర్, తన సోదరుడైన ముసోలినీకి కొంత సహాయంచేసి ఉండేవాడేమో! కాని ఇప్పుడు ఇద్దరూ చిక్కుల్లోపడ్డారు. గత్యంతరంలేక, ఇటాలియన్ ప్రజల ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమఫలితంగా ముసోలినీ జూలై 24 వ తేదీన కూలద్రోయబడ్డాడు. జర్మన్ - సోవియట్ రంగంలో ప్రారంభమయిన సోవియట్ విజయ పరంపరలు ఈవిధంగా ముసోలినీ పతనానికిగూడా దారితీస్తే, బ్రిటిష్ అమెరికన్ సైన్యాలు ముసోలినీ పతనంతో ఇటలీలో బయలుదేరిన ఫాసిస్టు వ్యతిరేక తిరుగుబాట్లను సహాయం చేసుకుంటూ ఇటలీలో దిగలేదు సామ్రాజ్యవాదులకు మళ్ళీ మామూలు ప్రశ్నలయాలైంది. ఇటలీలో ఎలాంటి ప్రభుత్వాన్ని నెలకొల్పాలి? ఇటాలియన్ ప్రజల స్వాతంత్ర్య తిరుగుబాట్లను గుర్తిస్తే వచ్చే ఫలితాలు తమకు ప్రమాదకరమగునేమో! ఈవిధంగా

రెండు వారాలకుపైగా ఇటలీని లొంగిపొమ్మని ప్రచారంచేస్తూ బడోగ్లియో (అబిసీనియాలో ఇటాలియన్ సైన్యాలను నడిపిన ఫాసిస్టు సైన్యాధిపతి) ప్రభుత్వంతో రాయబారాలు సాగిస్తూ కాలయాపన చేశారు. ఈలోపల దక్షిణ ఇటలీలో ఉన్న జర్మన్ సైన్యాలను భద్రంగా హిట్లర్ ఉత్తర ఇటలీకి చేర్చుకుని మిత్రమండలి సైన్యాలు అంత వరకూ వచ్చినప్పుడు ఎదుర్కొనుటకు అవసరమైన రక్షణలన్నీ ఏర్పాటు చేసుకున్నాడు! ఈవిధంగా మిత్రమండలి మిలటరీదారులను ఇటాలియన్ ప్రజల రాజకీయ తిరుగుబాట్లను సమన్వయం చేయకుండా సామ్రాజ్యవాదులు హిట్లర్‌కు ఇచ్చిన వ్యవధిని సోవియట్ - జర్మన్ రంగంలో రెడ్ఆర్మీ సాధిస్తున్న మహత్తర విజయాలతో పోల్చిచూస్తే అందరికి తలనొప్పివేసింది. సామ్రాజ్యవాదుల విద్రోహవైఖరిని అన్నివైపులనుంచీ అందరూ ఖండించసాగారు. సామ్రాజ్యవాదుల కుట్రలు బట్టబయలు చేయబడినాయి. ఇటలీదండయాత్ర ప్రారంభమయింది. బ్రిటిష్, అమెరికన్ సైన్యాలతో బండిని నెమ్మదిగా లాగటం ప్రారంభించారు. ఈయుద్ధ వ్యూహాన్ని "యుద్ధం, కార్మికవర్గం" తీవ్రంగా విమర్శించి బండిని త్వరగా లాగాలని హెచ్చరించింది.

ఇక ఇటలీ రాజ్యాంగ వ్యవహారం చూస్తే, బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన "మిత్రమండలి మిలటరీ ప్రభుత్వ" విధానంక్రింద ఇటలీలో ఫాసిస్టుల నుంచి విముక్తిచెందిన ప్రాంతాన్ని పాలించటం ప్రారంభమయింది. ఈ విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తూ "యుద్ధం, కార్మికవర్గం" ఈవిధానంలో ఎక్కడా ప్రజాస్వామ్య సూత్రాలు కనపడవని చెప్తూ ఇలా వ్రాసింది:

"ఈనూతన మిత్రమండలి మిలిటరీ ప్రభుత్వంయొక్క కేంద్ర సివిలియన్ అధికారి మేజర్ జనరల్ రెన్నెల్. ఈయన అనేక అంతర్జాతీయ బ్యాంకులతో సంబంధగలవ్యక్తి. అంతర్జాతీయబ్యాంకింగ్‌సంస్థ అయిన మార్గన్ గ్రెన్‌ఫెల్ కంపెనీకి ఒక డైరెక్టర్‌గూడా. ఇక నూతన విధానంక్రింద మిలటరీ వ్యవహారకర్త కాప్టెన్ బెన్సన్. ఈయనగూడా రాబర్ట్ బెన్సన్, మాంటేగూబిట్లర్స్, మార్క్స్, స్పెన్సర్స్, మొదలైన బ్యాంకింగ్ సంస్థలతో సంబధంఉంది. ఇక శత్రువుల ఆస్థిని స్వాధీనం చేసుకొనుటకు నియమించిన కలనల్ హారీస్ అనేక అమెరికా కంపెనీలకు డైరక్టర్‌గా ఉన్నాడు. ఇలాంటి పెద్దమనుష్యులతో ఫాసిజాన్ని నాశనంచేసి విముక్తిచేస్తున్న దేశాల్లో నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాలను నెలకొల్పుతారంటే పిచ్చివాళ్ళుతప్ప మరెవ్వరూనమ్మరు." ఎంతస్పష్టంగా విమర్శించింది సోవియట్ పత్రిక! సిసలీలో ఏర్పడ్డ మిత్రమండలి మిలటరీప్రభుత్వాన్ని గురించి అనేక పత్రికలలో వెలువడిన ఆధారాలను చూపుతూ "యుద్ధం, కార్మికవర్గం" ఇంకా ఇలా అడుగుతోంది. "ఈ మిలటరీ ప్రభుత్వాలు తాత్కాలికంగానా? చాలా కాలం

వరకా? గ్రీసు, యుగోస్లోవియా, ఫ్రాన్సులపై దండయాత్రచేసిన తరువాతగూడా ఇలాగే ఏర్పరుచుతారా?" ఫాసిజాన్ని నాశనంచేయుటలో రాజకీయ ప్రాముఖ్యతను గుర్తించకపోవుటయే ఇలాంటి ప్రభుత్వాలను నిర్మించుటకుకారణమని ఈ పత్రిక హెచ్చరించింది. ఇకముందైనా "విముక్తిచెందిన దేశాల్లోని ఆర్థిక, రాజకీయ పునర్నిర్మాణాన్ని ఆదేశపు ప్రజలకు వదలిపెట్టాల"ని గూడా హెచ్చరించింది.

ఈవిధంగా సోవియట్ యూనియన్ బహిరంగంగా సామ్రాజ్యవాదుల ఎత్తులను బట్టబయలుచేస్తుంటే, అన్నిదేశాల ప్రజలు సోవియట్‌యూనియన్‌తో పాటు సామ్రాజ్యవాదుల వైఖరిని ఖండిస్తూ వత్తిడి ఎక్కువచేయసాగారు. దాని ఫలితంగా గడచిన 43 నవంబర్‌లో మాస్కోలో జరిగిన త్రైరాజ్యసమావేశంలో— ఇటలీలో ఫాసిజాన్ని పూర్తిగా నాశనం గావించుటకు, ఇటాలియన్ ప్రజలు కోరు కున్న ప్రకారం వారికిష్టంవచ్చిన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరుచుకొనుటకై అవకాశాలు కల్గించుటకు — తీర్మానించబడింది.

ఇటాలియన్ ప్రజలందరూ ఫాసిసు వ్యతిరేకంగా ఐక్యమయి రోజురోజుకు ముందుకు సాగిపోతున్నారు. వారి రాజకీయచైతన్యాన్ని గుర్తించి మిలిటరీ కార్య కలాపంతో ప్రజల రాజకీయ తిరుగుబాట్లనుగూడ సమన్వయించిన యెడల మిత్ర మండలి 5వ సైన్యం, 8వ సైన్యం ఇటలీలో ఇంత నెమ్మదిగా పురోగమనం చేయుటకు తావుఉండదు. సామ్రాజ్యవాదులు ఇటాలియన్ ప్రజల రాజకీయ తిరుగు బాట్లను గుర్తించుటకు అయిష్టత చూపించినా మాస్కో సమావేశ తీర్మానాలవల్ల గట్టిపడిన ఇటాలియన్ ప్రజల ఐక్యత, ఇటాలియన్ సలహాసంఘం (ఇటాలియన్ ప్రజలను బలపరుచుటకు ఒక సోవియట్ ప్రతినిధిగూడా ఇందులోఉన్నాడు) చేత ఈక్రింది సూచనలను చేయించగల్గింది: ఉత్తర సరిహద్దులవరకూ ఆక్రమించ బడిన ప్రాంతాలన్నీ ఇటాలియన్ల పరిపాలనక్రిందికి మార్చుట, రోమ్‌నగరాన్ని ఆక్రమించిన తరువాత బదోగ్లియో ప్రభుత్వానికి ఈమార్పుకు సంబంధం ఉండ కూడదు. రాజకీయ వాక్స్వాతంత్ర్యం, రాజకీయ సిద్ధాంతాలు, సభాస్వాతంత్ర్యం, ఫాసిస్టు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలను ఏర్పరుచుకునేహక్కు — అన్నీ పూర్తిగా పునరుద్ధరించాలని జనరల్ ఐసెన్‌హోవర్ ఇటాలియన్ మిత్రమండలి ప్రభుత్వాన్ని వెంటనే ఆజ్ఞాపించాలి. ఇతర దేశప్రజల సహకారంతో ఈవిధంగా ఇటాలియన్ ప్రజలు ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో పాల్గొంటూ సామ్రాజ్యవాదుల ఎత్తులను భగ్నం కావిస్తున్నారు.

ఈవిధంగా సోవియట్ విజయాలు హిట్లర్ పతనానికి దారితీయుటయేగాక, ముస్సోలినీ నాశనానికి, ఇటాలియన్ ప్రజల స్వాతంత్ర్య తిరుగుబాటుకు కారణ మయినాయి. ఫ్రెంచి గెరిల్లా సైన్యాలు ఇటాలియన్ గెరిల్లా సైన్యాలు కలిసి

కార్సికాద్వీపం మీదుగా జర్మనులను ఎదుర్కొగల్గినాయి. యుద్ధం ముందుకు సాగిపోతున్నకొలదీ.ఒక దేశపు ప్రజలు తరువాత ఇంకొక దేశపు ప్రజలు స్వాతంత్ర్యం పొందుటచేతనే, ఈయుద్ధాన్ని స్వాతంత్ర్య యుద్ధమంటున్నాం. స్వాతంత్ర్యం పొందుతున్న దేశాల్లో బ్రిటిష్, అమెరికా ప్రభుత్వాలు మిత్రమండలి మిలిటరీ ప్రభుత్వం అనుపేరుతో తమ పెత్తనంక్రింద "తాత్కాలిక" ప్రభుత్వాలను ఏర్పరిచే ఎత్తులు ధ్వంసమవుతున్నాయి. అయితే ఫాసిస్టులనుంచి విముక్తి పొందుతున్న దేశాలను గురించి సోవియట్ దృక్పథం ఏమిటి? సోవియట్ పత్రిక 'రెడ్‌స్టార్' ఈవిధంగా సమాధానం ఇస్తోంది:

ఈవిషయంలో సోవియట్ సూత్రాలు రెండు: (1) ఫాసిస్టు దానిసత్వం నుండి విముక్తిపొందిన దేశప్రజలశక్తిఅంతా హిట్లర్ వ్యతిరేక పోరాటంలో హిట్లర్‌ను వీలైనంత త్వరగా ఓడించుటకు ఉపయోగపడాలి. (2) విముక్తిచెందిన దేశములలో పునర్నిర్మాణమంతా ఆదేశపుప్రజలదే. వారు నిర్మించుకున్న రాజ్యాంగాన్ని గుర్తించితీరాలి. ఈవిధంగా విముక్తిచెందే వివిధప్రజల ఆశయాలే సోవియట్ ఆశయాలని 'రెడ్‌స్టార్' ప్రకటిస్తోంది.

సోవియట్ విజయ పరంపరలు ముందుకు సాగిపోతున్నకొలదీ, హిట్లర్ ఆక్రమించిన దేశాల ప్రజలను స్వాతంత్ర్య పోరాటాలకు మేల్కొల్పి, మిత్రమండలి ప్రజాకూటమిని మరింత ఎక్కువగా ఐక్యపరచుటయేగాక, సామ్రాజ్యవాద యుద్ధానంతర ప్లానులనుగూడా భగ్నంచేయుటకు సాయపడుతున్నాయి. ఇప్పుడు సోవియట్ యూనియన్ ప్రపంచ ప్రజలందరి స్వాతంత్ర్యపోరాట నాయకత్వం వహిస్తూ సామ్రాజ్యవాదుల నెత్తిమీదుగా ప్రపంచ ప్రజలను మార్గంచూపుతూంది. సోవియట్ విజయాలవల్ల కల్గుతున్న ఫలితాలను మరికొన్నింటిని చూద్దాం.

## బాల్కాను రాజ్యాలు

బాల్కానురాజ్యాలను తీసుకుందాం. సోవియట్ సైన్యాలు పోలిష్‌సరిహద్దులు చేరేసమయం సమీపించినకొలదీ, బాల్కన్‌రాజ్యాల ప్రజాస్వాతంత్ర్య పోరాటాలు మిన్నుముట్టుతున్నాయి. గ్రీస్ చూడండి. గ్రీస్ దేశాన్ని ఆక్రమించిన జర్మన్ సైన్యాలతో గ్రీకు, ఇటాలియన్ గెరిల్లా సైన్యాలు తీవ్రమయిన పోరాటాలు సాగిస్తున్నాయి. గ్రీసు హిట్లర్‌నుంచి విముక్తి అయే రోజులుదగ్గరకువచ్చినవని, విముక్తి చెందగానే గ్రీసులో గృహప్రవేశం చేద్దామనే ఉద్దేశ్యంతో 1941 లో లండన్‌కుచేరిన జార్జి ప్రభుత్వం ఈజిప్టుకు చేరుకుని కెయిరోపట్టణంలో ఉంటోంది. గ్రీసు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటున్న గెరిల్లాలు కెయిరోకువెళ్ళి, గ్రీకుప్రభుత్వంలోకి గ్రీకు పోరాట ప్రతినిధులను ముగ్గురిని తీసుకోమని కోరారు. గ్రీకురాజు నిరాదరించాడు.

ప్రతినిధులు తిరిగి గ్రీసుకు వచ్చేశారు. కెయిరోలోఉన్న జార్జిరాజుకు కబురు వెళ్ళింది. గ్రీకు ప్రజలందరూ అంగీకరిస్తేనే జార్జి గ్రీసులో అడుగుపెట్టవచ్చునని, అంతవరకూ గ్రీసుకు రానక్కరలేదని, హెచ్చరిక పంపించారు। రాచరికాలకు అంతిమదెబ్బ కొట్టున్నది గనుకనే ఈ యుద్ధాన్ని ప్రపంచప్రజల స్వాతంత్ర్య యుద్ధం అంటున్నాం.

అంతకంటె ఉత్తేజకరమైనచరిత్రను నిర్మిస్తున్నారు యుగోస్లావియా ప్రజలు. హిట్లర్ యుగోస్లావియాను 1941 ఏప్రియల్ 5 వ తేదీన ఆక్రమించాడు. కాని ప్రజలు హిట్లర్‌కు లొంగలేదు. అనాడే శక్తివంతులైన వారందరూ కొండప్రాంతాల్లోచేరి గెరిల్లాసైన్యాన్ని ఏర్పాటుచేసి, వెనుకనుంచి హిట్లర్‌సైన్యాలను దెబ్బకొట్టుటకు ప్రారంభించాడు. కాని యుగోస్లావియారాజు పీటర్ కొంతమంది మంత్రులతో పలాయనమై లండను చేరుకున్నాడు. లండన్‌లో ఏర్పాటైన యుగోస్లావియా ప్రభుత్వంఅంటే వీరే। వీరు లండన్‌కు వెళ్ళేటప్పుడు, యుద్ధశాఖా మంత్రి అయిన మిహిలోవిచ్ యుగోస్లావియాలోనే ఉండిపోయాడు. గెరిల్లా సైన్యాలన్నీ జెనరల్‌టిటో నాయకత్వంక్రింద ఐక్యమయి నాజీసైన్యాలను ఎదుర్కొంటున్నకొలదీ టిటో సైన్యానికి ప్రజాసైన్యరూపం వచ్చింది. టిటో సైన్యం 1942 ఏప్రియల్ నాటికి 2 లక్షలకు పెరిగింది. ఈ 2 లక్షలసైన్యాన్ని దేశంలోని అన్నిజాతులు (స్లోవనీస్, క్రోట్స్, సర్బియన్లు, ముస్లిములు) బలపరచాయి. టిటో సైన్యం యుగోస్లావియాను ఆక్రమించిన జర్మన్, ఇటేలియన్ సైన్యాలను నాశనంచేయ ప్రారంభించింది. 1942 ప్రారంభంలోనే యుగోస్లావియాలో మూడవ వంతు భూభాగాన్ని శత్రువులచేతులనుంచి స్వాధీనంచేసుకున్నారు. ఉత్తరంనుంచి దక్షిణం వరకూ అన్ని రాష్ట్రాలలో టిటో సైన్యాలు యుద్ధంసాగించినాయి. నేను ఆడ్రియాటిక్ సముద్రతీరమంతా గెరిల్లా సైన్యాల వశమయింది. జర్మనులను ఓడించి వారి యుద్ధసామగ్రులను స్వాధీనంచేసుకుని తిరిగి జర్మనులను ఎదుర్కొన్నారు. యుగోస్లావియా ప్రజలు ఈ విధంగా ప్రపంచానికి ఆశ్చర్యం కల్గించే స్వాతంత్ర్య పోరాటాన్ని సాగిస్తున్న సమయంలో లండన్‌లోని యుగోస్లావియా ప్రభుత్వానికి, యుగోస్లావియాలో అధికసంఖ్యాకులుగాఉన్న సర్బియన్ భూస్వాములకు, పెట్టుబడిదార్లకు, యీ గెరిల్లాయుద్ధం చివరికి వారి పలుకుబడికిగూడా దెబ్బతీస్తుందేమోనని భయంకల్గింది. యుగోస్లావియాలోని విద్రోహకవర్గాలన్నీ హిట్లర్‌తో కలిసిపోయి గెరిల్లాలను ఎదుర్కొనుట ప్రారంభించారు. ఈ విద్రోహచర్యలకు నాయకుడు మిహిలోవిచ్। 1942 జూన్ 16 వ తేదీన "స్వతంత్ర యుగోస్లావియా రేడియో" (టిటో గెరిల్లా సైనికదళానికి చెందినది) మిహిలోవిచ్ ద్రోహిఅని, అతడు ఫాసిస్టు వ్యతిరేకంగా పోరాడుతున్న గెరిల్లా సైన్యాన్నే ఎదుర్కొంటున్నాడని ప్రకటించింది.

అంతవరకూ బ్రిటిష్, అమెరికన్ రేడియోలు మిహిలోవిచ్‌ను పొగుడుతూ, జర్మనులకు వ్యతిరేకంగా పోరాడేసైన్యాలకు మిహిలోవిచ్ నాయకుడని ప్రచారం చేసినాయి. కాని మిహిలోవిచ్ ద్రోహిఅని గెరిల్లా రేడియోప్రకటించిన తరువాతగూడా ఈ విద్రోహకప్రచారాన్ని బ్రిటిష్, అమెరికన్‌రేడియోలు మానలేదు. ఫాసిస్టుబంటుగా వర్తిస్తున్న మిహిలోవిచ్‌ను లండన్‌లోని పీటర్ ప్రభుత్వం బలపరిచింది. టిటో ప్రజాసైన్యాన్ని గుర్తించలేదు; టిటో సైన్యమంతా కమ్యూనిస్టుదళమనే పేరుతో మిహిలోవిచ్, జర్మన్ రేడియోలు ప్రచారంచేయుటకు ప్రారంభించినాయి. ప్రారంభంలో మహిలోవిచ్‌నిగూడా కలుపుకొనుటకు టిటో సైన్యాలు ఎన్నిసూచనలుచేసి ఎంత ప్రయత్నించినా మహిలోవిచ్ ఆసూచనలను నిరాకరించాడు. ఈ ద్రోహిని సామ్రాజ్యవాద ప్రభుత్వాలు బలపరిచినాయి: టిటో సైన్యాలు రక్తం ధారపోసి జర్మనులకు వ్యతిరేకంగా సాధించిన విజయాలన్నీ మిహిలోవిచ్ సాధించాడని ప్రచారం చేసినాయి: కాని వీరిఆటలు ఎంతోకాలం సాగలేదు. టిటో రోజురోజుకు సాధిస్తున్న మహత్తర విజయాలను గుర్తించి టిటోదళాలే నిజమైన స్వాతంత్ర్య పోరాటాన్ని సాగిస్తున్నవని గుర్తించిన ప్రజాభిప్రాయం సామ్రాజ్యవాదుల ఆటలను అరికట్టింది. యుగోస్లావియా పక్షాలన్నీ టిటోను బలపరుస్తూ, విద్రోహకప్రచారాన్ని "స్వతంత్ర యుగోస్లావియా రేడియో" ద్వారా ఎదుర్కొనుట ప్రారంభించారు.

1942 నవంబరు 26, 27 వ తేదీలలో యుగోస్లావియాలోని అన్ని ప్రాంతాల నుంచి 53 గురు ప్రతినిధులు సమావేశమయి యుగోస్లావియా "ప్రజాపరిషత్తు"ను ఏర్పాటుచేశారు. మిహిలోవిచ్ ద్రోహం రోజురోజుకూ బట్టబయలయింది. చివరికి యుగోస్లావియా మతగురువులుగూడా మిహిలోవిచ్ 'ఫాసిస్టు ఏజెంటు' 'ద్రోహి' అని ఖండించారు. సామ్రాజ్యవాదుల ప్లానులు భగ్నమయినాయి భవిష్యత్తులో తమ పెత్తనాన్ని కాపాడుకోవాలని ప్రయత్నించిన విద్రోహక వర్గాలకుట్ర భగ్నమయింది యుగోస్లావియా ప్రజలు టిటో నాయకత్వంక్రింద ఐక్యమయి స్వతంత్ర పోరాటాన్ని సాగిస్తున్నారు. సోవియట్, బ్రిటన్, అమెరికాలతో గూడిన మిత్రమండలి నాయకత్వాన సాగుతున్న ప్రపంచ ప్రజాస్వాతంత్ర్య పోరాటానికి యుగోస్లావ్ ప్రజల సహకారాన్ని తెలుపుతూ "ప్రజాపరిషత్తు" ఒక ప్రకటన చేసింది.

అప్పటినుంచి యుగోస్లావ్ గెరిల్లా దళాల పరపతి హెచ్చింది. ఇతరదేశ ప్రజల సానుభూతి వచ్చింది. ఇప్పుడు ఊరుకుంటే అసలుకే ముప్పువచ్చేట్లు ఉండుటవల్ల మిత్రరాజ్యాలద్వారా యుగోస్లావియాలో ఐక్యత కుదుర్చుటకు పీటర్ రాజు తహతహలాడాడు. కాని లాభంలేకపోయింది. ఇంతలో ఇటలీ లొంగిపోయింది యుగోస్లావియాలోని ఇటలీ సైనికులు వేలకువేలుగావచ్చి గెరిల్లాలతో చేరారు. యుగోస్లావియాలో నాజీలను ఎదిరిస్తున్న వారందరికీ పీటర్ ప్రభుత్వం

సహాయం చేయవలసివచ్చింది. కాని మిహిలోవిచ్‌ను ఇంకా ద్రోహికింద గుర్తించ లేదు. పీటర్ ప్రభుత్వం! మిత్రమండలి సహాయం టిటో గెరిల్లా దళాలకు చేయ తున్నప్పటినుంచి గెరిల్లాదళాలు మరింత విజృంభించినాయి. చివరికి బ్రిటన్ టిటో దగ్గరకు ఒక మిలటరీ ప్రతినిధినిగూడా పంపవలసివచ్చింది! మిహిలోవిచ్ కంటె జర్మనులతో ఎక్కువ తీవ్రంగా పోరాడుతున్నందువల్ల టిటో గెరిల్లా సైనికదళానికి బ్రిటిష్ ప్రభుత్వం మిహిలోవిచ్‌కిచ్చే సహాయంకంటె ఎక్కువ సహాయంచేస్తాం దని పార్లమెంటులో ఈడెన్ అంగీకరించాడు. కడకు చర్చిలుకూడ మిహిలోవిచ్ ద్రోహి అని, టిటో నాయకత్వాన్ని గొప్పగా పొగడుతూ పార్లమెంటులో ప్రకటించాడు.

ద్రోహికి, దేశభక్తునికిగల భేదాన్ని గుర్తించకుండా ఇద్దరికీ సహాయంచేసే అసహజపద్ధతివల్ల సమస్యాపరిష్కారం కానేరదు. ఈ పరిస్థితిని అంతమొందించు టకై యుగోస్లావియాలో అన్ని ప్రాంతాలనుంచి 140 మంది ప్రజాపక్ష ప్రతి నిధులు సమావేశమై తాత్కాలిక యుగోస్లావియా పార్లమెంటును ఎన్నుకున్నారు. తాత్కాలిక ప్రభుత్వహోదాతోకూడిన ఒక జాతీయ కమిటీని గూడా ఏర్పరిచారు. ఈకమిటీవద్దకువెళ్ళి పరిస్థితులను స్వయంగా తెలుసుకొనుటకై సోవియట్ ప్రభుత్వం ఒక మిలిటరీ ప్రతినిధి కమిటీని పంపింది.

యుగోస్లావియా ప్రజల నందరిని ఐక్యపరచి దేశవిముక్తికై పోరాడుతున్న టిటో తాత్కాలిక ప్రభుత్వాన్ని గుర్తించకుండా కెయిరోకి చేరుకున్న పీటర్ ప్రభుత్వం, దేశవిభేదాలకు దారితీసే మిహిలోవిచ్‌తో సంబంధాలను మానలేదు. దేశంలోని బూర్జువా, భూస్వామివర్గాలు గెరిల్లా పోరాటానికి ఇష్టపడకపోవుటయే దీనికి ప్రధానకారణం. దేశ స్వాతంత్ర్యం, ప్రజల స్వాతంత్ర్యాలకంటె ఈ విద్రోహక వర్గాలు హిట్లర్ స్నేహాన్నే కోరుకుంటున్నాయి! అటువంటి విద్రోహకవర్గాల ఏజెంటు అయిన మిహిలోవిచ్‌తో సంబంధాలు త్రెంచుకొనుటకు నిరాకరిస్తున్న పీటర్ ప్రభుత్వ పరిస్థితి మరీ క్లిష్టస్థితికి రాకతప్పడంలేదు. 1943 డిసెంబరు 22 వ తేదీన యుగోస్లావ్ జాతీయసంఘం సమావేశమై పీటర్ ప్రభుత్వ హక్కులనన్నిటిని రద్దుచేసింది. శత్రువులనుంచి దేశం విముక్తి అయిన తరు వాత రాజుమాట, రాజరికంమాట ఆలోచించవచ్చునని, అంతవరకూ పీటర్ యుగోస్లావియాకు రాగూడదని నిర్ణయించింది. దేశవిభేదాలు కల్పించే రాజు దేశంలో అడుగుపెడ్తే స్వాతంత్ర్య పోరాటంలో చీలికలుపెట్టుటయే అవుతుంది దేశంలో అంతరంగిక విభేదాలు ఏర్పడటానికి ప్రయత్నించాడని, జర్మనులతోనూ, వారి కీలుబొమ్మ అనుచరులతోనూ సమాధానపడ్డాడని మిహిలోవిచ్‌ను జాతీయ సంఘం ఖండించింది. పీటర్ రాజు ప్రభుత్వం గెరిల్లా స్వాతంత్ర్యదళంపట్ల విరోధ

వైఖరి వహించియున్నదని మార్షల్‌టిటో స్వాతంత్ర్యసైన్యాన్ని గురించి అబద్ధ ప్రచారం చేసిందని, జాతీయ కమిటీ పీటర్ ప్రభుత్వాన్ని ఖండించింది. పీటర్ ప్రభుత్వం అంతర్జాతీయంగా చేసుకున్న ఒడంబడికలు, వాటికి సంబంధం కల్గిన బాధ్యతలూ—అన్నీ రద్దయినట్లుగూడా ప్రకటించబడింది.

స్వాతంత్ర్య పోరాటానికి అడ్డుపడుతున్న సామ్రాజ్యవాద రాజరికపు ఎత్తులన్నీ ఒకటి తరువాత మరొకటి భగ్నమయి యుగోస్లావ్ ప్రజలకు నానాటికి పైచెయ్యి వచ్చుటకు కారణం ఏమిటి? యుగోస్లావియాప్రజల ఐక్య ఫాసిస్టు వ్యతిరేక పోరాటమేగాని మరొకటికాదు. ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొని దేశాన్ని రక్షించుటకు పూనుకున్న జాతీయైక్యత, దారిలో అడ్డుకునే విద్రోహక కుట్రలన్నింటిని త్రోసివేయగలదని యుగోస్లావియా చరిత్ర బోధిస్తోంది. యుగోస్లావియా గెరిల్లాదళ నాయకుడు, ప్రభుత్వ అధ్యక్షుడు అయిన జెనరల్ టిటో ఈనాడు మిత్రమండలి సైన్యాధిపతి అయ్యాడు. ఫాసిస్టు వినాశనముకై పోరాడుతున్న ఇతరదేశ ప్రజలందరూ యుగోస్లావియా ప్రజాయుద్ధాన్ని హర్షిస్తూ, టిటో ప్రభుత్వాన్ని అభినందిస్తూ సహకారం చేస్తున్నారు. ఈవిధంగా సమీకరించబడుతున్న ప్రపంచప్రజల వత్తిడిముందు సామ్రాజ్యవాదపు ఎత్తులు, రాజరికపు కుట్రలు పటాపంచలవుతున్నాయి.

సోవియట్ విజయాలు బాల్కన్ ప్రజలనందరిని స్వాతంత్ర్య పోరాటంలో ఎలా ఉత్తేజపరుస్తున్నదీ తెలుసుకొనుటకు గ్రీస్, యుగోస్లావియాలలో జరుగుతున్న చరిత్రలను తెలుసుకున్నాం. ఇక రుమేనియాలోగూడా సంచలనం బయలుదేరింది. సోవియట్ సరిహద్దులలోనే ఉంది రుమేనియా. హిట్లర్ ఆక్రమణ క్రిందికి వచ్చిన తరువాత హిట్లర్ ఏజెంటుగామారిన అంటోనెస్కు ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు ప్రజాఉద్యమం తలఎత్తుతోంది. ఇక్కడగూడా కమ్యూనిస్టులు ప్రధానపాత్ర వహించి, ఫాసిస్టు వ్యతిరేకశక్తుల నన్నిటిని ఐక్యంచేసి, మిత్రమండలి రాజ్యాలతో సంధిచేసుకునే ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరుచుటకు ప్రయత్నిస్తున్నారు. బల్గేరియాలో హిట్లర్ మిలిటరీ ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. అయినప్పటికి ప్రక్కనే సోవియట్, యుగోస్లావియా ప్రజలు సాధిస్తున్న విజయాలు బల్గేరియా ప్రజలను ఉత్తేజపరుస్తూంటే హిట్లర్ వ్యతిరేక తిరుగుబాట్లు తలఎత్తుతున్నాయి. బల్గేరియా ఫాసిస్టుల ఆక్రమణక్రిందికి వచ్చినతరువాత హిట్లర్ తన ఏజెంటయిన ఫిలోఫ్ నిరంకుశ మిలిటరీ ప్రభుత్వాన్ని స్థాపించాడు. బల్గేరియా రాజైన బోరిస్ చంపబడ్డాడు. బల్గేరియాలో త్వరలోనే హిట్లర్ పరిపాలనకు వ్యతిరేకించే రహస్య ఉద్యమం బయలుదేరింది. "క్రిస్టోబోటెఫ్" అను రహస్య రేడియో బల్గేరియా ప్రజల రహస్య ఉద్యమాన్నిగురించి ప్రపంచానికి వార్తలు

తెలియబరచటం ప్రారంభించింది. హిట్లర్‌ను వ్యతిరేకించే జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించి, బోరిస్ రాజు చనిపోయిన తరువాత అతని కొడుకు రాజు కాకుండా చూచుటకు, ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరించుటకు, యుగోస్లావియా, గ్రీసులనుండి బల్గేరియా సైన్యాలను తిరిగి పిలిపించుటకు, ప్రయత్నాలు జరుగుతున్నవని ఈ రేడియో ప్రకటిస్తోంది.

## హంగేరీలోగూడా ఇదే పరిస్థితి

బాల్టిక్ దేశాల సంగతి చెప్పనక్కరలేదు. సోవియట్ యూనియన్‌లో భాగాలుగా చేరిపోయిన లిథూనియా, లాట్వియా, ఇస్తోనియా దేశప్రజలు సోవియట్ సైన్యాలకొరకు ఎదురుచూస్తున్నారు. సోవియట్ యుద్ధవ్యూహంముందు నాజీ సైన్యాలు తుత్తునియలవుతూంటే పీడిత యూరప్ ప్రజానీకమంతా వెనుకనుంచి హిట్లర్ సైన్యాలను నాశనం చేయుటకు తయారవుతున్నారు.

చిన్నదేశాలైనా నార్వే, డెన్మార్కులు స్వాతంత్ర్య పోరాటంలో అగ్రస్థానాన్ని వహిస్తున్నాయి. హిట్లర్ ఆక్రమణ రోజులనుంచి నార్వే ప్రజలు నాజీ సైన్యాల నాశనానికి దారితీసే విధ్వంసకార్యాలు, సమ్మెలు సాగిస్తూనేవచ్చారు. మిత్రమండలి విమానదళాలు జర్మనీమీద, ఆక్రమిత ప్రాంతాలమీద, వరుసగా బాంబులు కురిపిస్తూంటే, రెండోవైపున సోవియట్-జర్మన్ రంగంలో జర్మన్ సైన్యాలు దెబ్బతింటూంటే, హిట్లర్ పతనానికి తాము చేయగల్గిన సాయమును చేయుటకు ముందుకుదూకారు డెన్మార్కు ప్రజలు. గత సెప్టెంబరులో ('43) డెన్మార్కుప్రజలు జయప్రదంగా సాగించిన ఫాసిస్టు వ్యతిరేక విధ్వంసకకార్యాలు ప్రపంచానికి ఆశ్చర్యం కల్గించినాయి. విధ్వంసకార్యాలను చేసే దేశభక్తులకు మరణదండన విధించమని హిట్లర్ డెన్మార్కుప్రభుత్వాన్ని కోరినప్పుడు డెన్మార్కు ప్రభుత్వం నిరాకరించింది. వెంటనే డెన్మార్కు రాజు, రాణీల నిద్దరిని జర్మన్ ప్రభుత్వం అరెస్టుచేసింది. మార్షల్‌లా పెట్టింది. అసంఖ్యాకంగా అరెస్టులు చేసింది. ఈ నిరంకుశ విధానాన్ని సహించలేని డేనిష్‌ప్రజలు తిరుగుబాట్లుచేశారు. బహిరంగంగా వీధులలో జర్మనులకు, డేనిష్ ప్రజలకు హోరాహోరీ యుద్ధాలు జరిగినాయి. డేనిష్ ఉదంతాలన్నీ స్వీడన్ ప్రజలను కదిలించినాయి. "డేనిష్ ప్రజల కొరకు మా హృదయాలన్నీ తహతహలాడుతున్నాయి" అని స్వీడన్ ప్రధానమంత్రి చెప్పాడు.

ఇక జర్మనీ విషయంచూస్తే, బయటనుంచి హిట్లర్ పతనానికి దారితీస్తున్న రెడ్ ఆర్మీ విజృంభించినకొలదీ, బ్రిటిష్, అమెరికన్ విమానదాడులు హెచ్చిన కొలదీ, జర్మన్ ప్రజలయొక్క, సైన్యాలయొక్క మనోనిబ్బరం తగ్గుతున్నట్లు

హిట్లర్, గోబెల్స్ ఉపన్యాసాలే తెలియజేస్తున్నాయి. మిత్రమండలి అన్ని వైపుల నుంచీ ఆవరిస్తూ, ముస్సోలినీ నాశనమయి, పసిఫిక్ సముద్రంలో జపాన్ దెబ్బ కాచుకునేస్థితికి వచ్చిన తరువాత జర్మనులు జయిస్తారని ఏ జర్మను దేశస్థుడు ఊహించగలడు? అయితే, జర్మనీ యుద్ధానంతర గతిఏమిటి? సోవియట్-జర్మన్ రంగంలో జర్మను సైన్యాలను లక్షలతో ఎదుర్కొని నాశనంచేస్తున్న సోవియట్ ప్రభుత్వం ఈ విషయంలో చొరవతీసుకొని "జర్మన్ స్వతంత్ర కమిటీని" ఏర్పరిచింది.

1943 జూలై 12, 13 తేదీలలో మాస్కోలో ఒక జర్మన్ స్వతంత్ర కమిటీ ఏర్పడింది. సోవియట్ యూనియన్‌లో లక్షలకొలదీ ఉన్న జర్మన్ ఖైదీల తరపున ప్రతినిధులు, ఇతర జర్మన్ రచయితలు, కార్మికసంఘ నాయకులు, ప్రముఖ ఫాసిస్టు వ్యతిరేక జర్మన్ నాయకులు, జర్మన్ పార్లమెంటు సభ్యులు సమావేశమై ఒక జర్మన్ స్వాతంత్ర్య కమిటీని ఏర్పాటుచేశారు. జర్మన్ యుద్ధ రంగాల పరిస్థితి, జర్మనీలోని ప్రజాసామాన్యం యొక్క దుస్థితి, ఫాసిస్టు విధానం వల్ల జర్మనీకేగాక ప్రపంచానికంతకూ కలిగిన ప్రమాదం అన్నీ చర్చించిన తరువాత, సమావేశంలో పాల్గొన్న 34 గురు నాయకులు కలిసి ఒక 'మానిఫెస్టో' (ప్రణాళిక)ను తయారుచేశారు. జర్మనీలో కమ్యూనిస్టుపార్టీ నాయకులు నేడు హిట్లర్ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. హిట్లర్ విధానంవల్ల ఇంత కాలంనుంచి పీడించబడిన జర్మన్ ప్రజలందరూ శాంతికావాలని కోరుతున్నారు. అందువల్ల పతనాన్ని సమీపిస్తున్న హిట్లర్‌ను వెంటనే కూలదోసి ప్రజాస్వామ్య జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించుటకై జర్మన్ ప్రజాసామాన్యమంతా ముందుకురావాలని జర్మన్ ప్రజలనందరిని ఈ స్వతంత్ర జర్మన్ కమిటీ ప్రణాళిక హెచ్చరిస్తోంది. ఈ విముక్తి కమిటీ తరపున ఒక ప్రత్యేక పత్రిక, రేడియోలను గూడా స్థాపించి జర్మన్ ప్రజలలో తీవ్రమైన ఫాసిస్టు వ్యతిరేక ప్రచారాన్ని సాగిస్తోంది. మనోనిబ్బరం అంతా కృంగిపోయి పతనం తప్పదని గ్రహించిన జర్మన్ సైన్యాన్ని, సైన్యాధిపతులను సంబోధిస్తూ, హిట్లర్‌ను కూలదోసి వీలైనంత త్వరలో యుద్ధాన్ని అంతంచేసి 'స్వతంత్ర జర్మనీ'ని రక్షించమనిగూడా ప్రచారం చేస్తోంది యీ కమిటీ. హిట్లర్ పీడలో నుంచి ఉదయిస్తున్న ఈ స్వేచ్ఛా స్వతంత్ర జర్మన్ ఉద్యమానికి సామ్రాజ్యవాదులలో కొందరు అయిష్టత చూపిస్తున్నారు. జర్మన్ స్వతంత్రకమిటీ ఒక అవమానకరమైన విషయమని కొందరు సామ్రాజ్యవాదులు అభిప్రాయపడ్డారు. హిట్లర్‌క్రింద 10 సంవత్సరాలు ఫాసిజాన్ని బలపరిచిన వారికి "స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఏమిటని"? ఈ స్వతంత్ర జర్మన్ కమిటీ ప్రణాళికను సర్ వాన్సిటార్ట్ మొదలైనవారు అపహాస్యంచేశారు. దానికి స్వతంత్ర జర్మన్ కమిటీ ఈవిధంగా సమాధానమిస్తోంది.

"నాజీవిధానాన్ని బలపరచిన నాయకులందరు హిట్లరును కూలద్రోసి నప్పటికి వారికి స్వేచ్ఛలభిస్తుందనేమాట కల్ల. కాని హిట్లర్ ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ బయలుదేరుతున్న స్వతంత్ర శిశువునుగూడా హిట్లర్‌తోపాటు బయట పారేస్తారా? పరిస్థితులన్నీ గ్రహించి ప్రజాసామాన్యం కోరుతున్న శాంతిని, జర్మన్‌ప్రజలలో వస్తున్న బ్రహ్మాండమైన మార్పులను త్రోసివేయకూడదు" అని ఈ స్వాతంత్ర్య జర్మన్‌కమిటీ విమర్శిస్తున్న సామ్రాజ్యవాదులకు సమాధానమిస్తోంది. లోకమంతా గర్హిస్తున్నా బ్రిటిష్ ఫాసిస్టునాయకుడైన మోస్లేను విడుదలచేసిన సామ్రాజ్య వాదులు హిట్లర్‌ను కూలద్రోసి ఫాసిస్టువ్యతిరేకజర్మన్ ప్రజలను తరతరాల వరకూ నాశనం గావించాలంటారు. సామ్రాజ్యవాదంయొక్క ఆశయాలు అనేకం ఉండవచ్చును. కాని ఆ ఆశయాలు నెరవేరేకాలం దాటిపోయిందని ప్రస్తుతం జరుగుతున్న విషయాలనుబట్టి తెలుసుకొన్నాం. స్వతంత్ర జర్మనీకి అంకురాలు పడినాయి.

ఈ విధంగా ఆక్రమిత యూరప్‌అంతా ప్రజాస్వాతంత్ర్య ఉద్యమాలతో రేగిపోతూ, సామ్రాజ్యవాదుల ప్రపంచపెత్తనపు ఎత్తులన్నిటిని భగ్నంకావిస్తోంది. హిట్లర్‌కు అనుకూలమైన ఎండాకాలపుదాడినే నాశనంచేసి, రష్యాలో హిట్లర్ ఏర్పరుచుకున్న ఆఖరి కీలకస్థానాలనుంచి నాజీ సైన్యాలను వెనక్కు తరుముతున్న రెడ్‌ఆర్మీ విజయాలు ఈ యూరపియన్ స్వాతంత్ర్య ఉద్యమాలను మరింత తీవ్ర తరం చేస్తున్నాయి. రెండవ రంగాన్ని ప్రారంభించి యుద్ధాన్ని అంతం చేయుటకు సామ్రాజ్యవాదులు ఎంత నిరోధించినప్పటికీ, వారి ప్లానులన్నిటినీ భస్మం కావి స్తున్నవి ఈ సోవియట్‌విజయాలూ, యూరపియన్‌ప్రజల తిరుగుబాట్లేనని గుర్తిం చాలి. బాధ్యతగల అమెరికన్ ప్రభుత్వాధికారి అయిన హారీహాప్కిన్సు గత అక్టో బర్ నెలలో కొంతస్పష్టంగా మాట్లాడాడు. "సోవియట్ సహాయం లేనప్పటికీ, మనం (అమెరికా, బ్రిటన్లు) యుద్ధాన్ని గెలిచేస్థితికోకి వచ్చాం. రష్యా లేనప్పటికీ యుద్ధాన్ని గెలవగలం. అయితే కొంత ఆలస్యం కావచ్చు. 1945 లో నైనా హిట్లరును ఓడించగలం" అన్నాడు. సోవియట్‌విజయాల ప్రాముఖ్యతను గుర్తించ లేక, రెండోరంగం ప్రారంభించాలని, యుద్ధాన్ని త్వరగా అంతం చేయాలని, ఆదుర్దాలేనిసామ్రాజ్యవాదవైఖరి హాప్కిన్సుప్రకటనలో కనపడుతుంది. హాప్కిన్సు ప్రకటనను సోవియట్ పత్రిక "యుద్ధం : కార్మికవర్గం" తీవ్రంగా విమర్శించింది. ఏమైనప్పటికీ సామ్రాజ్యవాద ప్రభుత్వాలనుబలవత్తరంగా ముందుకునెడుతున్నాయి సోవియట్‌ప్రజావిజయాలు. 1944 ప్రారంభంలో రెండవరంగాన్ని ప్రారంభించుటకు అవసరమైనచర్యలు ప్రారంభమయినాయి.

యూరోపియన్ రాజకీయాలు, యుద్ధగతి.ఎలాపరిణమిస్తున్నదీ పరిశీలించిన తరువాత సామ్రాజ్యవాదులపెత్తనం ఎలా క్షీణిస్తున్నదో, ఇంత ప్రమాదాలకు దారి తీసిన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాశక్తులు ఎలా విజృంభిస్తున్నవో చూశాం. ప్రజాశక్తి. ప్రజలుఅంటే నమ్మకంలేకుండా ఊహా ప్రపంచంలో "సామ్రాజ్యవాదం అకుంఠితమైనది. అది జాతీయప్రభుత్వం ఇవ్వటంలేదు. అని అనుకోవచ్చును గాని, యదార్ధపరిస్థితులలో సామ్రాజ్యవాదుల యుద్ధానంతరపు పెత్తనం కొరకు వేసే ప్లానులు. సోవియట్ ప్రాబల్యం హెచ్చుకుండా పన్నేకుట్రలు అన్నీ ఎలా భగ్నమవుతున్నదీ మనం కళ్ళారచూస్తున్నాం. ప్రజలందరూ విద్రోహ శక్తులన్నిటినీ త్రోసివేసుకుంటూ తమ చారిత్రిక విధులను నెరవేడుస్తూ, ప్రపంచ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటున్నారు.— అయితే ఇండియా విషయంలో సామ్రాజ్యవాదుల యుద్ధానంతర ప్లానులు ఎలా భగ్నం చేయబడుతున్నదీ చూద్దాం.

# సోవియట్లు స్వాతంత్ర్య మార్గాన్ని చూపుతున్నాయి!

"రష్యన్లు గెలిచితీరాలి, గెలుస్తారుకూడా, భవిష్యత్తును నిర్మించగల్గిన వారు వారే"

— రవీంద్రనాథ్ టాగూర్.

"ప్రాచీన గ్రీక్ పౌరాణిక చరిత్రలో ఒక కథఉంది. గ్రీకుల పౌరాణిక గాథల ప్రకారం 'పోసిడాన్' సముద్రదేవుడు. భూదేవిపేరు 'గే'. వారిద్దరిపుత్రుడు 'అంటియస్'. తన్ను మోసి, కని, పెంచినతల్లిమీద 'అంటియస్'కు ఎక్కువప్రేమ. అంటియస్‌ను ఓడించగలవీరులెవ్వరూ లేకపోయారు. అతడు అజేయుడని అందరూ అనుకునేవారు. అతనికి ఇంతబలం ఎక్కడనుంచివచ్చిందో తెలుసా? ఇతరులతో పోరాటంచేస్తున్న సమయంలో భూమిని తాకినప్పుడల్లా తనతల్లిఅయిన భూదేవి అతనికి నూతనబలం ప్రసాదిస్తూ ఉండేది. ఈ పరిస్థితులలోగూడా అంటియస్‌కు ఒక బలహీనత ఉన్నదనే చెప్పాలి. భూమినుంచి అతన్ని వేరుచేయగల్గితే, అంటియస్‌ను సులభంగా ఓడించవచ్చు. చివరికి ఈ బలహీనతను ఉపయోగించుకొనగల్గిన శత్రువు ఒకడు బయలుదేరాడు. అతడే హెర్క్యులిస్. హెర్క్యులిస్ అంటియస్‌ను ఎలాఓడించాడు? భూమినుంచి వేరుచేసి, గాలిలోకిఎత్తి, భూమిని తాకకుండాచేసి అంటియస్‌పీక నొక్కేశాడు.

బోల్షివిక్కులు గ్రీక్‌వీరుడైన అంటియస్‌ను జ్ఞప్తికి తెస్తారు. తమను మోసి, పెంచి, శిక్షణఇచ్చిన తల్లియైన ప్రజలతో సంబంధం ఉన్నంతవరకు బోల్షివిక్కులు అంటియస్‌వలె అజేయులై ఉంటారు. ప్రజలసంబంధం ఉన్నంకాలం వారిని ఓడించుటకు ఎవరికీ శక్యంకాదు. అజేయమైన బోల్షివిక్ నాయకత్వంయొక్క రహస్యం ఇదే"

— స్టాలిన్.

సోవియట్‌యూనియన్ బయలుదేరి 26 సంవత్సరాలు గడిచాయి. మానవ చరిత్రలో 26 సంవత్సరాలంటే బహుస్వల్పకాలం. అయినప్పటికి ఈకొద్దికాలంలోనే సోవియట్ సోషలిస్టు రాజ్యంలోవచ్చిన మార్పులు ప్రపంచానికి ఆశ్చర్యము

కలుగజేశాయి. 1917 నుంచి 1929 వరకూ ఇతర దేశములచే సోవియట్ రష్యా గుర్తించబడుటయే కష్టమయింది. 1929 నుంచి 1941 వచ్చేసరికి ఇతర దేశములన్నిటితోపాటు సమానత్వాన్ని సంపాదించింది. 41 జూన్ తరువాత ప్రపంచ ప్రజలందరూ హర్షించే పోరాటాలుసాగిస్తూ, ప్రపంచ ప్రజలందరూ అంతిమ విముక్తికై చేస్తున్న ఫాసిస్టు వ్యతిరేక స్వాతంత్రపోరాటానికి నాయకత్వం వహిస్తోంది. 26 సంవత్సరాల సోషలిజంవల్ల సాధించిన అసమాన అఖండ ఐక్య తతో పోరాడుతున్న సోవియట్ ప్రజలకు ప్రపంచ ప్రజలు, రాజకీయవేత్తలు, అర్థశాస్త్రజ్ఞులు, రచయితలు, కవులు, నటకులు, వైద్యశాస్త్రవేత్తలు, ప్రపంచ మేధావులందరూ జోహారు లర్పిస్తున్నారంటే ఆశ్చర్యమేముంది! సోవియట్ సమా జంలో ఒక నూతన సోషలిస్టు సమాజం నిర్మించబడింది. ఆనూతన సోషలిస్టు సమాజం తన్నుతాను సామ్రాజ్యవాదుల కుటిల ప్రయత్నాలనుంచి జయప్రదంగా రక్షించుకొనుటయేగాక, శ్రీమతి సరోజినినాయుడు చెప్పినట్లు, ప్రపంచ నాగరికతా స్వాతంత్ర్యాలను ఫాసిస్టు సామ్రాజ్యవాదులనుంచి రక్షిస్తూ, పీడిత ప్రజాపోరాటా లను ఉత్తేజపరుస్తోంది. అందువల్ల ఇతరదేశ ప్రజలకు సోవియట్లు విముక్తి మార్గాన్ని చూపుతున్నాయి అని చెప్పటలో అతిశయోక్తి ఏముంది ?

సోవియట్ యూనియన్ మీద ఫాసిస్టులు దాడిచేసిన నాడే ఫాసిస్టు ప్రమాదం ప్రపంచానికంతకూ వ్యాపించింది. జపాన్ తూర్పుప్రాంతాన పసిఫిక్ సముద్రంలో దాడిచేసి బర్మాను ఆక్రమించిననాడు ఇండియామీదికే వచ్చింది ఫాసిస్టు ప్రమా దం. ఫాసిస్టు దురాక్రమణ ప్రమాదంలేని దేశమేదున్నది ఈనాడు ? అందువల్లనే ఈపోరాటం ప్రపంచ ఫాసిస్టుప్రమాదానికి వ్యతిరేకంగా సాగించే ప్రపంచ ప్రజల పోరాటం. సామ్రాజ్యవాదుల ముఠాలోగల వైరుధ్యాలు పెరిగిపోయి, సోవియట్ రాజ్యానికి వ్యతిరేకంగా ఐక్యంకాలేక ఒకముఠావచ్చి ప్రజాపక్షంలో వచ్చిచేరింది. ఈనాడు స్వాతంత్ర్యంకొరకు ఫాసిస్టులను నాశనంచేయుటకై తమ సర్వశక్తులను సమీకరించుకొని జీవిసత్వమా లేక విముక్తియా అనే చావుబ్రతు కుల పోరాటం చేస్తున్నసమయంలో ప్రజాపక్షంలోచేరిన సామ్రాజ్యవాదులు (బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలు) ప్రజాశక్తులను అరికట్టాలంటే సాధ్యపడుట లేదని తెలుసుకున్నాం. సోవియట్ప్రజాశక్తిముందు 26 సంవత్సరాలు పరాజయం పొందిన సామ్రాజ్యవాదులు ఈనాడు నిద్రమేల్కొని ప్రపంచ ఐక్యతను నిర్మించు కుంటూ పోరాడుతున్న ప్రజాశక్తులముందు పరాజయం పొందక తప్పుటలేదు.

అయితే ఈ పరిస్థితి ప్రపంచరాజకీయాల్లో ఎలా సాధ్యపడింది? 49 సంవ త్సరాల రాజకీయ పరిణామంలో సామ్రాజ్యవాదుల ముఠాలో పాతవారిని ప్రపంచ మంతటా ఎదిరించి ప్రపంచాధిపత్యంకొరకు దెబ్బకొట్టే ఫాసిస్టులు బయలుదేరి నందువల్ల, సామ్రాజ్యవాదుల పక్షంలో ప్రళయం ప్రారంభమయిన సమయంలో

సామ్రాజ్యవాదం పుట్టినప్పటినుంచి ఆవిధానంక్రింద పీడించబడే ప్రజలందరూ ఇంతకాలం స్థానికంగా ఎవరి దేశంలోవారు సాగించిన సామ్రాజ్యవ్యతిరేక పోరాటాలన్నీ ఐక్యమయి బ్రహ్మాండమైన ప్రపంచ సామ్రాజ్యవ్యతిరేక పోరాటంగా పరిణమించింది. ఈ పరిస్థితి పూర్తిగా రాకపూర్వమే 26 సంవత్సరాలక్రిందట సామ్రాజ్యవాదాన్ని తమదేశంలో నిర్మూలించిన సోవియట్ ప్రజలు ఈనాటి ప్రపంచ ప్రజల పోరాటంలో అగ్రగాములుగానిలబడి అన్నివిధాలా ఆదర్శకరంగాఉండి ఈ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలందరికి ముందుండి పోరాటనాయకత్వం వహిస్తూ దారిచూపుట చారిత్రికంగా న్యాయసమ్మతం కాదూ?

ఫాసిస్టుల వినాశనంతో ప్రతి దేశప్రజలయొక్క స్వాతంత్ర్యసమస్యకు ఎజెండాలో స్థానం ఏర్పడింది. చివరికి ఐక్యతకల్గిన లెబనాన్ ప్రజలు స్వాతంత్ర్యం సంపాదించుకో గలిగారు. దీనికంతటూ కారణం. లెబనాన్ప్రజల ఐక్యత. ప్రపంచ ప్రజల సహకారం మరేమీకాదని స్పష్టమే. చావుబ్రతుకుల పోరాటంలో హేయమైన సామ్రాజ్యవాదుల ఎత్తులను ప్రపంచ ప్రజలు సహించలేరు. అయితే ఈ మహదవకాశాన్ని వినియోగించుకొంటూ ప్రపంచ ప్రజల సహకారాన్ని పూర్తిగాపొందుతూ ఎజెండాలోఉన్న మనదేశ స్వాతంత్ర్యాన్నిగూడా సత్వరంగా సాధించాలంటే ఇతరదేశ ప్రజలవలె మనంగూడా ఐక్యమయి. ప్రపంచ ప్రజలు సాగిస్తున్న స్వాతంత్ర్యయుద్ధంలో మనకోటానుగూడా పూర్తిచేయుట అత్యవసరం. సోవియట్ ప్రజలు, చైనా ప్రజలు, ఆక్రమిత యూరప్‌లో ప్రజలు, బ్రిటిష్ ప్రజలు ఆస్ట్రేలియా, ఆఫ్రికా, అమెరికా ప్రజలందరూ - ఫాసిస్టు దురాక్రమణక్రిందికి వచ్చినవారు రానివారు అందరూ ఈనాడు తమతమ కోటాలను పూర్తిచేస్తున్నారు. సోవియట్ప్రజలు, చైనాప్రజలు తమకోటాలకు మించిపనిచేస్తున్నారు. అహోరాత్రాలు కోట్లమందిప్రజలు ఐక్యమవుతూ స్వాతంత్ర్యంకొరకు పోరాటంచేస్తుంటేమనం మన కోటాను పూర్తిచేయుట, మనదేశ క్షేమానికి, మనదేశ స్వాతంత్ర్యానికే అవసరం.

సోవియట్ విప్లవం బయలుదేరిననాడే సామ్రాజ్యవాదులను ఎదుర్కొనవలసిన బాధ్యత సోవియట్ ప్రజలకు ఏర్పడినది. పీడిత ప్రజాపోరాటాలు బలపడుట ఆ ప్రజల భవిష్యత్తుకేగాక సోవియట్ యూనియన్ ఉనికికి, స్థిరపడటానికి గూడా ఉపయోగపడింది. బలపడిన సోవియట్ యూనియన్ సాగించే పోరాటం సోవియట్ ప్రజలకేగాక, ఇతరదేశప్రజల స్వాతంత్ర్య ఆశయాలకుగూడా తోడ్పడుతోంది ఈవిధంగా ప్రజల విషయంలో జాతీయ అంతర్జాతీయ ఆశయాలు రెండూ కలిసిపోవుటవల్ల సోవియట్ ప్రజలతోపాటు ప్రపంచ ప్రజలందరూ బలపడీ ఈనాడు అందరూకలిసి పరస్పరంగానూ, సోవియట్ యూనియన్‌తోనూ ఐక్యమయి, సోవియట్ ప్రజల నాయకత్వం క్రింద ముందుకు సాగిపోతున్నారు.

మన అంతర్జాతీయ సాంప్రదాయమంతా ఫాసిస్టు వ్యతిరేక సాంప్రదాయమే. 1927 నుంచీ చేయబడిన కాంగ్రెసు తీర్మానాలన్నీ ఈ సాంప్రదాయాన్ని బలపరుస్తున్నాయి. ఫాసిస్టు వ్యతిరేకంగా పోరాడుతున్న ఐక్యప్రజలయొక్క మహత్తర శక్తిని కళ్ళారచూస్తున్నాం. 20 కోట్ల సోవియట్ ప్రజలు. 40 కోట్ల చైనాప్రజలు జాతీయైక్యతను నిర్మించుకున్నందువల్ల సాధిస్తున్న అద్భుత విజయాలను చూస్తున్నాం. చిన్న దేశాలైనా సోవియట్ విజయాలవల్ల ఉత్తేజపూరితులై ఐక్యతతో యుగోస్లావియా. గ్రీస్ ప్రజలు సాగిస్తున్న ప్రజాయుద్ధం మనకు ఆశ్చర్యకరంగా ఉంది. ఐక్యతమీద ఆధారపడి సామ్రాజ్యవాదులవద్దనుంచి స్వాతంత్ర్యాన్ని గుంజుకున్న లెబనాన్ ప్రజలు మనకు చక్కని ఐక్యతాపాఠాన్ని నేర్పారు. అతిబలహీన రాజ్యాలైనా బానిసత్వానికి శిరంవంచకుండా, ఐక్యతతో ఫాసిస్టులనెదిరిస్తున్ననార్వే. డెన్మార్కు ప్రజల స్వాతంత్ర్య తిరుగుబాట్లు. జాతీయ ఐక్యతయే ప్రధాన ఆయుధంగాకల్గి 7 సంవత్సరాలుగా జపాన్ బాంబులను ఎదిరిస్తున్న చైనా స్వాతంత్ర్య పోరాటం — అన్నీ మనలను హెచ్చరిస్తున్నాయి క్షణక్షణానికి సామ్రాజ్యవాదులు కల్పిస్తున్న అడ్డంకుల నన్నింటిని త్రోసివేసుకుంటూ ముందుకు సాగిపోతున్న సోవియట్ విజయాలు మనలను ఉత్తేజపరుస్తున్నాయి.

200 సంవత్సరాలుగా పీడిస్తూన్న సామ్రాజ్యవాదులు మనస్వాతంత్ర్యపోరాటాన్ని అణచాలని ఎంత ప్రయత్నించినా సాధ్యపడలేదు. 60 సంవత్సరాల జాతీయోద్యమాన్ని నాశనంచేయుటకు సామ్రాజ్యవాదులకు సాధ్యపడలేదు. జాతీయోద్యమంలో ప్రవేశించి, లోపలినుంచి దేశాన్ని నాశనంగావించి, జపానుకు ఒప్పగించాలని పంచమాంగదళంచేసిన ప్రయత్నాలను జయప్రదంగా భగ్నంచేశాం. దేశంలో ఏర్పడిన విషమపరిస్థితులలో జపాన్‌దాడి జరుగకపోవుటకు మూలకారణాలు (1) సోవియట్ సైన్యాలు హిట్లర్‌ను స్టాలిన్‌గ్రాడ్‌వద్ద ఓడించి ముందుకు పురోగమనం చేయకుండా ఆపివేయుట (2) మహత్తర ఫాసిస్టు వ్యతిరేక సాంప్రదాయాలతోకూడిన దేశభక్తి. (3) కాంగ్రెసు ఫాసిస్టు వ్యతిరేక సాంప్రదాయాన్ని కాపాడుతూ జాతీయైక్యతకొరకు ఉత్తేజపరుస్తున్న భారత కమ్యూనిస్టుపార్టీ కృషి. జపాన్‌దాడి రాకుండా చేయుటకు ఈ కారణాలుతప్ప మరేవీలేవు అయితే జపాన్ ప్రమాదం పూర్తిగా లేకుండాపోలేదు. ఫాసిజాన్ని ప్రపంచమంతటా రూపుమాపినప్పుడే ప్రపంచ ప్రజలందరి విముక్తి సాధ్యపడుతుందని తెలుసుకున్నాం.

ప్రస్తుత యుద్ధంలో మిత్రమండలియొక్క ఆశయాలు న్యాయమైనవనిచెప్తూ. మిత్రమండలి విజయాన్ని కాంగ్రెసుసంస్థకోరింది. మిత్రమండలప్రజల విజయంతోపాటు మన స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలంటే మార్గం ఒకటే మనప్రజాశక్తుల మీద ఆధారపడి. ఇతరదేశప్రజల సహకారంతో ఫాసిస్టువ్యతిరేక పోరాటంలో పాల్గొనుటయే. జాతీయైక్యత. ప్రపంచ ప్రజలఐక్యత - ఈ రెండే ప్రధానదేశంకోసం.

ప్రపంచం మొత్తంమీద స్వాతంత్ర్యానికి దారితీస్తున్నట్లు మనం తెలుసుకున్నాం. ప్రజాశక్తులమీద ఆధారపడకుండా వత్తిడిరాజకీయాల్లోపడి సామ్రాజ్యవాదం వైపు ఎదురుచూస్తూ ప్రజలనువదిలేస్తే గ్రీక్ కథలో చెప్పబడిన 'ఆంటియస్'కు పట్టినగతి తప్ప మరొకటి ఉండదు. అజేయమైన ప్రజాశక్తిమీద ఆధారపడి జాతీయైక్యతను నిర్మించుకోగల్గితే భవిష్యత్తుఅంతా మనదే.

ఈరోజున ఐక్యతయే పోరాటంగా పరిణమించింది. కారణం, సామ్రాజ్య వాదులకు ఆధారం కేవలం మన అనైక్యతతప్ప మరొకటికాదు. జాతీయైక్యతద్వారా, మన ప్రజాశక్తులను పెంపొందించుకొనుటద్వారా, సామ్రాజ్యవాదులను లొంగదీస్తూ ఫాసిస్టులను ఎదుర్కొని స్వాతంత్ర్యాన్ని సాధించుకోగల్గుతాం. నేటి ప్రపంచ రాజకీయాలన్నీ నేర్పేపాఠం ఇదే. సామ్రాజ్యవాదం బదులు మనం కోరేస్వయంనిర్ణయ హక్కును మనదేశంలో వివిధజాతులకు వర్తింపచేయుటద్వారా జాతీయైక్యతసాధ్య పడుతుంది. సోవియట్ యూనియన్ ఈ పాఠాన్ని స్పష్టంగా చాటుతోంది.

"మీదేశ స్వాతంత్ర్యం మీజాతీయైక్యతమీదనే ప్రధానంగా ఆధారపడియుంది. మీ జాతీయైక్యతను ఎంత త్వరగావృద్ధిచేసుకుని ఫాసిస్టువ్యతిరేక పోరాటంలో పాల్గొంటే అంత త్వరగా బయటనుంచి మీకు సహాయం రాగలదు." అని చైనా విషయంలో చెప్పినమాటలు మనకుగూడా వర్తించకమానవు.

మనమిత్రులు మనప్రక్కనే ఉన్నారు. 28 సంవత్సరాల సోషలిస్టు సాంప్రదాయం కల్గిన 20 కోట్ల సోవియట్ ప్రజలు, దేశభక్తి, విప్లవసాంప్రదాయాలు కల్గిన రెడ్ఆర్మీ, రెడ్నావికాదళం; చిరకాలస్నేహ సంబంధాలు కల్గిన 40 కోట్ల చైనాప్రజలు; బానిసత్వమంటే అనుభవంద్వారా గ్రహించి సామ్రాజ్యవాదుల యుద్ధానంతర ఎత్తులను భగ్నంచేస్తున్న యూరపియన్ ప్రజలు; మన జాతీయప్రభుత్వం, మన దేశనాయకులకొరకు ఆందోళనచేస్తున్న మిత్రమండలి ప్రజలు - వీరందరూ మన మిత్రులు. ఈమిత్రమండలిప్రజల అపారశక్తి రోజురోజుకూ వృద్ధిఅవుతోంది. సోవియట్ప్రజల నాయకత్వంక్రింద పురోగమనంచేస్తున్న మిత్రమండలిప్రజల అండ మనకున్నప్పుడు, మనకు విజయం తప్పదు. జాతీయైక్యతామార్గాన్ని, సామ్రాజ్యవాదుల అడ్డంకులను త్రోసివేసుకుంటూ ఫాసిస్టులతో స్వాతంత్ర్య పోరాటం సాగించే మార్గాన్ని, అజేయమైన ప్రజాశక్తిమీద ఆధారపడి ప్రజాయుద్ధాన్ని సాగించే మార్గాన్ని, ప్రపంచ ప్రజల సహకారంమీద మనదేశప్రజలమీద ఆధారపడి స్వాతంత్ర్యంపొందే మార్గాన్ని, సోవియట్ యూనియన్ చూపుతోంది.

బర్మా, మలయాలనుంచి సామ్రాజ్యవాదులు పాఠాలు నేర్చుకోలేదంటే వారిని ఖండించాం. కాని సామ్రాజ్యవాదులకు ప్రజలకు ఏమీ పోలికలేదు. జాతీయఐక్యత ద్వారా ఇతరదేశ ప్రజలు చిత్రిస్తున్న స్వాతంత్ర్యపోరాట చరిత్రలనుంచి మనం ఐక్యతాపాఠాన్ని తప్పక నేర్చుకుంటాం. స్వాతంత్ర్యబాటను సాగిపోతాం.

# భారతదేశ సమస్య

మన చరిత్ర మనకు తెలిసిందే. 1939 లో యుద్ధం ప్రారంభంకాగానే. సామ్రాజ్యవాదయుద్ధానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటాన్ని ప్రారంభించారు. జాతీయ సంస్థయైన కాంగ్రెసు సామ్రాజ్యవాదం వంక స్వాతంత్ర్యం కొరకు సంవత్సరం ఎదురుచూసింది. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజాపోరాటాన్ని ప్రారంభించమని దేశంలోని ప్రజలందరూ వత్తిడి తీసుకొని వచ్చినప్పుడు. దేశంలో చీలికలు ఉన్నవని, కాంగ్రెసుకు ముస్లింలీగుకు ఐక్యత లేనంతకాలం దేశవ్యాపిత పోరాటాన్ని ప్రారంభించుట అసంభవమని, పోరాటం ప్రారంభిస్తే ఈయుద్ధ సమయంలో హింసా దౌర్జన్యమార్గాల్లో నడవగలదని, అహింస నశిస్తుందని, కష్టదశలో ఉన్న బ్రిటిష్ ప్రభుత్వంమీద దెబ్బకొట్టుట న్యాయంకాదని, గాంధీజీ చెప్తూ పోరాటాన్ని సంవత్సరం గడిపాడు. ఇండియా సమస్యా పరిష్కారానికి దిగివస్తుందేమోనని బ్రిటిష్ ప్రభుత్వంవంక (ప్రజల శక్తిమీద ఆధారపడికాదు) ఎదురుచూసింది. 1940 ఆగస్టులో వైస్రాయిచేసిన ప్రకటనతో సామ్రాజ్యవాద వైఖరి స్పష్టపడింది. ఇక లాభంలేదనుకుని, కొంత వత్తిడిని తీసుకొనివచ్చుటకై కొన్ని నియమితహద్దులలో, జాతీయైక్యతలేనప్పటికి (ఇప్పుడు గాంధీజీ బ్రిటిష్ ప్రభుత్వం ఇక్కడ ఉన్నంతకాలం ఐక్యత సాధ్యపడదన్నాడు!) 15,000 మంది వ్యక్తులతో సత్యాగ్రహం సాగించాడు గాంధీ. ఈకథ అందరికి తెలిసిందే. మరొక సంవత్సరం గడిచింది. పరిస్థితులలో మార్పులు వస్తున్నాయి. హిట్లర్ కాకసస్ పర్వతాలకు చేరాడు. తూర్పున జపాన్ 1941 డిసెంబర్ 7న దాడి ప్రారంభించింది, ఫాసిస్టు ప్రమాదం ఇండియా దగ్గరకే వచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వానికి, భారతదేశానికి — రెంటికీ నూతన పరిస్థితి ఏర్పడింది. బర్మావలె ఇండియా గూడా జపాన్ క్రిందికి పోతుందేమో; అప్పుడు హిట్లరు, టోజో ఇద్దరూ ఐక్యమయితే. ఇండియా ప్రజలకేగాక వారికిగూడా ఫాసిస్టుబానిసత్వం తప్పదని గ్రహించిన ఇతరదేశ ప్రజల ఆందోళన ప్రారంభమయింది. ఇండియాసమస్యను పరిష్కరించి, 40 కోట్ల భారతీయులసహకారం సంపాదిస్తే ఫాసిజాన్ని తూర్పుప్రాంతంలో సులభంగా జయించవచ్చునని గ్రహించిన బ్రిటిష్‌ప్రజల ఆందోళన ఎక్కువయింది. పార్లమెంటులో ఇండియాసమస్యను పరిష్కరించమనే వత్తిడి ఎక్కువయింది.

ఈ నూతన పరిస్థితులలో బ్రిటిష్ప్రభుత్వం నాయకులను జైళ్ళనుంచి విడుదలచేసింది. నూతన పరిస్థితిని గుర్తించిన కారణంవల్ల 1941 డిసెంబరు 31 వ తేదీన సత్యాగ్రహ పోరాటాన్ని విరమిస్తూ కాంగ్రెసు తీర్మానించింది.

బ్రిటిష్ప్రభుత్వ స్థానాన్ని జపాన్ ఆక్రమిస్తే వచ్చేఫలితం? ఫాసిస్టు దాని పత్వమే నని గుర్తించింది. కాంగ్రెసు అందువల్ల ఈనూతన ప్రమాద పరిస్థితిని గుర్తించుటవల్లనే ఇద్దరు శత్రువులను ఎదుర్కొవలసి వచ్చిన సమయంలో పాత పద్ధతిలోచేసిన పోరాటాన్ని ఆపుచేయుట జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వానికిగూడా కలవరం బయలుదేరింది. యూరప్లో ఇంకా హిట్లర్కు పైచెయ్యి ఉన్నసమయంలో-యూరపియన్రంగాల్లో యుద్ధవ్యూహన్నంతా కేంద్రీకరించిన సమయంలో జపాన్ ఇండియామీదపడితే బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాదియైన ఇండియా జపాన్ క్రిందికి పోతుందేమో? అను భీతి బయలుదేరింది. సామ్రాజ్యరక్షణకొరకే, 1940 ఆగస్టు ప్రకటనను మార్చుకొని, నాయకులను విడుదలచేసి(పరిస్థితిలో మార్పురాక పోతే నాయకులను విడుదలచేస్తుందా సామ్రాజ్యవాద ప్రభుత్వం!) ఇండియా సమస్యపై ప్రపంచ ప్రజలవత్తిడివల్ల క్రిప్పను ఇండియాకు పంపవలసివచ్చింది.

ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొని దేశరక్షణ కొరకు 40 కోట్ల భారతీయులను ఉత్తేజపరచగల జాతీయ ప్రభుత్వాన్ని కోరింది కాంగ్రెసు. కాని దేశంలో రెండవ పెద్దపార్టీ అయిన ముస్లింలీగ్ సహకారంతో మహమ్మదీయ జాతుల స్వయంనిర్ణయహక్కు అంగీకరించియున్నట్లయితే ఐక్య భారతదేశం క్రిప్సను ఎదుర్కొనగల్గేదని కమ్యూనిస్టులు చెప్పారు ఈ జాతీయ ప్రభుత్వ కోర్కెను క్రిప్స్ ముందు పెట్టలేదు. వేరువేరుగా ఎవరికివారు జాతీయ ప్రభుత్వాన్నికోరారు. అందరూ వేరువేరుగా కోరుతున్న కోర్కెను, ఏదిలేకపోతే దేశరక్షణ సాధ్యపడదో ఆ జాతీయ ప్రభుత్వాన్ని కనీసకోర్కెగా కాంగ్రెసు కోరింది. ఆరోజుల్లోనే జపాన్ బాంబులు ప్రారంభమయినాయి. ఫాసిస్టు ప్రమాదం నెత్తిమీదకేవచ్చింది.

కాని జాతీయ ప్రభుత్వాన్ని ఇచ్చుటకు బ్రిటిష్ ప్రభుత్వం నిరాకరించింది. జపాన్ దాడిచేస్తే ఇండియా ఫాసిజంక్రిందికి పోవుటయేకాదు, బ్రిటిష్ ప్రజలకు ప్రపంచ ప్రజలందరికి బానిసత్వం గతి అయేమాటనిజమే. కాని బ్రిటిష్ ప్రజల యొక్క, ఇండియా ప్రజలయొక్క భవిష్యత్తుతో జూదమాడటం ప్రారంభించింది బ్రిటిష్ ప్రభుత్వం! వారి సామ్రాజ్యవాద ఎత్తుగడలను భగ్నం చేయుటకు ప్రజావత్తిడి ఇంకా కావలసి వచ్చింది.

అయితే జాతీయ నాయకులు ఏంచేశారు?

బ్రిటిష్ ప్రభుత్వం జాతీయ ప్రభుత్వ కోర్కెను నిరాకరించిన మాటనిజమే. కాని అంతమాత్రాన దేశానికి వచ్చిన ఫాసిస్టు ప్రమాదం ఎక్కడికిపోయింది?

నూతన ప్రమాద పరిస్థితిని గుర్తించిన నాయకత్వం అంతర్జాతీయ పరిస్థితులవల్ల కల్గేవత్తిడిపైన ఆధారపడి 1942 ఏప్రియల్‌లో క్రిప్సు వెళ్ళిపోయినప్పటినుంచి 1942 ఆగస్టు 8 వరకూ సామ్రాజ్యవాదంవంక ఎదురుచూచింది. దేశంలోని అనైక్యతను నిర్మూలించుటకుగాని, బ్రిటిష్ ప్రభుత్వం నెత్తిమీద ఉన్నప్పటికి మన దేశప్రజలను మన దేశరక్షణకై స్వతంత్రంగా తయారుచేయుటకుగాని ప్రయత్నాలు చేయలేదు. నూతన ప్రమాద పరిస్థితిని గుర్తించిన నాయకులు క్రిప్సును పంపించిన ప్రజా వత్తిడిని గుర్తించలేదు. దేశ ప్రజలమీదనే ఆధారపడుటకు తయారుకాలేదు. నూతన ప్రమాద పరిస్థితిని గుర్తించి పాత పద్ధతులలో సాగించిన పోరాటాన్ని ఆపుచేసిన నాయకులు తిరిగి పాతపద్ధతులలో ఆలోచించ ప్రారంభించారు. 1942 ఆగస్టు 8 వ తేదీన బొంబాయిలో పోరాటాన్ని ప్రారంభించుటకు అధికారాలు గాంధిజీకిస్తూ తీర్మానంచేశారు.

బ్రిటిష్ ప్రభుత్వం క్రిప్సు రాయబారాన్ని భగ్నంచేసిన తరువాత సామ్రాజ్యవాద ఎత్తులతో, (నూతన ప్రమాద పరిస్థితిని గుర్తించి కూడా!) పాతధోరణిలో తయారైంది. జాతీయ ఉద్యమాన్ని నాశనంచేయుటకు సన్నాహంచేసుకుంది. (పకిల్సు సర్క్యులర్) జాతీయ నాయకులు సమాధానానికి తయారు కాలేదని, కాంగ్రెస్ - లీగ్‌ల మధ్యగల చీలికలే ప్రతిష్టంభనను అంతచేయుటకు అడ్డుపడుతున్నవనీ, కాంగ్రెస్ నాయకులు ఫాసిస్టు సానుభూతికలవారని(!), ఇండియా సమస్యను పరిష్కరించుటకు తాను చేయవలసిన ప్రయత్నమంతా చేసిందని, ఇప్పుడు బాధ్యత అంతా జాతీయ నాయకులదేనని ప్రపంచ ప్రజలలో రేడియోల ద్వారా అబద్ధప్రచారం సాగించింది. తన మిలిటరీశక్తిమీద, దేశంలోని అనైక్యత మీద ఆధారపడి జపాన్‌ను ఎదుర్కోవాలని తయారైంది! ఆగస్టు 8 తీర్మానాన్ని అదునుగా తీసుకుని నాయకులను జైళ్ళలో పెట్టింది. దానితో దేశభక్తులు రెచ్చారు. దేశానికి వచ్చిన ప్రమాద పరిస్థితులలో ప్రక్కన జపాన్ కూర్చున్నపుడు, దేశభక్తులు కొందరు అరాచక చర్యలను ప్రారంభించారు. దానితో మన దేశచరిత్రలో ఒక విషమఘట్టం ప్రారంభమయింది.

జాతీయోద్యమాన్ని నాశనం చేయాలని, ప్రపంచ ప్రజల సహకారంలేకుండా ఇండియా సమస్యను వేరుచేసి తమ పెత్తనాన్ని సాగించుకోవాలనే సామ్రాజ్యవాదుల ఎత్తులు సాగలేదు. 40 కోట్ల ప్రజలు 200 సంవత్సరాలపాటు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటాన్ని, 50 సంవత్సరాలకుపైగా నిర్మించుకొన్న అసమాన జాతీయోద్యమాన్ని నాశనంచేయాలంటే సామ్రాజ్యవాదులకు ఎలా సాధ్యపడుతుంది? సామ్రాజ్యవాదుల అబద్ధప్రచారం క్రమేణా భగ్నంచేయబడుతోంది. "కాంగ్రెస్ ఫాసిస్టు వ్యతిరేకసంస్థ; జాతీయ ప్రభుత్వాన్ని

ఇస్తే శరీరంలో కొనఊపిరి ఉండేవరకూ జపాన్‌తో పోరాడుతాం"అని జవహర్‌లాల్. అజాదులు చెప్పిన మాటలు నెమ్మదిగా ప్రపంచ ప్రజలు తెలుసుకోగల్గాయి. భారత కమ్యూనిస్టుపార్టీ నూతన ఫాసిస్టు ప్రమాదం ఏర్పడినప్పటినుంచి దేశరక్షణకై జాతీమైక్యత నిర్మించి యుగోస్లావియా మొదలైన దేశాల్లో పోరాడుతున్నట్లుగా సామ్రాజ్యవాద ఎత్తులను త్రోసివేసుకుంటూ ఫాసిస్టు వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనటం ప్రారంభించింది. "కాంగ్రెస్ ఫాసిస్టు వ్యతిరేక సంస్థ. ఫాసిస్టు వ్యతిరేక జాతీయనాయకులను విడుదలచేయాలి. దేశరక్షణకు జాతీయ ప్రభుత్వం కనీస అవసరం" అని కమ్యూనిస్టులు దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ - లీగ్ ఐక్యతకై జాతివిభేదాలను అనుమానాలను తొలగించే స్వయంనిర్ణయహక్కును గుర్తింపచేయుటకు కృషిచేస్తూ, అధికోత్పత్తికై కృషి చేస్తూ, కార్మిక కర్షక వర్గాలలో దేశభక్తిని రగుల్గొల్పుతూ, దేశ ప్రజలందరిని ఉత్తేజపరుస్తూ అందరిని ఐక్యంచేస్తోంది. జపాన్ బాంబులు పడుతుంటే, ఫాసిస్టు వ్యతిరేక కాంగ్రెస్ సాంప్రదాయాన్ని బలపరచుటకై పంచమాంగదళాన్ని దేశ భక్తులనుంచి వేరుచేస్తూ, భీభత్సం లేకుండా ప్రజారక్షణదళాలద్వారా ప్రజలను, కార్మికవర్గాన్ని అరాజకంనుంచి తప్పించి మనోనిబ్బరాన్ని బలపరుస్తోంది. జాతీయ ప్రభుత్వం లేనప్పుడు, దేశంలో ప్రజలసహకారం నిరాకరిస్తున్నప్పుడు, దేశంలో బయలుదేరుతున్న ఆర్థిక సమస్యలను మాత్రం పరాయ ప్రభుత్వం ఎలా పరిష్కరించగల్గుతుంది? సమస్యలన్నీ విషమరూపందాలుస్తున్నకొలదీ, ప్రభుత్వ వైఖరి ఆ సమస్యలను మరింత విషమం అగుటకు కారణం అవుతున్నందువల్ల దేశంలోని ప్రజలనుంచి ప్రభుత్వం మరింత దూరం అవుతోంది. దేశంలోని ప్రజలనుంచేకాదు. ప్రపంచ ప్రజలనుంచిగూడా బ్రిటిష్ సామ్రాజ్య వాదులు దూరం అవుతున్నారు. అమెరికాలో, బ్రిటన్‌లో, ఆఫ్రికాలో, ఆస్ట్రేలియాలో ఇండియా సమస్య పరిష్కారం కావాలని, ఫాసిస్టు వ్యతిరేకులైన నాయకులను విడుదలచేయాలని ప్రజాందోళన పెరిగిపోతోంది. బ్రిటిష్ పార్లమెంటులోనూ, పార్లమెంటుకు బయటా ఇండియా సమస్య పరిష్కరించి జపాన్‌కువ్యతిరేకంగా భారతీయులనందరిని ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలోనికి తీసుకురావాలని ఆందోళన ఎక్కువవుతోంది.

హిట్లర్ పతనానికి, యూరప్‌లో ఫాసిస్టుల సత్వరనాశనానికి దారితీస్తున్న సోవియట్ విజయాలు ఇండియాసమస్యను మరీ ముందుకు తీసుకువస్తున్నాయి. యూరప్‌లో హిట్లర్‌ను ఎంత త్వరగాఓడిస్తే అంత త్వరగా మిత్రమండలి జపాన్ మీద కేంద్రీకరించవలసివస్తోంది. సోవియట్‌విజయాలు, ప్రజావర్తితి ఫలితంగా సామ్రాజ్యవాదులు రెండవరంగాన్ని ప్రారంభించుటకు సన్నాహాలుసాగిస్తున్నారు.

రెండవ రంగం, యూరప్‌మీద అన్ని దిక్కులనుంచి మిత్రమండలిసైన్యాలు ఎప్పుడు ప్రవేశించేదీ మిలటరీ వివరాలతో టెహరాన్ సమావేశంలో నిర్ణయించ బడింది. అప్పుడే చలికాలపు తియగుదాడిని ప్రారంభించి సోవియట్‌సైన్యాలు హిట్లరు సైన్యాలను నాశనంచేస్తూ ముందుకు దాడులు చేస్తున్నాయి. ఈ చలికాలపు రెడ్‌ఆర్మీ దాడులు 1944 ప్రారంభంలో సాగించబోయే రెండవ రంగం హిట్లర్‌ను నాశనంచేసినకొలదీ పసిఫిక్‌సముద్రంలోనుంచి జపాన్ దుండగీడులమీద తీవ్ర యుద్ధం సాగుతుంది. వెంటనే ఇండియాసమస్య ప్రధానసమస్యగా పరిణమించక తప్పదు. జపాన్ వ్యతిరేకదాడికి ఇండియా ప్రధానరంగం. అప్పుడే ఈదాడికి అవసరమైన మిలటరీసన్నాహం ప్రారంభమయింది. కానివెనుక ప్రజలసహకారం లేనిది, యుద్ధరంగం ముందుకు సాగిపోలేదు. అందువల్ల ఇండియాసమస్యను పరిష్కరించవలసినఅవసరం వస్తోంది. బలవత్తరమైన ఆందోళన మళ్ళీ ప్రారంభ మయింది; కానిసామ్రాజ్యవాదులు తమంతటతామే ప్రజాహక్కులను గుర్తించక పోగా, సాధ్యమైనంతవరకూ తమ పెత్తనాన్ని నిలబెట్టుకొనుటకే ప్రయత్నిస్తారనే సంగతి దేశభక్తులందరూ గుర్తించాలి. అయితే జాతీయైక్యతతోనూ, ఇతరప్రజల సహకారంతోనూ, ఇతర దేశాల్లో సామ్రాజ్యవాదుల యుద్ధానంతర ఎత్తులను ఎలా ధ్వంసంచేస్తున్నదీ తెలుసుకున్నాం. అదే విధంగా మనం మనచీలికలనురూపిమాపి జాతీయైక్యతను, దేశబలాన్ని పెంపొందించుకుంటూ మనదేశరక్షణ మనప్రజలభవి ష్యత్తు గుర్తిస్తూ మనదేశప్రజలమీద, ఇతరదేశ ప్రజాశక్తులమీద ఆధారపడి సామ్రాజ్యవాద ఎత్తులను, యుద్ధానంతర ప్లాసులను భగ్నంచేయగలం.

జాతీయ ప్రతిష్టంభనను అంతం చేయకుండా ఆఖరివరకూ తమ పెత్త నాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నించే సామ్రాజ్యవాదుల ముఠాలోవాడైన అమెరీ మీద బ్రిటిష్‌ప్రజలు తీసుకొనివస్తున్న వత్తిడిచూస్తే, ఇతరదేశప్రజలు కమ్యూనిస్టు పార్టీల ప్రోత్సాహంవల్ల మన సమస్యలకొరకు ఎలా ఆందోళన చేస్తున్నదీ తెలు స్తుంది:

కొంతకాలం నుంచీ 'అమెరీ ఇండియా మంత్రి పదవినుంచి తొలగిపోవా లని ఆందోళన ప్రారంభమయింది. బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ఈ ఉద్యమాన్ని తీవ్రంగా సాగించింది. డిసెంబర్ 11వ తేదీరాత్రి బర్మింగ్‌హామ్‌లో అమెరీ ఉపన్యసించడానికి వచ్చాడు. ఈ బర్మింగ్‌హామ్ ప్రజలతరఫునే అమెరీ పార్ల మెంటు సభ్యుడైనాడని మరిచిపోగూడదు. ఈసభకు వచ్చినంతమంది పూర్వం ఎప్పుడూ రాలేదని హిందూపత్రికా లండన్ విలేఖరి వ్రాస్తున్నాడు. ఉపన్యాసం ప్రారంభించినప్పటినుంచి ఒకటేగోల, కేకలు, నవ్వులు. అపహాస్యం ప్రారంభ

మయింది. బ్రిటిష్ ఆహారపదార్థాల పరిస్థితి అంతా జాగ్రత్తగా వెయ్యికళ్ళతో ఆహారమంత్రి అయిన లార్డ్‌వూల్టన్ చూస్తున్నాడని అమెరీ చెప్తున్నప్పుడు,

"వాటిలో కొంత ఇండియాకు ఎందుకు పంపించగూడదు?" అన్నారు సభికులు.

"అందరిదగ్గరనుంచి మాకు సహకారంకావాలి" అన్నాడు అమెరీ.
"కాదు కాదు, నీ సహకారానికి ఎదురుచూడటంలేదు మేము" అన్నారు సభికులు.

అమెరీ :—సోవియట్ యూనియన్ సహకారం తీసుకుంటున్నాం. (హర్షధ్వనులు)

అమెరీ :—ఆ హర్షధ్వనులకు కృతజ్ఞుడను.

ఒకరు :—ఆ హర్షధ్వనులు నీకుకావు. (సోవియట్‌కని భావం)

అమెరీ :— ఇంకా కొన్ని నిమిషాలకాలం వ్యవధి ఇవ్వండి.

అనేకమంది :—నీకు 20 సంవత్సరాలు ఇచ్చాం. ఇప్పటికే పొరపాటుచేసి ఇంత కాలంనుంచి నిన్ను సహించాం!

అమెరీ :—యుద్ధానంతర ప్రథమకర్తవ్యం ఈ బ్రిటిష్‌దీవులలోని పరిశ్రమలను, వ్యాపారాన్ని భద్రపరుచుటయే. తరువాత కర్తవ్యం, మనలను అతిక్లిష్ట దశలనుంచి ఈయుద్ధంలో రక్షించిన సామ్రాజ్యాన్ని నిర్మించుట.
ఇండియాతో సహకారం విషయమేనా మాట్లాడేది? (అనే ధ్వనులు)

అమెరీ :—ఇండియా విషయానికి వస్తాను. ఇండియాలో బయలుదేరిన దుర్భర కరువు.... (సభలో అన్నివైపులనుంచీ "ఇండియాలో కరువులేదని చెప్పావుగా?) మాకందరికి గొప్ప ఆశ్చర్యం కల్గించింది.
కరువు బయలుదేరుతుందని 12 నెలల క్రిందటే సొరెన్సన్ నీతోచెప్పాడు. (ధ్వనులు)

కరువు సమస్యను గురించి అమెరీ మాట్లాడినంతసేపూ మధ్యలో పెద్దగా అరుపులు, అభ్యంతరాలు వస్తూనేఉన్నాయి.

ఫ్రండ్స్ అంబ్లెన్సుయూనిట్ కరువువిషయంలోచేసిన సహాయాన్ని గురించి అమెరీ చెప్పబోగా,

"వారు చేసిన సేవ నీ గొప్పదనంకాదు" అన్నారు.

అమెరీ :—గొప్పవిషయంకాదు. కరువుకు కారణం దేవుడు........ ఇక్కడ సభికుల ఒక్కరి ఉద్దేశమేగాక, ఈదేశంలో ప్రజలందరు పార్లమెంటుగూడా బ్రిటిష్ సామ్రాజ్యంలో ఇండియా స్వతంత్రంగా ఉండాలనియే అందరి ఉద్దేశం.

అయితే ఇండియాను స్వతంత్రంగా ఉండనివ్వు! (కేకలు)

అమెరీ :— ఇండియాకు గొప్ప భవిష్యత్తు కలదని నమ్ముతున్నాను.

నీవు ఉన్నంతకాలం మాత్రం కాదు! (ధ్వనులు)

అమెరీ ఉపన్యాసమైనవెంటనే కొన్నిప్రశ్నలు వేద్దామనుకున్నారు. కాని ఒకరు ఉపన్యాసవేదికమీదకువచ్చి అమెరీ రాజీనామాఇవ్వాలని హెచ్చరించే తీర్మానాన్ని ఉపపాదించబోయారు. పోలీసులు అతన్ని బలవంతంగా వేదికనుంచిదింపారు. కాని సభ్యులకోపానికి వెరిచి పోలీసులు అతన్ని వదలివేయవలసివచ్చింది. అతడు తిరిగివచ్చి తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. అత్యంత ఉత్సాహంతో సభ్యులందరూ తీర్మానాన్ని ప్యాసుచేశారు.

అమెరీ భవిష్యత్తును నిర్ణయించడానికి బర్మింగ్‌హామ్ ప్రజలు సరిపోయారు. కాని సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలనుపీడించే ఒక ప్రపంచవిధానం, దాని భవిష్యత్తును నిర్ణయంచాలంటే ప్రపంచ ప్రజలందరూ ఐక్యం కావలసివచ్చింది. ఐక్యమై నిర్ణయిస్తున్నారుగూడా. 1917 నుంచి సామ్రాజ్యవాదం శాశ్వత సంక్షోభంలో చిక్కుకొనిపోయింది. సంక్షోభంలోనుంచి బయటపడి ప్రపంచపెత్తనం శాసించాలనే ప్రయత్నాలన్ని ప్రజాస్వాతంత్ర్య పోరాటాలముందు భగ్నం అవుతున్నాయి. ఈవిధంగా సామ్రాజ్యవాద నాశనానికి దారితీస్తున్న స్వాతంత్ర్య పోరాటాలను సోవియట్ విజయాలుమరింత తీవ్రంచేస్తున్నాయి. పతనమంతా సామ్రాజ్యవాదులదే! భవిష్యత్తుఅంతా ప్రజలదే!!

BCP

KVIAU2B197 BC

ప్రజాశక్తి ప్రెస్, బెజవాడ.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | KLVA112B197 |
| పుస్తకం పేరు | సోవియట్ విదేశాంగనీతి |
| తారీఖు | 11 February 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 87 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CII BCII |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | akshaya |
| పేజీలు విడదీసినది | akshaya |
| స్కాన్ చేసినది | Naveeda |
| పరీక్ష చేసినది | DAVEED |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |